అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 20-10-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 241 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

అంతా గోప్యమే...!

అటకెక్కుతున్న సర్వే ఫలితాలు

- మరుగునపడుతున్న వాస్తవాలు
- బలహీనపడుతున్న గణాంక వ్యవస్థ



నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వాస్తవాలను కప్పిపెడు తోంది. అధికారిక సమాచారాన్నే తారుమారు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోంది. గణాంకాలను రాజకీయ ఆయుధాలుగా మలచుకుంటూ ఎన్నికలలో ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తోంది. ఒకప్పుడు దేశానికే పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన జాతీయ గణాంక వ్యవస్థ ఇప్పుడు ప్రభుత్వ చర్యల కారణంగా బలహీనపడింది.విశ్వసనీయతను కోల్పోతోంది.

-జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, ఆర్థికవేత్త జయతీ ఘోష్

న్యూఢిల్లీ : పాలకులకు ప్రజల జీవన స్థితిగతులపై కనీస పరిజ్ఞానం ఉండి తీరాలి. ఎందుకంటే వారి జీవితాలను బాగు చేయాలంటే ఆ అవగాహన అవసరం. ప్రజలు ఎలా జీవిస్తున్నారు, వారు ఏం పని చేస్తున్నారు, ఎంత ఆర్జిస్తున్నారు, ఆదాయం-సంపదలో అసమానతలు, కనీస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా, విద్య-నైపుణ్యం ఏ స్థాయిలో ఉన్నాయి వంటి వివరాలన్నీ ప్రభుత్వాలకు తెలియాల్సిన అవసరం ఉంది. స్వాతంత్య్రానికి ముందు బ్రిటీష్ పాలకులు జరిపిన జనగణనలో కొంత మౌలిక సమాచారం లభించేది. 1950 తర్వాత గణాంక సేకరణలో పద్ధతులు మారాయి. స్థూల దేశీయోత్పత్తి వంటి జాతీయాదాయ సూచికలను అభివృద్ధి చేశారు. అలాగే ఆర్థిక ప్రణాళికలను రూపొందించారు. వినియోగ సర్వేల ఆధారంగా పేదరిక సూచికలను తయారు చేసి వెనుకబాటుతనాన్ని గుర్తించారు.

సర్వే ఫలితాలలో గోప్యత

అయితే 2014 తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అత్యవసర సమాచారం లభ్యత, విశ్వసనీయతలో పలు నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ ఆదాయ లెక్కింపునకు ప్రాతిపదికగా తీసుకోవాల్సిన సంవత్సరాన్ని మార్చడంతో ...2లో

భారత్‌లో పేదరికం తగ్గలేదు

ఐదేండ్ల క్రితం నాటి స్థాయిలోనే ఉంది



గడచిన ఐదు సంవత్సరాల కాలంలో దేశంలో పేదరికంలో ఎలాంటి మార్పు రాలేదు. 2019, 2020 సంవత్సరాలలో పేదరికం బాగా పెరిగినప్పటికీ 2021లో కొంత తగ్గింది. కానీ 2018లో ఏ స్థాయిలో ఉన్నదో గత సంవత్సరం కూడా అదే స్థాయిలో ఉన్నదని ప్రపంచబ్యాంక్ తాజా నివేదిక తెలిపింది. కోవిడ్ సమయంలో ప్రపంచంలోని అనేక దేశాలలో పేదరికం బాగా పెరిగింది. అయితే మన దేశంలో 2019 లోనే దాని పెరుగుదల ధోరణి కన్పించింది. 2లో..

కాంగ్రెస్ సునామీ

తెలంగాణలో వచ్చేది ప్రజా ప్రభుత్వమే..

- ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తాం
- కేసీఆర్ పాలనకు స్వస్తి పలకాలి
- బీఆర్ఎస్, బీజేపీ,ఎంఐఎం ఒక్కటే..
- కులగణన చేసేందుకు ఆ పార్టీలు జంకుతున్నారు : రాహుల్‌గాంధీ



నవతెలంగాణ-భూపాలపల్లి/ కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / పెద్దపల్లి టౌన్/ కరీంనగర్

'తెలంగాణలో సునామీలా కాంగ్రెస్ సర్కారు ఏర్పడబోతోంది. వచ్చేది మన ప్రజల ప్రభుత్వమే. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు గోస పడుతున్నారు.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించారు. పేదల ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్‌వైపే ఉంది.. కుల గణన చేపట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ జంకుతున్నాయ్.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపడుతాం. ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతాం..' అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో పాదయాత్ర, రోడ్‌షోల్లో పాల్గొంటున్న రాహుల్‌గాంధీ సహా పలువురు నేతలు గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించారు. కాటారం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. నగరంలోని రాజీవ్‌చౌక్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయా సభలు, కార్నర్‌మీటింగ్‌లలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. ఈ ప్రాంతంతో తమకు ప్రేమతో కూడిన కుటుంబ సంబంధం ఉందన్నారు. ఇక్కడ తమ పార్టీకి రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను గౌరవించి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని తెలిపారు. అయితే, తెలంగాణ ప్రజల కలలను కాలరాస్తూ ఇక్కడి బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీకి తెగబడిందన్నారు. కాళేశ్వరంతో ఎక్కడైనా నీళ్లు వచ్చాయా? కనీసం ఎవరికైనా లాభం జరిగిందా?, రూ.లక్ష రుణమాఫీ ఏ రైతుకైనా వచ్చిందా? అంటూ ...2లో

కాంగ్రెస్‌తోనే కార్మిక సమస్యలు పరిష్కారం

సింగరేణి ప్రవేయిటీకరణను అడ్డుకుంటాం : రేవంత్



3లో

రాహుల్ జీ.. దేశానికే టీచింగ్ పాయింట్ తెలంగాణ

మంత్రి కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



"మంథని దాకా వెళ్లారు.. పక్కనే కాళేశ్వరం. .ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించండి" అని మంత్రి కేటీఆర్ గురువారం ట్వీట్ చేశారు. 'దేశ సాగునీటి రంగ చరిత్రలోనే..అతి గొప్ప మానవ నిర్మిత ఇంజినీరింగ్ అద్భుతాన్ని చూసి తరించండి. సముద్రంలో కలుస్తున్న గోదావరిని ఒడిసిపట్టి.. బొట్టుబొట్టును ఎలా తెలంగాణ మాగాణాల్లోకి మళ్లిస్తున్నామో అర్థం చేసుకోండి. నీళ్ల పల్లమే కాదు.. బలమైన సంకల్పం ఉంటే... ఎత్తుకు ఎలా పరుగులు పెడతాయో తెలుసుకోండి. పాతాళంలో ఉన్న గోదావరి నీటిని.. ఆకాశానికి ఎత్తిపోసే బాహుబలి మోటార్ల బలాన్ని స్వయంగా బేరీజు వేసుకోండి. మొగులు వైపు చూసే దిగులు లేకుండా.. లక్షలాది మంది రైతులకు కొండంత ధీమా ఇచ్చిన కాళేశ్వరంపై పసలేని విమర్శలు ఇకనైనా మానుకోండి .కాంగ్రెస్ హయాం నాటి ఆకలి కేకల తెలంగాణ బీఆర్ఎస్ పాలనలో దేశం కడుపు నింపే అన్నపూర్ణగా ఎలా ఎదిగిందో కళ్లారా చూడండి' అంటూ ట్విటర్ వేదికగా రాహుల్‌కు సూచించారు.

మధ్య ప్రాచ్యంలో సుస్థిరత నెలకొనాలి

హింస, ఘర్షణలు పెచ్చరిల్లకుండా చూడాలి



- నెతన్యాహుతో రిషి సునాక్ భేటీ
- ఈజిప్ట్‌తో కలిసి పనిచేస్తామన్న జిన్‌పింగ్
- 27టన్నుల సాయంతో రష్యా విమానం
- అబ్బాస్‌కు మోడీ ఫోన్

గాజా, జెరూసలేం, న్యూఢిల్లీ : ఇజ్రాయిల్, హమస్ మధ్య ఘర్షణలు పెచ్చరిల్లి ప్రాంతీయ ఘర్షణలుగా విస్తరించకుండా చూడడం చాలా ముఖ్యమని బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్ పేర్కొన్నారు. ఇందుకోసమే పశ్చిమాసియా ప్రాంతవ్యాప్తంగా పలువురు నేతలను కలిసి మాట్లాడాలనుకుంటు న్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో రిషి సునాక్ గురువారం భేటీ అయి చర్చలు జరిపారు. అనంతరం ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌తో కూడా సమావేశమయ్యారు. హింస మరిన్ని ప్రాంతాలకు ...11లో



న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు సుప్రీం నోటీసులు

తదుపరి విచారణ 30కి వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తమపై నమోదైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ) కేసును సవాల్ చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, న్యూస్ వెబ్‌సైట్ హెచ్‌ఆర్ విభాగం హెడ్ అమిత్ చక్రవర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ పోలీసుల స్పందనను సుప్రీంకోర్టు కోరింది. గురువారం ...11లో

వేడెక్కిన ఎన్నికలు

రాహుల్ రాకతో పెరిగిన కాక

విమర్శలు, ప్రతివిమర్శలతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల ప్రచారహోరు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు గత వారం, పది రోజుల నుంచి మారిపోతున్నాయనీ, కాంగ్రెస్ పుంజుకుంటున్నదనే సర్కారీ వేగుల సమాచారంతో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. గతంలో తమకు బీజేపీనే ప్రత్యర్థి అన్న బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌పై విరుచుకుపడుతుండటం పట్ల రాజకీయ విశ్లేషకులను సైతం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఇందుకు ప్రభుత్వ ఇంటెలిజెన్స్ నుంచి వస్తున్న హెచ్చరికలే కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పైగా ప్రస్తుతం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన సోదరి ప్రియాంకాగాంధీతో కలిసి సంధిస్తున్న విమర్శలు గులాబీ కోటకు గట్టిగానే తగులుతున్నాయి. అందుకే సీఎం కేసీఆర్‌సహా అన్నాచెల్లెళ్లు కేటీఆర్,కవితలు సైతం రాహులపై విరుచుకుపడుతున్నారు.



దీంతో రాజకీయా ఒక్కసారిగా వెడేక్కాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముమ్మరమైంది. మాటల తూటాలు పేలుతున్నాయి. శూలాల్లాంటి విమర్శలు సంధిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేసుకుంటున్న పరస్పర విమర్శలు అప్పుడే జనంలో చర్చకు దారితీస్తున్నాయి. ఇరుపార్టీలు నేతలు వ్యక్తులుగా, మ్యానిఫెస్టోలపైనా విమర్శలు, ప్రతివిమర్శలకు దిగుతున్నారు. బస్సుయాత్ర పేర తెలంగాణలో అడుగుపెట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలు ఆలస్యం, గులాబీ సర్కారుపై పదునైన విమర్శలు ...11లో





చికెన్ ధరలు

హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్


ఫారం రేటు	రూ. 104
రిటైల్ (లైవ్)	రూ. 126
స్కిన్‌తో	రూ. 183
స్కిన్‌లెస్	రూ. 208

'జింఖానా'పై కన్ను పడింది

కేంద్రం చేతిలో క్లబ్బు అజమాయిషీ

- బీజేపీ నేతలు ఆడింది ఆట... పాడింది పాట
- లా ట్రిబ్యునల్ ఆదేశాలను సాకుగా చూపి కబళించే యత్నం





న్యూఢిల్లీ : దేశ రాజధానిలో బ్రిటీష్ పాలనలో ఏర్పడిన ప్రతిష్టాత్మక జింఖానా క్లబ్బు ఇప్పుడు కేంద్రంలోని అధికార బీజేపీ ఆజమాయిషీలో నడుస్తోంది. ఆ పార్టీ నేతలు ఆడింది ఆట... పాడింది పాటగా వ్యవహారాలు సాగుతున్నాయి. క్లబ్బు నిర్వహణలో అక్రమాలు జరిగాయని, నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ మోడీ ప్రభుత్వం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయడం, విచారణ అనంతరం క్లబ్బు బాధ్యతలను ప్రభుత్వానికి ట్రిబ్యునల్ అప్పగించడంతో ఆ సంస్థ పూర్వ వైభవాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దీనిపై పలువురు సభ్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

గత నాలుగు సంవత్సరాలుగా ఢిల్లీ జింఖానా క్లబ్ న్యాయ వివాదాలలో కూరుకుపోయింది. నిధుల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘన, చట్టవిరుద్ధమైన సభ్యత్వాలు వంటి ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఒకప్పుడు రికార్డు స్థాయిలో రూ.62 కోట్ల ఆదాయం పొందిన ఈ క్లబ్బు నెలకు కోటి రూపాయల నష్టాన్ని మూటకట్టుకుంటూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే స్థితికి చేరుకుంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న కేంద్ర ప్రభుత్వం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్ అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని తేల్చింది. క్లబ్బు నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతించింది. 2022 ఏప్రిల్ 3వ తేదీ నుండి కేంద్రం నియమించిన కమిటీ ఆధ్వర్యంలోనే క్లబ్బు వ్యవహారాలు నడుస్తున్నాయి. ఈ కమిటీలో సుప్రీంకోర్టు న్యాయవాది, బీజేపీ ప్రతినిధి నళిన్ కోహ్లీ కూడా సభ్యుడే.

మసకబారిన ప్రతిష్ట

క్లబ్బు సభ్యులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రోడ్డెక్కడంతో దాని ప్రతిష్ట మసకబారింది. కోట్లాది రూపాయల సొమ్ము క్లబ్బు నుండి తరలిపోయిందని సభ్యుడైన ఓ మాజీ ఎంపీ ఆరోపించారని ఫైనాన్షియల్ టైమ్స్ ఆరోపించింది.

పట్టించుకునే దిక్కేది?

తాజా పరిణామాలపై 84 సంవత్సరాల రిటైర్డ్ ఆర్మీ మేజర్ అతుల్ దేవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లబ్బుతో ఆయనకు యాభై సంవత్సరాల అనుబంధం ఉంది. 'ఈ రోజు మా క్లబ్బుకు జరిగింది.

రేపు ఏ క్లబ్బుకైనా ఇలాంటిదే జరగవచ్చు' అని ఆయన చెప్పారు. క్లబ్బు ఆజమాయిషీ బీజేపీ చేతుల్లోకి వెళ్లడాన్ని వ్యతిరేకిస్తూ మరో తొమ్మిది మంది సభ్యులతో కలిసి ఆయన న్యాయస్థానాన్ని ఆశ్ర యించారు. 'మీరు కమిటీ సభ్యులుగా ఎన్నికైతే కమిటీ లోని మొత్తం పదిహేను వేల మందికీ మీరెవరో తెలు స్తుంది. మీకు అందరితో సంబంధాలు ఉంటాయి. ఫోన్ చేస్తే చాలు...పని జరిగి పోతుంది. మరి ఇప్పుడో? అంతా ప్రచ్ఛన్న యుద్ధమే. అనేక పనులు పెండింగ్‌లో పడిపోయాయి. పట్టించుకునే వారే లేరు' అని వాపోయారు.

పౌర సమాజంపై పెత్తనం కోసమే...

మోడీ ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు, మేధావులు సహా తనను విమర్శించే వారిపై ఉక్కు పాదం మోపుతున్న విషయం తెలిసిందే. జింఖానాలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఇది కేవలం ఓ రిక్రియేషన్ క్లబ్బుపై ఆధిపత్యం చెలాయించడం మాత్రమే కాదని, పౌర సమాజాన్ని పూర్తిగా తన చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు చేసిన ప్రయత్నమేనని విమర్శకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు ఏదో ఒకటి చేయకపోతే క్లబ్బు పరిస్థితి చేయి దాటిపోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయితే అలాంటిదేమీ లేదని క్లబ్బు వాదిస్తోంది. 2021 ప్రారంభం నుండి ఈ క్లబ్బును వివాదాలు చుట్టుముట్టాయి. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి పోలీసులు, సీనియర్ అధికారులు, మీడియా ప్రతినిధుల ముందు ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈ సంస్థ నిర్వహణను చేపట్టిందని ప్రకటించారు. ఏదేమైనా జింఖానాను తిరిగి తమ చేతుల్లోకి తీసుకోవాలని కొందరు సభ్యులు న్యాయ పోరాటం సాగిస్తున్నారు.

విచారణల పేరుతో...

కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత జింఖానాపై దృష్టి సారించారు. క్లబ్బులో అవకతవకలు జరుగుతున్నాయంటూ విచారణ జరిపించారు. 2000వ సంవత్సరంలో అధికారులు రెండు వేల పేజీల నివేదికను రూపొందించారు. మరో నివేదిక కూడా క్లబ్బుకు అవినీతి మరక అంటించింది. ఒకవేళ తప్పు జరిగి ఉంటే దానిని నిరూపించి, తగిన చర్యలు తీసుకోవచ్చునని, అయితే జింఖానాను ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇవేమీ చేయలేదని అతుల్ దేవ్ విమర్శించారు.

అస్మదీయుల హవా

జింఖానా క్లబ్బులో చేరేందుకు ఓం పాఠక్ అనే వ్యక్తి 1982లో దరఖాస్తు చేశారు. అయితే దానిని క్లబ్బు కమిటీ ఆమోదించలేదు. మాజీ సైనికుడైన పాఠక్ బీజేపీ నాయకుడు కూడా. క్లబ్బు నిర్వహణ బీజేపీ చేతిలోకి రాగానే ఆయన్ని నూతన అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు. అయితే తనను ఎందుకు ఆ పదవిలో నియమించారో తెలియదని, ఎవరో ఫోన్ చేసి చెబితే అంగీకరించానని ఆయన చెప్పుకొచ్చారు. కానీ పదవిలో రాగానే ఆయన తనదైన ముద్ర వేయడం ప్రారంభించారు. అతుల్ దేవ్‌ను, మరికొందరు సభ్యులను ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టారు. క్లబ్బు లౌకిక స్వభావాన్ని దెబ్బతీసేలా లైబ్రరీలో భగవద్గీత ప్రతిని ఉంచారు. బకాయిలు చెల్లించని 400 మందిపై బహిష్కరణ వేటు వేశారు. వీరిలో శక్తివంతమైన కుటుంబాలకు చెందిన సభ్యులు కూడా ఉన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, బీజేపీ మంత్రి కుమారుడు కూడా పాఠక్ బాధితులే. ఇప్పుడు ఈ వ్యవహారం ఢిల్లీ హైకోర్టు విచారణలో ఉంది. తొమ్మిది నెలల పాటు నియంతలా వ్యవహరించిన పాఠక్ చివరికి గత సంవత్సరం ఏప్రిల్‌లో పదవి నుండి వైదొలిగారు. ఆ తర్వాత కమిటీలో మరికొందరు బీజేపీ విధేయులైన అధికారులను చేర్చారు.

కనీస మద్దతు ధరలు బూటకం

మోడీ ప్రభుత్వ నాటకాలను బయటపెట్టాలి : శాఖలకు ఏఐకేఎస్ పిలుపు

న్యూఢిల్లీ : రైతులకు, రాయితీలతో కూడిన పంటల వైవిధ్యతకు ప్రోత్సాహక ధరలకు హామీ కల్పిస్తూ 2024-25 రబీ మార్కెటింగ్ సీజనుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ)ను అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఖండించింది. అఖిల భారత స్థాయిలో సగటు ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు ఇస్తున్నామంటూ చెప్పడాన్ని తీవ్రంగా విమర్శించింది. గోధుమలు క్వింటాల్‌కు రూ.150 అధికంగా మద్దతు ధర ఇవ్వడం 2014 నుంచి అత్యంత అధికమని ప్రభుత్వం పేర్కొనడం బూటకమని కిసాన్‌సభ విమర్శించింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంఎస్‌పి ప్రకటిస్తారనే వాస్తవాన్ని ఎవరైనా దృష్టిలో పెట్టుకుంటే ఇది బూటకమని స్పష్టంగా వెల్లడవు తుందని ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలె, విజ్జు కృష్ణన్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్పత్తి వ్యయమంటూ ప్రస్తావించినది సమగ్ర సిటు వ్యయం కాదని, అతి తక్కువగా వున్న ఎటు ప్లస్ ఎఫ్‌ఎల్ అని ఆ ప్రకటన పేర్కొంది. రైతులను మోసగించేందుకు నిజాయితీ లోపించిన ప్రయత్న మని విమర్శించింది. రైతులను ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణా రైతులను తప్పుదారి పట్టించేందుకు బిజెపి ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని వారు విమర్శించారు.

సిటూ వ్యయానికి, ఎటూ ప్లస్ ఎఫ్‌ఎల్ వ్యయానికి చాలా ఎక్కువగా తేడా కనిపిస్తోందని, అలాగే రాష్ట్ర ప్రతిపాదనలకు, సీఏసీపీ ప్రతిపాదనలకు కూడా తేడా బాగా వుందని పేర్కొంది. ప్రతి పంటకు క్వింటాల్‌కు రైతులు ఎదుర్కొనే నష్టాలను ఆ ప్రకటనలో వివరించారు. గోధుమ పంటకు క్వింటాల్ కు సీటూ వ్యయాన్ని రూ.2051గా పంజాబ్ ప్రభుత్వం అంచనా వేసింది.అదే సమయంలో సీఏసీపీ చేపట్టిన ఏటూ ప్లస్ ఎఫ్‌ఎల్ వ్యయం కేవలం క్వింటాల్‌కు రూ.741గా వుంది. అంటే సీటూ వ్యయాని కన్నా క్వింటాల్‌కు ఏకంగా రూ. 1310 తక్కువగా వుందని ఆ ప్రకటన వివరించింది. పంజాబ్‌లో దాదాపు 35లక్షల హెక్టార్లలో గోధుమ పంట సాగవుతోంది. ఈ రకంగా పంజాబ్ రైతులు ఒక్క గోధుమ పంటకు సంబంధించే ఏకంగా రూ.13,500కోట్లు నష్టపోతున్నారని కిసాన్‌సభ నేతలు వివరించారు. మహారాష్ట్రలో ఏటా గోధుమ రైతుల నష్టం రూ.4640కోట్లుగా వుంది.

చనా (కాబూలీ శనగలు) విషయంలో తెలంగాణా రాష్ట్ర సిటు అంచనా క్వింటాల్‌కు రూ.6055గా వుండగా, ఎటు ప్లస్ ఎఫ్‌ఎల్ కేవలం క్వింటాల్‌కు రూ. 2290గానే వుంది. అంటే క్వింటాల్‌కు రూ.3765 తక్కువగా వుంది. క్వింటాల్ ఎంఎస్‌పిని రూ.9351 గా ప్రకటించాలని రాష్ట్రం సూచించింది. అంటే ప్రకటించిన ఎంఎస్‌పి కన్నా క్వింటాల్‌కు రూ.3911 ఎక్కువన్నమాట. ఇక్కడ రైతు హెక్టార్‌కు రూ. 58,665 నష్టపోతున్నాడు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అను సరిస్తున్న విధానాల కారణంగా భారతదేశంలోని రైతులు పదే పదే నష్టపో తున్నారు. మోసగించబడుతున్నారు. పైగా రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామంటూ ప్రభుత్వం ఊదరగొడుతోంది.

చివరకు ఏ మాత్రమూ ప్రోత్సాహకరంగా లేని రీతిలో ప్రకటించిన ఎంఎస్‌పి కూడా కేవలం ఊహాత్మకంగానే వుంది. ఎందుకంటే కొనుగోళ్ళు లేనందున మెజా రిటీ రైతులకు ఇది ఎలాంటి లాభాలను ఇవ్వడం లేదు. అందువల్లే ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీ కల్పించాలని రైతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారని ఎఐకెఎస్ పేర్కొంది.ప్రభుత్వ వైఖరి బహిర్గతం చేసేలా, సమాజం లోని అన్ని వర్గాలకు ఈ సమాచారాన్ని చేరవేసేలా చర్యలు తీసుకోవాలని, నిరసన తెలియచేయాలని ఎఐకెఎస్ తన శాఖలకు పిలుపునిచ్చింది. పెద్ద మొత్తంలో డబ్బును వాణిజ్య ప్రకటన లకు వెచ్చిస్తూ, కార్పొరేట్ మీడియాను తమ ప్రచారానికి ఉపయోగించుకుంటున్న బీజేపీకి ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లోని ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరింది.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దసరా, దీపావళి పండుగల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ - సంత్రాగచి (అక్టోబర్ 20న), సంత్రాగచి - సికింద్రాబాద్ (అక్టోబర్ 21న), నాందేడ్-కాకినాడ టౌన్ (అక్టోబర్ 21న), కాకినాడ టౌన్-నాందేడ్ (అక్టోబర్ 22న), సికింద్రాబాద్-నర్సాపూర్ (అక్టోబర్ 22న), విశాఖపట్నం-కర్నూల్ సిటీ (అక్టోబర్ 24న, అక్టోబర్ 31న, నవంబర్ 7న, నవంబర్ 14న), కర్నూల్ సిటీ- విశాఖపట్నం (అక్టోబర్ 25న, నవంబర్ 1,8, 15 తేదీల్లో) మధ్య ఈ రైళ్లు నడుపనున్నారు.

సికింద్రాబాద్-సంత్రాగచి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు నల్లగొండ, మిర్యాలగూడలో, నాందేడ్ - కాకినాడ టౌన్ - నాందేడ్ రైలు బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం తదితర స్టేషన్లలో ఆగుతుంది. సికింద్రాబాద్ - నర్సాపూర్ రైలుకు జనగాం, కాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, రాయనపాడు స్టేషన్లలో, విశాఖపట్నం- కర్నూల్ - విశాఖపట్నం రైలు మిర్యాలగూడ, నల్లగొండ, మల్కాజిగిరి, ఉమ్దా నగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల స్టేషన్లలో ఆగుతుంది.

అంగన్‌వాడీలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- సమ్మె కాలం వేతనాలను వెంటనే చెల్లించాలి : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ ఉద్యోగులకు సమ్మె కాలంలో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ ఇచ్చిన నిర్దిష్ట హామీలను అమలు చేయాలనీ, సమ్మె కాలం వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఐసీడీఎస్ కమిషనర్ శృతికి వారు వినతిపత్రం అందజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంగన్‌వాడీ టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. 1 లక్ష, ఆసరా పెన్షన్ చెల్లిస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదన్నారు. పీఆర్సీ వర్తింపు, మినీ అంగన్వాడీ అప్‌గ్రేడ్, ప్రమాదబీమా, మే నెల సెలవులు, ఆన్‌లైన్ యాప్‌ల సమస్య పరిష్కరిస్తామన్న వాటిలో ఒక్కటీ అమల్లోకి తేలేదన్నారు. వేతనాల పెంపుపై సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామన్న ప్రస్తావనే లేదన్నారు. మంత్రుల హామీ ప్రకారం సమ్మె కాలం వేతనాలు రాకపోవడంతో బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో అంగన్‌వాడీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు.

కాంగ్రెస్ సునామీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు కాజేస్తున్నారన్నారు. రైతుబంధుతో ధనిక రైతులకే లాభం చేకూరుతోందని, తమ ప్రభుత్వం వచ్చాక భూమిలేని రైతులకూ సాయం అందిస్తామని వివరించారు. దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి ఇస్తానని కేసీఆర్, పేదల బ్యాంక్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తానని ప్రధాని మోడీ ఇద్దరూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

రామగుండం సింగరేణి కార్మికులతో తాను మాట్లాడానని, సింగరేణి గనులు ప్రయివేటుపరం కానివ్వబోమని హామీ ఇచ్చారు. సింగరేణిని అదానీకి అప్పజెప్పేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తే అడ్డుకున్నామని తెలిపారు. దేశంలోని గనుల ప్రయివేటీకరణకు తాము వ్యతిరేకంగా పోరాడి ఆపగలుగుతున్నామని వివరించారు. ప్రభుత్వ కంపెనీలకు ఒక రేటుతో, ప్రయివేటు కంపెనీలకు మరో రేటుతో దేశ సంపదను కొల్లగొడుతున్నారని చెప్పారు. ఓబీసీల జపం చేసే ప్రధాని మోడీ ప్రభుత్వంలో 90 మంది కార్యదర్శులు ఉంటే.. వారిలో ముగ్గురే ఓబీసీలు ఉన్నారని తెలిపారు. పేదలకిచ్చే స్కీములకు ఎన్ని నిధులు కేటాయించాలి?., ప్రభుత్వ ఆస్తులు ఏవి అమ్మాలనే లెక్కలు తీస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తాను ప్రశ్నిస్తే పార్లమెంట్‌లో మోడీ కనీసం సమాధానం ఇవ్వలేదన్నారు. పైగా బీజేపీని ప్రశ్నిస్తున్నాననే కక్షతో తనపై 27అక్రమ కేసులు బనాయించి పార్లమెంట్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేసి.. ఇంటిని సైతం ఖాళీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను వెనక్కి తగ్గనని, ప్రజల పక్షానే పోరాడుతానని చెప్పారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామన్నారు. వచ్చిన తొలి రోజుల్లోనే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి ఆయా కులాల వారీగా రాజకీయంగా, ఆర్థికంగా న్యాయం చేకూర్చుతామని అన్నారు.

ఇచ్చిన ప్రతిమాటనూ నిలబెట్టుకుంటాం

'రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టుకుంటాం. ప్రతిపేద మహిళకు రూ.2500 మొదలుకుని ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేస్తాం' అని రాహుల్‌గాంధీ అన్నారు. ఇందుకు కర్నాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో తమ ప్రభుత్వాల హామీల అమలును ప్రజలు గమనించాలని కోరారు. కేసీఆర్, ఆయన కుటుంబ పరివారం జనం సొమ్మును జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం పేరుతో రూ.లక్ష కోట్లు అవినీతి చేసినా ఈ సర్కారుపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరగవని, అదే బీఆర్‌ఎస్‌కు, బీజేపీకి మధ్య ఉన్న మైత్రిని తేటతెల్లం చేస్తోందని అన్నారు. ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయిస్తున్న మోడీ ప్రభుత్వం తెలంగాణలో ఎందుకు చేయించట్లేదని ప్రశ్నించారు.

ఏ ఒక్క హామీనీ బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం ఒక్కటయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన కేంద్రంలోని నరేంద్ర మోడీ రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేస్తోందని ఎద్దేవా చేశారు.

దేశంలో అదానీలాంటి పారిశ్రామికవేత్తలు లక్షల కోట్లు అప్పు తీసుకుంటే వారు అడగకుండానే రుణమాఫీ చేస్తున్నారని, రైతులు, మహిళలు, యువకులు రుణాలు తీసుకుంటే రుణమాఫీ ఎందుకు చేయరని ప్రశ్నించారు. ఎంఐఎం, బీజేపీ లోపాయికారి ఒప్పందంతో ముందుకు సాగుతున్నాయని, ఇతర రాష్ట్రాల్లో ఎంఐఎం అభ్యర్థులను నిలబెడుతూ పరోక్షంగా బీజేపీకి సహకరిస్తోందని ఆరోపించారు. దేశ సంపద ఎవరి వద్ద ఉందో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వెలికి తీసి పేద కుటుంబాలకు అందజేస్తామని తెలిపారు.

రాహుల్‌గాంధీ వెంట తెలంగాణ ఇన్‌ఛార్జి మాణిక్‌రావు థాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మధుయాష్కి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ములుగు ఎమ్మెల్యే సీతక్కతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

రాహుల్ గాంధీ బైక్ ర్యాలీలో అపశృతి

- కొండ సురేఖకు తప్పిన ప్రమాదం



నవతెలంగాణ- భూపాలపల్లి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భూపాలపల్లి పర్యటనలో నిర్వహించిన బైక్ ర్యాలీలో అపశృతి చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా జయశంకర్-భూపాలపల్లి జిల్లా చెల్పూర్ జెన్కో నుంచి జిల్లా కేంద్రంలోని బాంబుల గడ్డ వరకు కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ బైక్ నడుపుతూ కిందపడిపోయారు. కాగా స్వల్ప గాయాలతో ఆమె బయటపడ్డారు.

ఎన్నికల్లో నేను పోటీ చేయదలుచుకోలేదు

- ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే శాసనసభ ఎన్నికల్లో తాను పోటీ చేయదలుచుకోలేదని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. గురువారం కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ ఆధ్వర్యంలో సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్నికలు మారిన తీరుపై మాట్లాడుతూ ఎన్నికలంటే మొత్తం పైసలాటగా మార్చారని ఆయన వ్యాఖ్యానించారు.

బీఆర్‌ఎస్ గద్దె దిగితేనే బడ్జెట్ విద్యాసంస్థలకు మనుగడ

- మళ్లీ అధికారంలోకి వస్తే వాటికి చావు తప్పదు : తెలంగాణ కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం గద్దె దిగితేనే రాష్ట్రంలో బడ్జెట్ విద్యాసంస్థలకు మనుగడ ఉంటుందని పలువురు వక్తలు తెలిపారు. బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి వస్తే ఆ సంస్థల చావు తప్పదని హెచ్చరించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ కన్వీనర్ గౌరీ సతీష్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 'విద్యావ్యవస్థ నిర్మాణమా? విధ్వంసమా?'అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ టి.పాపిరెడ్డి, టీఎల్ఎఫ్ గౌరవ అధ్యక్షులు కత్తి వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక మొదటి దాడి విద్యావ్యవస్థపైనే చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోదండరామ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని దింపేందుకు రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉందనీ, అందువల్ల మరింత సాహసంగా ముందుకెళ్లాలని సూచించారు. 1990ల్లో పెరిగిన నిరుద్యోగం నుంచి తప్పుకునేందుకు బడ్జెట్ విద్యాసంస్థలు ఉపయోగపడ్డాయనీ, లెక్చరర్లకు, టీచర్లకు ఉపాధినిచ్చాయని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్ల తాకిడికి విలవిలలాడిన ఈ విద్యాసంస్థల ప్రతినిధులు తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారని వివరించారు. అయితే స్వరాష్ట్రం వచ్చాక బీఆర్‌ఎస్ సర్కార్ వేధింపులతో రాష్ట్రంలో దాదాపు 150 ఇంజినీరింగ్, 400 డిగ్రీ , వెయ్యి జూనియర్ కాలేజీలు మూతపడ్డాయని తెలిపారు. వీటిపైకి విజిలెన్స్, పోలీసులను ప్రయోగిస్తున్న సర్కార్ కార్పొరేట్లకు అండగా నిలబడిందని విమర్శించారు. పాపిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని కాలేజీలు మూతపడే ప్రమాదముందని హెచ్చరించారు. మళ్లీ బీఆర్‌ఎస్ వస్తే ఆయా సంస్థల చావు తప్పదనుకుంటే, సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తాను ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా ఉన్న సమయంలో ఆయా కాలేజీలపై విజిలెన్స్ వేయాలని ఒత్తిడి తెచ్చినా తాను వ్యతిరేకించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రాధాన్యతాంశాల్లో విద్య, వైద్యం లేదంటూ, ఇదే విషయాన్ని చాలాసార్లు సమీక్షల్లో కూడా సీఎం చెప్పారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ మళ్లీ వచ్చి ఇవే విధానాలు కొనసాగితే 75 శాతం కాలేజీలు రెండు, మూడేండ్లలో మూతపడటం ఖాయమన్నారు. వాస్తవాల ఆధారంగా ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ నాగయ్య, సీనియర్ కరస్పాండెంట్ సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నుంచి పాస్ పొందిన జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణతోసహా త్వరలో నాలుగు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా జర్నలిస్టులు, 12 ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఈసీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. ఎఫ్‌సీఐ, ఏఏఐ, పీఐబీ, ఎయిర్, విద్యుత్ శాఖ, రైల్వే, వైద్యరోగ్య శాఖ, ఆర్టీసీ, పౌరసరాఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, వార్తల సేకరణ కోసం ఈసీ నుంచి పాస్ పొందిన జర్నలిస్టులు, ఫైర్ సిబ్బందికి కొత్తగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. వీరంతా నవంబర్ ఏడవ తేదీలోగా ఫారం-12 డీ రూపంలో దరఖాస్తు చేయాలి. కాగా, కొత్త ఓటర్లకు నెలాఖరు నుంచి ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ జరగనుంది. ఈఏడాది రెండు విడతలుగా ఓటర్ల జాబితా ప్రకటించారు. 2023 జనవరి నుంచి కొత్తగా 40 లక్షల దరఖాస్తులను అధికారులు పరిష్కరించారు. జనవరి ఒకటి నుంచి 27 లక్షల 50వేలకు పైగా ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించి తపాలా శాఖ ద్వారా ఓటర్ల చిరునామాలకే పంపించారు. ఆ తర్వాత కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారికి సంబంధించిన గుర్తింపు కార్డుల ముద్రణ కోసం ఇప్పటికే ఆర్డర్ చర్యలు తీసుకున్నారు. మిగిలిన వారి కార్డుల ముద్రణ పూర్తి చేసి పంపిణీ చేయనున్నారు.

పేదరికం తగ్గలేదు

న్యూఢిల్లీ : ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం 2018లో 151.79 మిలియన్ల భారతీయులు పేదరికంతో అలమటించగా 2019లో ఆ సంఖ్య 176.09 మిలియన్లకు పెరిగింది. అంటే ఆ సంవత్సరంలో పేదల సంఖ్య సుమారు 24 మిలియన్లు పెరిగిందన్న మాట. 2018లో మన దేశంలో పేదరిక రేటు 11.09% ఉంటే 2021లో 11.9%గా నమోదైంది. అయితే ఈ రేటు 2020లో చాలా ఎక్కువగా అంటే 14.72%గా ఉంది.

ప్రపంచబ్యాంక్ లెక్కల ప్రకారం కొనుగోలు శక్తి ఆధారంగా తీవ్రమైన పేదరిక రేటు అంటే రోజుకు రూ.180. కేంద్ర ప్రభుత్వం వద్ద 2011-12 నుండి కుటుంబ వినియోగదారుల వ్యయ సర్వే (సీఈఎస్) సమాచారం అందుబాటులో లేదు. దీంతో మన దేశంలో పేదరికానికి సంబంధించిన అంచనాల కోసం 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' సంస్థ పైనే ప్రపంచబ్యాంక్ ఆధారపడింది. ఈ సంస్థ జరిపిన సర్వేలో వెల్లడైన సమాచారాన్ని తన అంచనాల కోసం ఉపయోగించుకుంది. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబందించిన సీఈఎస్‌ల ఫలితాలు సార్వత్రిక ఎన్నికల తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది. 2017-18లో ప్రభుత్వం ఇలాంటి సర్వేని జరిపినప్పటికీ వివరాలు బహిర్గతం చేయలేదు. అయితే బయటికి పొక్కిన సమాచారం ప్రకారం పేదరిక స్థాయి బాగా పెరిగింది. గత 45 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం 2018లో గరిష్ట స్థాయికి చేరింది. కోవిడ్‌కు ముందు 2018-19లో పేదరికం పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని ఒకప్పటి ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఎన్‌సీ సక్సేనా చెప్పారు. ప్రభుత్వం 2017-18లో నిర్వహించిన వినియోగ సర్వే ప్రకారమే పేదరికం పెరి గింది. 2005-15 మధ్యకాలంలో నిర్మాణాలలో పెట్టుబడులు బాగా పెరిగాయి. 2015 తర్వాత అవి తగ్గిపోయాయి. దీంతో నిర్మాణ రంగంలో ఉపాధి పొందిన వారు ఉద్యోగాలు కోల్పోయారు. వాస్తవ వేతనాలలో పెరుగుదల లేదని గణాంకా లు చెబుతున్నాయి. కార్మికుల సంఖ్య కూడా పెద్దగా పెరగలేదు. దీనివల్ల చాలా మందికి ఉద్యో గాలు లేకపోవడమో లేదా వారు ఉద్యోగాల కోసం వెదకడమో జరిగింది. మన దేశంలో 2019లో అత్యంత పేదలుగా ఉన్న వారి సంఖ్యకు సం బంధించి తాను వేసిన అంచనాలను ప్రపంచబ్యాంక్ సవరించింది. కడు పేదరి కాన్ని అనుభవిస్తున్న వారి సంఖ్యను 136.81 మిలియన్లుగా చూపిన ప్రపంచ బ్యాంక్, ఆ తర్వాత దానిని సవరించి 176.09గా నమోదు చేసింది. కోవిడ్ కారణంగా 2020లో 56 మిలియన్ల భారతీయు లు అత్యంత పేదరికంలో మగ్గిపోయారు.

అంతా గోప్యమే...!

(మొదటిపేజీ తరువాయి)

ఈ మార్పులు ప్రారంభమయ్యాయి. పారిశ్రామిక ఉత్పత్తిని లెక్కించే పద్ధతి కూడా మారింది. దీంతో కేవలం 'కాగితాల'పై మాత్రమే ఉత్పత్తి పెరుగుతోంది.2017-18కి సంబంధించి కార్మికుల సంఖ్యపై చేసిన సర్వే ఫలితాలు 2018 చివరలో అందుబాటులో ఉన్నప్పటికీ 2019 ఎన్నికలు పూర్తయ్యే వరకూ వాటిని బయట పెట్టలేదు. ఎందుకంటే ఆ కాలంలో ఉద్యోగ కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండడమో లేదా తగ్గడమో జరిగింది. మరో దారుణమైన విషయ మేమంటే 2017-18కి సంబంధించి వినియోగ వ్యయంపై జరిపిన సర్వే ఫలితాలను వెల్లడించేం దుకు కూడా ప్రభుత్వం నిరాకరించింది. అయితే ఆ నివేదికను కొందరు పాత్రికేయులు బయటపెట్టారు. 2011-12 నుండి 2017-18 వరకూ గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం తగ్గిందని, అదే సమయంలో పేదరికం పెరిగిందని ఆ సర్వే తెలిపింది. అప్పటి నుండీ నేటి వరకూ దేశంలో వినియోగ సర్వే జరగనే లేదు. పేదరికం, ఆహార వినియోగం, అసమానతలు వంటి విషయాలలో వాస్తవాలు తెలుసుకోవాలంటే ఈ సర్వే జరపడం చాలా అవసరం. అయితే 2011 - 12 తర్వాత అంటే దశాబ్ద కాలం పాటు ఈ కీలక సూచికలపై ఎలాంటి సమాచారం అందుబాటులో లేదు. పేదరికంపై అత్యవసరమైన సమాచారం అందుబాటులో లేకపోవడంతో నీతి ఆయోగ్ సొంత సూచికను అభివృద్ధి చేసింది. అయితే ఈ సూచిక ఏం చెబుతోంది? గత దశాబ్ద కాలంలో పేదరికం తగ్గిందట.

2011 లెక్కలే ఆధారం

కోవిడ్ అనంతరం దేశంలో జనజీవనం సాధారణ స్థాయికి చేరినప్పటికీ జనగణనను వాయిదా వేయడానికి ప్రభుత్వం కోవిడ్‌ను సాకుగా చూపుతోంది. సార్వత్రిక ఎన్నికల తర్వాతే జనాభా లెక్కల సేకరణ జరిపే అవకాశం ఉంది. ఇప్పుడు దేనికైనా 2011 జనగణన లెక్కలే ఆధారంగా ఉంటున్నాయి. అంటే మౌలిక సమాచారం లేకుండానే ప్రభుత్వం పనిచేస్తోందన్న మాట. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు ప్రయత్నించగా కేంద్రం అడ్డుకుంది.

ప్రణాళికలు సైతం...

2019-21 సంవత్సరాలకు సంబంధించి జరిపిన కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాలు ప్రభుత్వ వాదనకు భిన్నంగా ఉన్నాయి. దీనిని జీర్ణించుకోలేని మోడీ ప్రభుత్వం సర్వే సంస్థపై పసలేని ఆరోపణలు మోపి సస్పెండ్ చేసింది. తద్వారా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా ఉండే ఫలితాలను ప్రచురించవద్దని ప్రస్తుత సర్వే నిర్వాహకులకు పరోక్షంగా సంకేతాలు పంపింది. సర్వేలు నిగ్గు తేల్చిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకపోతే వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వం ఏ విధంగా విధానాలను రూపొందిస్తుందని జయతీ ఘోష్ ప్రశ్నించారు. ప్రభుత్వం రూపొందించుకున్న ప్రణాళికలు కూడా బయటకు రావడం లేదు. గంగ కార్యాచరణ ప్రణాళిక నేటికీ విడుదల కాలేదు.

శాండ్విక్‌లో సీఐటీయూ ఘన విజయం

భారీ మెజార్టీతో జయ కేతనం

- ఎర్రజెండా పక్షాన కార్మికులు ఉంటారనడానికి ఈ విజయం నిదర్శనం
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు

ఈ విజయం కార్మికులకే అంకితం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో గురువారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘన విజయం సాధించింది. ప్రత్యర్థి హెచ్ఎంఎస్‌పై 106 ఓట్ల మెజార్టీతో విజయ కేతనం ఎగురవేసింది. పరిశ్రమలో మొత్తం 194 ఓట్లకు గాను 192 ఓట్లు పోలయ్యాయి. అందులో 149 ఓట్లు సీఐటీయూకు, 43 ఓట్లు హెచ్ఎంఎస్‌కు వచ్చాయి. దాంతో కార్మికులు పరిశ్రమ ఎదుట విజయోత్సవ సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ.. ఈ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటు వేసి.. 106 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించిన కార్మికులందరికీ విప్లవ జేజేలు, అభినందనలు తెలిపారు. శాండ్విక్ పరిశ్రమ కార్మిక వర్గానికి రాష్ట్రంలో, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో ఒక మంచి గుర్తింపు ఉందన్నారు. చారిత్రాత్మక వేతన ఒప్పందాలతో కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం పనిచేస్తున్నదన్నారు. కానీ కొంత మంది యాజమాన్యంతో కుమ్మక్కై పోటీ యూనియన్‌ని స్థాపించారని, వారి ఎత్తుగడలు, మోసపూరిత మాటలను కార్మికులు నమ్మలేదని తెలిపారు. యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి మరిన్ని చారిత్రాత్మకమైన ఒప్పందాలు, సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. ఈ విజయం ప్రత్యర్థు లకు ఒక గుణపాఠం కావాలని, వారి ఆరోపణలు అవాస్తవ మని కార్మికులు గుర్తించారన్నారు. కార్మికులు ఎర్రజెండా పక్షాన ఉన్నారనటానికి ఇదే నిదర్శనమన్నారు. కార్య క్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షులు మల్లేశం, రాష్ట్ర కమిటీ సభ్యులు పాండు రంగారెడ్డి, జిల్లా నాయకులు సాయిలు, నరసింహారెడ్డి, రాజయ్య, వాజిద్ అలీ, శాండ్విక్ యూనియన్ ప్రధాన కార్య దర్శి మనోహర్, వివిధ పరిశ్రమల సీఐటీయూ కార్మికనాయ కులు, కార్మికులు సాండ్విక్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తెలంగాణ పూల పండుగ దేశానికే ఆదర్శం

- ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

నవతెలంగాణ-అమీన్‌పూర్/మియాపూర్

తెలంగాణ పూల పండుగ 'బతుకమ్మ' దేశానికే ఆదర్శమని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి అన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ మున్సిపాల్టీలోని బీరంగూడ శివాలయం చౌరస్తాలో సీఐటీయూ, ఐద్వా కమిటీల ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకలో మల్లు లక్ష్మి పాల్గొని స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు మహిళలకు తగినంత గౌరవం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక నెమలినగర్, పీజేఆర్‌నగర్, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి మహిళలు పాల్గొని బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పాల్గొన్న అరుణజ్యోతి మాట్లాడుతూ.. బతుకమ్మ గొప్పతనాన్ని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న హింసలను అరికట్టడంలో వెనకబడ్డాయని విమర్శించారు. అందుకు ఉదాహరణే మణిపూర్ ఘటన అని తెలిపారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం అవసరం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వహణ బాధ్యులు మంజుల, సుజాత, సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు విజయ్ కుమార్, రవీందర్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే కార్మిక సమస్యలు పరిష్కారం

- సింగరేణి ప్రయివేటీకరణను కాంగ్రెస్ అడ్డుకుంది
- సింగరేణి ఎన్నికలు జరగాలంటే.. కాంగ్రెస్ అధికారంలోకి రావాలి
- భూపాలపల్లిలోని సింగరేణి 1వ ఇంక్లైవ్ వద్ద.. : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని, తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిదని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని 1వ ఇంక్లైన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని జెండాలను ఎజెండాలను పక్కనబెట్టి పోరాడితేనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందని గుర్తుచేశారు. కార్మికుల త్యాగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్మికుల వైపు ఉన్నామనేది వాళ్లే, ప్రభుత్వంలో ఉన్నది వాళ్లే, సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చేస్తున్నది వాళ్లే అనేది గుర్తుంచుకోవాలన్నారు. ఒకే ఒక్క అధికారిని సింగరేణికి పెట్టి, దివాళా తీయించారని, ఇప్పటికీ ఆ తప్పులను కప్పిపుచ్చుకుంటున్నారని ఆరోపించారు. సింగరేణిని ప్రయివేటుపరం చేయడానికి బీఆర్ఎస్ ఒప్పుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. అరబిందోకు మైన్ అప్పగించి, తాడిచర్ల మైన్‌ను వారి అనుయాయులకు అప్పగించి, నైని కోల్‌మైన్‌ను అదానీకి కట్టబెట్టాలని చూసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మైన్‌ను ప్రయివేట్‌పరం చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నదని తెలిపారు. డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు జరగాలంటే డిసెంబట్ 3న కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, తెలంగాణ సాధించిన కార్మికులుగా మిమ్మల్ని గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకుందని తెలిపారు. తెలంగాణను గుల్ల చేసిన రాష్ట్రంలోని పందికొక్కుల పని పట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, మధుయాష్కీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకులు జోగబుచ్చయ్య, పసునూటి రాజేందర్‌తోపాటు కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ఐసెట్‌లో 27,075 మందికి సీట్ల కేటాయింపు

- ఇంకా మిగిలిన సీట్లు 5,224
- ఎంబీఏలో 84.15 శాతం, ఎంసీఏలో 82.20 శాతం సీట్లు భర్తీ
- 29 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబీఏ, ఎంసీఏ కలిపి ఐసెట్‌లో 32,299 సీట్లుంటే, 27,075 (83.83 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఐసెట్‌లో ఇంకా 5,224 (16.17 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఎంబీఏలో 26,951 సీట్లుంటే, 22,679 (84.15 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 4,272 (15.85 శాతం) సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఎంసీఏకు సంబంధించి 5,348 సీట్లుంటే, 4,396 (82.20 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. 952 (17.8 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 1,032 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. అందుకోసం ఈనెల 29 వరకు గడువుందని పేర్కొన్నారు. లేదంటే ఆ సీట్లు రద్దయిపోతాయని తెలిపారు. కేటాయించిన కాలేజీల్లో ఈనెల 30,31 తేదీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఇతర వివరాలకు https://tsicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వికలాంగులపై కేటీఆర్ వ్యాఖ్యలు అనుచితం

- అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు కె నాగేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులపై మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారనీ, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలభారత వికలాంగుల హక్కుల వెదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వికలాంగుల కృతజ్ఞతా సభలో కేటీఆర్ మాట్లాడుతూ వికలాంగులను కేవలం పెన్షన్‌తో ముడిపెట్టి మాట్లాడారని తెలిపారు. అనేక మంది వికలాంగులు నిరుద్యోగంతో బాధపడుతున్నారని తెలిపారు. స్వయం ఉపాధి లేక , ఉద్యోగాలు లేక తీవ్ర కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వికలాంగులకు ఐదు శాతం ఇవ్వకుండా దాటవేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 5.7లక్షల మంది వికలాంగుల సమస్యలను పరిష్కరించేవారికే ఓటు వేస్తామని తెలిపారు.



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇండస్ట్రియల్ మేనేజర్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతిభవన్ వద్ద ఇండస్ట్రియల్ మేనేజర్ గంగాధర శ్రీనివాస్ గురువారం రూ.15,000 లంచం తీసుకుంటుండగా అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగుకు చెందిన గుగులోతు లచ్చిరాం జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా గతేడాది రూ.53 లక్షలకు అశోక్ లేలాండ్ వాహనాన్ని కొనుగోలు చేశారు. దానికి సంబంధించి సబ్సిడీ కోసం లచ్చిరాం కొద్ది రోజుల కిందట జిల్లా పరిశ్రమల శాఖలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస్. లచ్చిరాం నుంచి మొదట రూ. 50వేలు తీసుకున్నాడు. అనంతరం మళ్లీ రూ.60 వేలు కావాలని డిమాండ్ చేయడంతో లచ్చిరాం ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఈ క్రమంలో గురువారం లచ్చిరాం రూ.15వేలు ఇస్తుండగా జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడిని హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట.. తండ్రి కొడుకుల ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-రఘునాథపాలెం

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం తహసీల్దార్ అక్రమంగా తమ భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటూ తండ్రీ కొడుకులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుడిదంపాడు గ్రామ పంచాయతీకి చెందిన దుడుకురి షాజీరావు, అతని కుమారుడు విద్యాసాగర్ 2005లో మంచుకొండ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 231/ఆ/1లోని 1.26 ఎకరాలు, 233/అ లోని 2.39 ఎకరాలతో కలిపి మొత్తం 4.24 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, రెవెన్యూ కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ఈ భూమి వారి ఆధీనంలో ఉంది. నాటి నుంచి భూమిని కౌలుకు ఇస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 2017లో ప్రతి రైతుకు సాగులో ఉన్న భూముల కొత్త పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయగా.. దాని కోసం ఈ తండ్రి కొడుకులు అప్పటి వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా కేవలం 3 ఎకరాలకే పట్టాదారు పాస్ పుస్తకాన్ని మంజూరు చేశారు. మిగతా 1.24 ఎకరాల భూమి పాసుపుస్తకంలో ఎక్కలేదు. అప్పటి నుంచి రఘునాథపాలెం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్నా పని కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా 2017లో ఈ తండ్రి కొడుకులు అదే గ్రామానికి చెందిన తుమ్మలపల్లి మోహన్ రావు దగ్గర కొత్త డబ్బు అప్పుతీసుకున్నారు. దానికోసం ఖాళీ దస్తావేజుపై సంతకాలు పెట్టించుకున్నారు. ఆ వ్యక్తి ఆ దస్తావేజులపై 2 ఎకరాల భూమి రాయించుకొని అక్రమంగా సాదా బైనామా ద్వారా పట్టాదారు చేయించుకున్నాడని ఆరోపిస్తున్నారు.

ఈ భూములు కోర్టు కేసులో ఉన్నాయని తహసీల్దార్‌కి అభ్యంతరాలు పెట్టామన్నారు. కానీ ఆ సర్వే నెంబర్‌లోని 22 గుంటల భూమిని గురువారం వేరే వ్యక్తికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించడానికి అప్పిచ్చిన వ్యక్తి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న తండ్రి కొడుకులు ఇద్దరూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అడ్డుకున్నా వినకపోవడంతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీధర్‌ను కలిసి ఉన్న విషయాన్ని వివరించారు. కాగా, దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. తుమ్మలపల్లి మోహన్ రావు అనే వ్యక్తికి పట్టాదారు పాసు పుస్తకం ఉన్నది. కాబట్టి రిజిస్ట్రేషన్ చేస్తున్నామని తెలిపారు. స్లాట్ బుకింగ్ చేసిన దానిలో సర్వే నెంబర్లు వేరే ఉన్నాయని, తండ్రీకొడుకులు చెబుతున్న సబ్ నెంబర్లు వేరే అని తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారు చెప్పిన విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

లీడర్లు కలిసిండ్రు.. క్యాడర్‌ను మరిసిండ్రు..

ప్రచారానికి దూరంగా ఎమ్మెల్సీ అనుచరులు

- గులాబి కోటలో ఆరని మంటలు
- అసంతృప్తి వాదులతో ఎమ్మెల్సీ సమాలోచనలు
- దసరా నాటికి సమస్య పరిష్కారంపై దృష్టి



నవ తెలంగాణ మహబూబాబాద్

గులాబీ కోటలో అసంతృప్తి మంటలు రగులుతూనే ఉన్నాయి. నాయకుల మధ్య వైరం ముగిసినప్పటికీ కార్యకర్తల్లో కయ్యం కొనసాగుతోంది. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌ను తిరిగి అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించి బీఫారం ఇచ్చినప్పటికీ అసమ్మతివాదులు ఏ మాత్రం తగ్గడం లేదు. తమను అనేక అవమానాల పాలు చేసి గాలికి వదిలేసిన ఎమ్మెల్యే శంకర్ గెలుపు కోసం ఎలా పనిచేయాలని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

మహబూబాబాద్ నియోజకవర్గంలో 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ వరుసగా గెలుపొందారు. 2023 ఎన్నికల్లో కూడా హ్యాట్రిక్ కొట్టి, మంత్రి పదవి సాధించాలనే జోరు మీద శంకర్ నాయక్ ఉన్నారు. అయితే నియోజకవర్గంలో దశాబ్ద కాలంగా ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు మధ్య ఉన్న విభేదాలు పలు సందర్భాల్లో బట్టబయలయ్యాయి. గతేడాది దసరా సందర్భంగా ఎంపీ అనుచరులు కట్టిన బ్యానర్లను ఎమ్మెల్యే అనుచరులు చించి వేశారు. దాంతో ఎంపీ అనుచరుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా జరిగిన గులాబీ పార్టీ ధర్నాలో ఎంపీ, ఎమ్మెల్యే పరస్పరం మైక్ విషయంలో గొడవపడ్డారు. ఈ గొడవ సద్దుమణిగిందనుకునే లోపే ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అనుచరుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి వచ్చింది. దానికి తోడు మానుకోటలో తెలంగాణ ఉద్యమకారులు ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై సమావేశాల్లో బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. మూడు నెలలుగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు అనుచరులు మహబూబాబాద్, కేసముద్రం, నెల్లికుదురు మండలాల్లో సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ ప్రజా సంఘాల పార్టీ అనుబంధ సంఘాల నాయకులు బహిరంగంగానే విమర్శలు చేశారు. అనూహ్యరీతిలో ఎమ్మెల్యే శంకర్ నాయక్ టికెట్ సాధించి బీఫారం తెచ్చుకున్నారు. ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ నాయకులను కలిసి వారి మద్దతు కోరారు. ఇందుకు వారు కూడా సంఘీభావం తెలిపి ప్రచారంలో పాల్గొంటామని హామీనిచ్చారు.

ఎమ్మెల్యే గెలుపునకు ప్రయత్నించేనా?

మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి సత్యవతి రాథోడ్, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు నియమితులయ్యారు. ఇల్లందులో నవంబర్ 1న సీఎం బహిరంగ సభ ఉన్నందున ఎంపీ మాలోత్ కవిత అక్కడి ఏర్పాట్లలో ఉన్నారు. ఈ క్రమంలో భవిష్యత్‌లో ఆ ముగ్గురు ఇక్కడ ప్రచారంలో పాల్గొనే పరిస్థితి లేదు. కాగా, ఇక్కడ వారి అనుచరులు ఎమ్మెల్యే శంకర్ నాయక్ గెలుపు కోసం ఏ మేరకు ప్రయత్నం చేస్తారు.. ప్రచారం చేస్తారా.. లేదా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల జరిగిన రెండు, మూడు ప్రచార సభల్లో ఎంపీ, ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. ఆ సభలూ సమావేశాలకు అసంతృప్తివాదులు, ఉద్యమకారులు, ఎమ్మెల్సీ అనుచరులు హాజరు కాలేదు. కొంతమంది కౌన్సిలర్లు కూడా డుమ్మా కొట్టారు. ఈ విషయాన్ని శంకర్ నాయక్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

కక్ష సాధింపులకు పోతే పరిస్థితేంటీ?

అప్రమత్తమైన ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు తన అనుచరులు, ఉద్యమకారులతో సమావేశం నిర్వహించారు. వారంతా తమకు జరిగిన అవమానాలను ఏకరువు పెట్టారు. అధికార పార్టీలో ఉన్నప్పటికీ తమ వార్డు సమావేశాల్లో అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే తమకు నిధులు కేటాయించకుండా అడ్డుకున్నారని, కేసులు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. భవిష్యత్తులోనూ ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు చేపడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు తమకు స్పష్టమైన హామీ వస్తే తప్ప ఎమ్మెల్యేకు అనుకూలంగా ప్రచారంలోకి దిగేది లేదంటూ తేల్చి చెప్పారు. నాయకులందరూ కలిసిపోయారని, తమ పరిస్థితి ఏంటంటూ ప్రశ్నించారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి దసరా తర్వాత అసంతృప్తి వాదులందరినీ ఏకతాటి పైకి తీసుకురావడానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ భావిస్తున్నట్టు సమా చారం. కాగా ఎమ్మెల్సీ తక్కెళ్ళ పల్లి రవీందర్‌రావు బుజ్జగింపు చర్చలు ఏ మేరకు పనిచేస్తాయి? అసంతృప్తి నేతలు, ఉద్యమకారులకు ఎలాంటి హామీలు ఇస్తారనేది వేచి చూడాల్సిందే.

రూ. కోటి 11 లక్షల గంజాయి పట్టివేత

మరోచోట రూ.60లక్షల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-హయత్ నగర్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాచకొండ కమిషనరేట్ పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎల్‌బీ నగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహన్ వెల్లడించారు.

కర్ణాటకకు చెందిన మోహన్ రాథోడ్ గతంలో గంజాయి కేసులో నిందితుడు. అయితే నాచారానికి చెందిన పెద్ద బాబురావు, సికింద్రాబాద్‌కు చెందిన మద్దెల రమేష్, కర్ణాటకకు చెందిన బహాళ్య లీలావతి అలియాస్ గంగరాజు, సంతోష్‌తో కలిసి మోహన్ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నాడు. హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు.

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు, ఆ తర్వాత కర్ణాటక, ఇతర రాష్ట్రాలకు చేరవేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్‌ఓటీ, కీసర పోలీసులు కలిసి ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 430 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ కోటి 11లక్షల రూపాయలు ఉంటుందని సీపీ చెప్పారు. ఇద్దరు నిందితుల నుంచి 430కేజీల గంజాయి, కారు, ఇనుప రాడ్లు, రూ.2170, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు సీపీ చెప్పారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, మల్కాజిగిరి ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్, కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, మల్కాజిగిరి ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ రాములు, వాసుదేవ్, పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

మరోచోట 200 కేజీల గంజాయి పట్టివేత

మరో చోట ఒడిశా ఒరిస్సా నుంచి ఢిల్లీకి 200 కేజీల గంజాయి తరలిస్తుండగా హయత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను సీపీ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నానికి చెందిన ప్రధాన సూత్రధారి అయిన నూకరాజు, ఇదే రాష్ట్రానికి చెందిన గంట శ్రీనుబాబు, ఈస్ట్ గోదావరికి చెందిన అక్కబాతుల లక్ష్మణ కుమార్‌తో కలిసి గంజాయిని వ్యర్థ రసాయన డీసీఎం(కెమికల్ ట్యాంక్)లో పూణే, మహారాష్ట్ర, రంపచోడవరానికి తరలించారు. గురువారం ఒడిశా నుంచి ఖమ్మం, సూర్యాపేట మీదుగా ఢిల్లీకి తరలిస్తుండగా హయత్‌నగర్ వద్ద పట్టుబడ్డారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించగా డీసీఎం ట్యాంకర్‌లో 200కేజీల గంజాయి లభ్యమైంది. దాని విలువరూ. 60 లక్షల 10వేలు ఉంటుందని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ, ఎల్‌బీ నగర్ జోన్ ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి ఉన్నారు.

అనుమతుల్లేని వెలిగొండ

ప్రాజెక్టు నిర్మాణం ఆపాలి ...

- కృష్ణాబోర్డుకు సర్కారు మరో లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

భవిష్యత్తులో ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసేసమయంలో బేసిన్‌లోని ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కృష్ణా ట్రిబ్యునల్-1 (బచావత్ ట్రిబ్యునల్) అవార్డులో పేర్కొన్నా ఏపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వం కృష్ణాబోర్డుకు రెండోసారి లేఖ రాసింది. ఈమేరకు రాష్ట్ర సాగునీటి పారుదల, ఆయకట్టు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ నాలుగు పేజీల లేఖను ఇటీవల కృష్ణాబోర్డు చైర్మెన్‌కు పంపారు. . తదనుగుణంగానే, బచావత్ ట్రిబ్యునల్ సెప్టెంబర్ 1960 తరువాత చేపట్టిన ప్రాజెక్టులకు కేటాయింపులు చేసినప్పుడు, కేవలం కృష్ణా నది బేసిన్ లోపలి ప్రాజెక్టులకు మాత్రమే నీటి కేటాయింపులు చేసిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు వ్యతిరేకంగా, వెలిగొండ ప్రాజెక్టు లాంటి కృష్ణా బేసిన్ ఆవలి ప్రాజెక్టులను, మిగులు జలాలను కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల, బేసిన్ లోని కరువు ప్రాంతాలకు నీరందించే తెలంగాణ ప్రాజెక్టులు (ఇప్పటికే నిర్మించినవి, నిర్మాణంలో ఉన్నవి) నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల శ్రీశైలం రిజర్వాయర్ నుంచి రోజుకు ఒక టీఎంసీ చొప్పున బేసిన్ ఆవలకు నీటిని మళ్లించే వెలిగొండ ప్రాజెక్టును వెంటనే నిలువరించాలని కృష్ణా బోర్డుని తెలంగాణ కోరింది. ఏపీ చర్య మూలంగా నాగార్జునసాగర్, శ్రీశైలం పరిధిలోని స్థిరీకరించిన ఆయకట్టుతోపాటు హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు నష్టం జరుగుతుందని తెలియజేశారు. కేంద్రం గతంలో చెప్పినా ఏపీ అలాగే ముందుకుపోవడాన్ని ఖండించారు. బచావత్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం, అనుమతులన్నీ లభించాకే వెలిగొండ ప్రాజెక్టును చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం బోర్డును కోరింది. పరిపాలన ఇనుమతులు ఇవ్వడాన్ని తప్పుబట్టింది.

ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ అధికారి

- ఇంటి నిర్మాణ అనుమతికి రూ.1.5లక్షల లంచం

నవతెలంగాణ -ఎల్‌బీనగర్

ఇంటి నిర్మాణ అనుమతుల కోసం వెళ్లిన ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారిని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి..

రంగారెడ్డి జిల్లా గుర్రంగూడకు చెందిన జక్కిడి సుధాకర్ రెడ్డి వనస్థలిపురంలో వద్ద ఓ ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ మేరకు నిర్మాణ అనుమతుల కోసం హయత్‌నగర్ సర్కిల్‌టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమను కలిశాడు. అందుకు ఆమె రూ.2 లక్షలు డిమాండ్ చేయగా రూ 1.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. అనంతరం సుధాకర్ రెడ్డి ఏసీబీ అధికారులను సంప్రదించాడు.

వారు చెప్పినట్టు పథకం ప్రకారం సరూర్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ కార్యాల యంలో డబ్బులను గురువారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్ష్మణ్‌కు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. టీపీఓ ఉమ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్ష్మణ్‌ను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరిచారు. టౌన్ ప్లానింగ్ అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.

నీవు సంపాదించే దానికన్నా, తక్కువ ఖర్చు చేయగలిగితే..
నిన్ను మించిన ఆర్థిక నిపుణుడు ఉండడు - అరిస్టాటిల్

సంపాదకీయం

ఇజ్రాయెల్ మారణకాండ!

పాలస్తీనాలోని గాజా ప్రాంతంపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయెల్‌కు మద్దతు పలికేందుకు బుధవారం నాడు అమెరికా అధినేత జో బైడెన్ వచ్చి వెళ్లాడు. అతగాడి అడుగులో అడుగు వేస్తూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ గురువారం నాడు వెళ్లి, మేము కూడా మీతోనే ఉన్నాము అని చెప్పాడు. పశ్చిమదేశాల వారు రోజూ హక్కుల గురించి పేజీలకు పేజీలు సుభాషితాలు, మానవత్వం గురించి కడవల కొద్దీ కన్నీరు కారుస్తుంటారు. పచ్చి దుర్మార్గాలకు పాల్పడతారు, దురాగతాలను సమర్థిస్తారు. గాజా లోని ఒక ఆసుపత్రి మీద ఇజ్రాయెల్ విమానాలు బాంబులు వేసి 471 మంది రోగులు, సిబ్బందిని చంపిన తరువాత కూడా మేము మీతోనే ఉన్నాము, మీరింకా మరిన్ని జాగ్రత్తలు తీసుకొని పెద్దఎత్తున మరిన్ని తీవ్ర దాడులు చేయండి, హమాస్ సాయుధులను అణచి వేయండి అని యూదు దురహంకారులకు వత్తాసు పలకటంకంటే మరొక అమానుషం లేదు. ఇలాంటి వారు గనుకనే మానవతా కారణాలతో దాడులను ఆపివేయాలని భద్రతా మండలిలో గడచిన మూడు రోజుల్లో పెట్టిన రెండు తీర్మానాల్లో ఒకటి వీగిపోగా, రెండవ దాన్ని అమెరికా వీటో చేసింది. ఇజ్రాయెల్ దాడులను పూర్తిగా సమర్థిస్తున్నట్లు బైడెన్ నిస్సిగ్గుగా చెప్పాడు. 2001లో న్యూయార్క్ ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడి సందర్భంగా తాము చేసిన పొరపాట్లను పునరావృతం కానివ్వవద్దని కూడా సలహా ఇచ్చాడు.

> 1947లో ఐరాస తీర్మానం చేసినప్పటి నుంచి అంతకు ముందే శిక్షణ పొంది సిద్ధంగా ఉన్న ఇజ్రాయెల్ సాయుధ మూకలు పాలస్తీనా ప్రాంతాలపై దాడులకు దిగి అరబ్బులను తరిమివేసి వేలాది మందిని హత్య చేసిన దుర్మార్గం తెలిసిందే. దొంగే దొంగ అన్నట్లుగా తానే దాడులు చేస్తూ, ప్రాంతాలను ఆక్రమిస్తూ తనకు రక్షణ కావాలంటూ అప్పటి నుంచి ఆడుతున్న నాటకాలకు అమెరికా మొదటి నుంచీ మద్దతు ఇస్తోంది. ఇప్పటికీ అదే పాట పాడుతోంది. భారీ ఎత్తున నిధులు, ఆయుధాలు అందచేస్తున్న ఏకైక దేశంగా ఉన్న సంగతి తెలిసిందే.

గాజా ప్రాంతంలోని ఆల్ అహిల్ ఆసుపత్రి మీద పాలస్తీనా తీవ్రవాదులే దాడి చేశారంటూ ఇజ్రాయెల్ చేస్తున్న ప్రచారాన్ని పశ్చిమదేశాల మీడియా అందుకుంది. ఆసుపత్రి మీద దాడి అంతర్జాతీయ యుద్ధనేరం గనుక అలాంటి ప్రకటనను ముందే సిద్ధం చేసి పెట్టుకుందన్నది స్పష్టం. దాని చరిత్ర తెలిసిన వారికి ఆశ్చర్యం కలిగించటం లేదు, కట్టుకథలను ఎవరూ నమ్మటం లేదు. ఆసుపత్రిపై బాంబులతో సహా తాజా దాడుల్లో మొత్తం 750 మంది పిల్లలు మరణించినట్లు చెబుతున్నారు. బైడెన్ వచ్చి వెళ్లిన తరువాత ఇజ్రాయెల్ దాడులను పెంచింది, దానికి ప్రతిగా ఇతర ప్రాంతాల్లో ఉన్న పాలస్తీనియన్ల బృందాలు కూడా దాడులు చేస్తున్నట్లు వార్తలు. తన అష్టదిగ్బంధంలో ఉన్న గాజాలోని 23లక్షల మంది పౌరులకు విద్యుత్, మంచినీటితో సహా అన్ని రకాల సరఫరాలను ఇజ్రాయెల్ నిలిపివేసింది. బాంబు దాడుల్లో వందలాది మరణించగా వేలాది మంది గాయపడ్డారు. వారికి అవసరమైన ఔషధాలు, ఇతర సరఫరాలు చేసేందుకు మానవతా పూర్వకంగా దాడులను నిలిపివేయాలని ఇజ్రాయెల్‌ను ఆదేశించేందుకు భద్రతా మండలిలో బుధవారం నాడు బ్రెజిల్ పెట్టిన తీర్మానాన్ని మొత్తం 15కు గాను 12 మంది సమర్థించగా దాన్ని చెల్లకుండా అమెరికా వీటో చేసింది. అంతకుముందు సోమవారం నాడు మానవతా పూర్వక కారణాలతో దాడులను నిలిపి వేయాలని కోరుతూ రష్యా ప్రవేశపెట్టిన తీర్మానానికి చైనా మరో మూడు దేశాలు మద్దతు పలకగా నాలుగు దేశాలు వ్యతిరేకించాయి, ఆరుగురు ఓటింగ్‌లో పాల్గొనకపోవటంతో అది వీగిపోయింది. బ్రెజిల్ ప్రవేశ పెట్టిన తీర్మానంలో పౌరులపై దాడులు ఆపాలని, కాల్పులను విరమించాలనే అంశం లేదంటూ వాటిని చేర్చాలని రష్యా ప్రతిపాదించిన రెండు సవరణలు వీగిపోయాయి. దాంతో తీర్మానం వృథా అంటూ ఓటింగ్‌కు వెళ్లలేదు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కు గురించి పేర్కొనలేదు గనుక తాము వీటో చేస్తున్నట్లు అమెరికా పేర్కొన్నది. ఆ సాకునే చెబుతూ బ్రిటన్ ఓటింగ్‌లో పాల్గొనలేదు.



1947లో ఐరాస తీర్మానం చేసినప్పటి నుంచి అంతకు ముందే శిక్షణ పొంది సిద్ధంగా ఉన్న ఇజ్రాయెల్ సాయుధ మూకలు పాలస్తీనా ప్రాంతాలపై దాడులకు దిగి అరబ్బులను తరిమివేసి వేలాది మందిని హత్య చేసిన దుర్మార్గం తెలిసిందే. దొంగే దొంగ అన్నట్లుగా తానే దాడులు చేస్తూ, ప్రాంతాలను ఆక్రమిస్తూ తనకు రక్షణ కావాలంటూ అప్పటి నుంచి ఆడుతున్న నాటకాలకు అమెరికా మొదటి నుంచీ మద్దతు ఇస్తోంది. ఇప్పటికీ అదే పాట పాడుతోంది. భారీ ఎత్తున నిధులు, ఆయుధాలు అందచేస్తున్న ఏకైక దేశంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈజిప్టు నుంచి మానవతా పూర్వక సాయాన్ని అందించేందుకు ఇజ్రాయెల్‌ను ఒప్పించినట్లు, జో బైడెన్ తిరుగు ప్రయాణంలో విలేకర్లతో చెప్పాడు. ప్రపంచమంతటా పెరుగుతున్న ఒత్తిడి మేరకు విధిలేక జరిగింది తప్ప అమెరికా మారుమనసు పుచ్చుకొన్న ఫలితం కాదు. చివరికి ఇజ్రాయెల్‌ను సమర్థిస్తున్న భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా కారకులు ఎవరో చెప్పకుండా ఆసుపత్రిపై బాంబుదాడిని ఖండించాల్సి వచ్చింది. అరబ్బు దేశాలలో ఉన్న చీలిక కారణంగానే అమెరికా, ఇజ్రాయెల్ ఆటలు సాగుతున్నాయి. పాలస్తీనియన్లు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ఎంతగా అణచివేసినా వారిలో స్వాతంత్ర్య కాంక్షను అణచటం ఎవరి తరమూ కాదు. యావత్ నాగరిక ప్రపంచమూ వారికి అండగా ఉంటుంది.



'సుప్రీం' తీర్పునూ గౌరవించరా!?

ఇల్లు.. జర్నలిస్టులకు చిరకాల స్వప్నం. జీవితంలో స్థిరపడ్డారని చెప్పుకోవడానికి సాధారణంగా అందరూ ఇంటినే గీటురాయిగా భావిస్తారు. పరస్పరం కలిసి కరచాలనం చేసే క్రమంలోనూ 'ఇల్లు' కట్టుకున్నావా? అని అడుగుతుంటారు. ఇది అందరికీ తెలిసిందే. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇండ్లు, ఇంటిస్థలం కలే అవుతున్నది. తెలంగాణ సాకారమై దాదాపు పదేండ్లు పూర్తవుతున్నది. కాగా తెలంగాణ జర్నలిస్టులు ఇండ్లు కట్టుకుని తమ జీవనయానాన్ని కొంతలో కొంతైన కుటుంబంతో కలిసి విలాసంగా కాకపోయినా, సంతోషంగా ఉండాలని ఓ చిన్ని ఆశ. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిది. మరువలేనిది. ఎవరూ కాదనలేనిది. ప్రాణాలకు సైతం వెరవకుండా ప్రజల ఆకాంక్షను నిజం చేయడంలో పాత్రికేయుల సాహసం అంతా ఇంతా కాదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియా, జర్నలిస్టులను పట్ల ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. కానీ రాష్ట్రంలోని జర్నలిస్టులకు నివాసం నేతిబీర చందమవుతున్నది. దాదాపు 60 వేల మందికి పైగా జర్నలిస్టులు ఉంటే, వారిలో సగం మందికి కూడా అక్రిడిటేషన్ కార్డులు లేవు. వారి కుటుంబాలతో కలిసి లక్షన్నరకు పైగా జనాభా ఉంది. వారంతా ఇంటి అద్దెలు కట్టలేక తీవ్రమైన ఆర్థిక భారాన్ని ఏండ్లతరబడి మోస్తున్నారు. ఇక చిన్న, మధ్యతరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టుల పరిస్థితి వర్ణణాతీతం. మహిళా జర్నలిస్టుల ఇబ్బందులు చెప్పనలవి కాదు. ఉమ్మడి రాష్ట్రంలో మూడు సార్లు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించారు. 1978, 1982, 1994లో దాదాపు 850 మందికి అప్పటి ప్రభుత్వాలు ఇచ్చాయి.



బి.బసవపున్నయ్య
9490099108

కాగా తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొంతమేర ప్రయత్నం చేసినా అది కార్యరూపం దాల్చలేదు. వేలాదిమంది అర్హులైన జర్నలిస్టులు కండ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. హైదరాబాద్‌తో పాటు జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఈ దయనీయమైన వాతావరణం ఉంది. అయితే జిల్లాల్లో అక్కడక్కడా ఇప్పుడు ఇండ్ల స్థలాలిస్తున్నారు. ఇందుకు ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు ధన్యవాదాలు. సుప్రీంకోర్టులో కేసు పేరుతో హైదారాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం పదేండ్లుగా కాలయాపన చేస్తూ వచ్చింది. ఆరునెలల క్రితం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వి రమణ నేతృత్వంలోని ధర్మాసనం జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వొచ్చని తీర్పునిచ్చింది. అయినప్పటికీ బీఆర్ఎస్ సర్కార్ మాత్రం చడీచప్పుడు చేయడం లేదు. అయినా, సర్కారు కనీసం తన విధానాన్ని ప్రకటించలేదు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం కోసం దీర్ఘకాలికంగా పనిచేస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీబ్ల్యూజేఎఫ్) ఏండ్ల తరబడి ఇండ్లస్థలాల కోసం పోరాటాలు చేస్తున్నది. ఉద్యమాలు నిర్వహిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం పలుమార్లు జర్నలిస్ట్ సంఘాలతో భేటీ అయ్యారు. హైదరాబాద్ శివార్లలో స్థలాలు వెతికారు. మీడియా అకాడమీ ద్వారా అభిప్రాయ సేకరణ చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రత్యేక చట్టం ద్వారా స్థలాలు కేటాయిస్తామని చెప్పు కొచ్చారు. ఒక్కోసారి ఒక్కోలా తన హామీ అమలును వాయిదా వేస్తూనే వస్తున్నారు. అయినా అడుగు ముందుకు పడటం లేదు. రాష్ట్రంలో అనేక జర్నలిస్టుల హౌసింగ్ సోసైటీలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ, జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ, గ్రేటర్ హైదరాబాద్ హౌసింగ్ సోసైటీ, దక్కన్ హౌసింగ్ సొసైటీ, తెలంగాణ జర్నలిస్ట్స్ హౌసింగ్ సోసైటీతో పాటు ఇంకా చాలానే ఉన్నాయి. వీటితో సభ్యత్వం ఉన్న వారు, లేని వారూ అనేక మంది జర్నలిస్టులు ఉన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులతో పాటు హైదరాబాద్‌లోని పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు కచ్చితంగా ప్రభుత్వం కేటాయించాల్సిన అవసరం ఉంది. బాధాకరమైన విషయం ఏమిటంటే, బీఆర్ఎస్ సర్కారు పూటకోమాట చెప్పి చివరకు ఎన్నికల కోడ్ వచ్చేదాకా పెండింగ్‌లో పెట్టింది. సీఎం కేసీఆర్ రెండువారాలు అందుబాటులో లేరు. దీంతో ఎన్నికల ముందు చెప్పుకునే కూడా అవకాశం లేకుండా పోయింది.

చావుకబురు చల్లగా చెప్పినట్టు మంత్రి కేటీఆర్ ఇటీవల తనను కలిసిన విలేకర్లతో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలతో పాటు పెన్షన్ సౌకర్యం కూడా కల్పిస్తామంటూ మరోసారి చెప్పారు. ఆయన ఈ విషయమై పదే పదే మాట్లాడుతున్నా, ఆచరణలోకి రావడం లేదు. చివరకూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వొచ్చంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం బాధాకరం. కేసు పేరుతో ఏండ్ల తరబడి జాప్యం చేసిన ప్రభుత్వం, తీర్పు వచ్చాక మిన్నకుండిపోయింది. కాగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం ఫెడరేషన్ దశలవారిగా ఆందోళనా కార్యక్రమాలు చేపట్టింది. తొలిదశలో నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులతో సంతకాల సేకరణ చేపట్టింది. రెండో దశలో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించింది. మూడో దశలో జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ముందు రిలే దీక్షలు చేసింది. నాలుగో దశలో హైదరాబాద్‌లో గత మే 18న వందలాది మంది జర్నలిస్టులతో 'మహాధర్నా' నిర్వహించింది. ఇండ్లస్థలాలు వచ్చే వరకు ఫెడరేషన్ ఉద్యమాలు కొనసాగిస్తామని ప్రకటించింది. కోరి తెచ్చుకున్న తెలంగాణలో కూడా జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్లస్థలాల కోసం దాదాపు 35 ఏండ్లుగా ఎదురుచూడాల్సి రావడం ఆవేదనాభరితం. కనీసం సుప్రీంకోర్టు తీర్పునూ కేసీఆర్ సర్కారు గౌరవించదా? ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలి. లేదంటే ఉద్యమాలు, ఓటు ద్వారానే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారు.

అంబేద్కర్ బౌద్ధం ఎందుకు స్వీకరించారు?

'హిందువుగా పుట్టాను కానీ హిందువుగా మరణించను' - అని డా.బి.ఆర్. అంబేద్కర్ యోలా సభలో ప్రకటించారు. ఆ తర్వాత-1956 అక్టోబర్ 14న బర్మా భిక్షువు చంద్రమణి ద్వారా నాగ్‌పూర్‌లో బౌద్ధం స్వీకరించారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో పూర్తిగా అర్థం చేసుకోవాలంటే ఆయన పుట్టి పెరిగిన పరిస్థితుల్ని పరిశీలించాలి. ఇప్పుడు ఈ 21వ శతాబ్దంలో ఉన్న పరిస్థితులు ఆనాడు దేశంలో 20వ శతాబ్దంలో లేవు. అంతకుముందు 19,18 శతాబ్దాలలో అణగారిన వర్గాల జీవితం ఇంకా చాలా దయనీయంగా ఉండేది. ఉదాహరణకు అంబేద్కర్ స్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడు, స్కూల్లో తాగేందుకు మంచినీళ్ళు దొరికేవి కావు. దళితులకు నిర్దేశించిన కుండలోని నీరే వారు తాగాలి. ఎట్టి పరిస్థితులలోనూ పక్కనే ఉన్న అగ్రవర్ణం వారి కుండ ముట్టుకోగూడదు. నల్లాలో నీళ్ళు వస్తున్నా స్వతంత్రంగా వెళ్ళి నీళ్ళు తాగే పరిస్థితి లేదు. దాహంగా ఉందని అభ్యర్థిస్తే, స్కూలు బంట్రోతు కరుణించి వచ్చి, నల్లా తిప్పితే దూరంగా ఉండి దోసిలి పట్టి తాగి, పక్కకు జరగాల్సిందే. క్లాసు బయట కింద కూర్చుని పాఠాలు వినాల్సిందే తప్ప, తోటి విద్యార్థులతో కలిసి క్లాసులో బెంచి మీద కూర్చునే పనిలేదు. అంబేద్కర్ తెలివైన వాడు గనుక, విషయాలు సులభంగానే గ్రహించేవాడు. ఒకసారి మేస్టారు ఒక లెక్కను ఎవరైనా వచ్చి బోర్డు మీద చేసి చూపండి అంటే - అంబేద్కర్ చేస్తానని లేచి నిలబడ్డాడు. కాని, క్లాసులోని పిల్లలంతా గోల చేశారు. ఎందుకంటే, అంబేద్కర్ దళిత బాలుడు గనుక బోర్డు ముట్టుకుంటే బోర్డు వెనకాల ఉన్న అగ్రవర్ణ పిల్లల అన్నం మూటలు మైలబడి పోతాయని బాధపడిపోయారు. ఆనాటి పరిస్థితులు అలా ఉండేవి.



డాక్టర్ దేవరాజు మహారాజు

పాఠశాలల్లో ప్రథమశ్రేణి కేవలం బ్రాహ్మణ పిల్లలకే రావాలి. శూద్రులకు రాకూడదన్న అప్రకటిత నియమం ఉండేది. ఆ రోజుల్లో బనారస్, అలీఘర్ విశ్వవిద్యాలయాల్లో దళితులకు విద్య కోసం కేటాయించిన గ్రాంట్ ఆపేశారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య విద్యార్థులకు అన్ని సదుపాయాలుండేవి. ఈ మూడు వర్గాల వారికి సేవ చేయడమే శూద్రుల ధర్మమని మనుస్మృతి చెప్పిన దాని ప్రకారమే అంతా జరుగుతూ ఉండాలని కోరుకునే వారు. అందుకు ప్రయత్నిస్తూ ఉండేవారు కూడా! మనిషికి మనసు ఉంది. జంతువులుగా లేరు కాని, తమకు ఉన్న మనసును సంస్కారవంతంగా, నైతికతతో ఉంచుకోవాలన్న ఆలోచన అగ్రవర్ణాల వారికి ఉండేది కాదు. హిందూధర్మం అధిక సంఖ్యాకులైన శూద్రుల్ని, దళితుల్ని నిరుత్సాహ పరిచేది. నిమ్నజాతుల వారి జీవితాల్లో ఆశ ఉండేది కాదు. అభ్యుదయం ఉండేది కాదు. వారు నిరాశలో పుట్టి పెరగాల్సిందే. ఎదిగే అవకాశాలు ఎంత మాత్రమూ ఉండేవి కావు. అసహ్యం, నిరాదరణ, కోపతాపాలు ఎదుర్కొంటూ, అవమానాల పాలవుతూ శూద్రులు, దళితులు బలవంతంగా జీవనం కొనసాగిస్తున్న రోజులవి. అలాంటి కాలంలో అంబేద్కర్ పుట్టి పెరిగారు. అన్ని రకాల వివక్షల్ని ఎదుర్కొంటూ, ఓపికగా పోరాడుతూ, ఒక్కొక్క మెట్టూ పైకి ఎదుగుతూ వచ్చారు.

ధనికులకు ధర్మం అక్కరలేదు. పీడితులకు మాత్రం ధర్మం వైపు నిలబడాల్సి ఉందన్న విషయం అంబేద్కర్ గ్రహించారు. ఆ రోజుల్లో మహిళలకు గుర్తింపు లేదు. వైదిక మతం ప్రకారం మహిళలంతా శూద్రులే. వారికి స్వేచ్ఛలేదు, విద్యలేదు, సమాజంలో గుర్తింపూ, గౌరవం లేదు, సతీ సహగమనం మాత్రం ఉంది. కాలే కడుపుకు తిండి పెట్టాలంటే వ్యభిచారం చేసుకోవాల్సిందే. ఆ రోజుల్లో బొంబాయిలో వ్యభిచారులు సులేమాన్ హోటల్లో ఖీమాప్లేట్ రోటీ తినగలిగే వారు. సంసారం చేసే గృహిణులకు అది కూడా ఉండేది కాదు. నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ వారి ప్రధాన కార్యాలయం ఉంది. వారి ప్రభావం తగ్గించడానికి అంబేద్కర్ ధమ్మదీక్ష అక్కడ తీసుకున్నారని కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దానికి ఆయన తగిన సమాధానమే చెప్పారు. ఆరెస్సెస్ అనే సంస్థ అసలు తన దృష్టిలోనే లేదని, తను నాగ్‌పూర్‌ను ఎన్నుకోవడానికి బలమైన కారణాలు చాలా ఉన్నాయని చెప్పారు. నాగ్‌పూర్ పట్టణానికి ఆ పేరు ఎందుకొచ్చిందంటే అది నాగజాతికి చెందిన ఆదివాసులకు నిలయం. వారంతా బుద్ధుని అనుయాయులు ఒకప్పుడు వీరే బుద్ధుడికి రక్షణగా ఉన్నారు. ఈ నాగజాతి ఆర్యుల ఆగడాలకు బలైపోయిన జాతి. అక్కడ నాగనది కూడా ఉంది. వీటన్నింటి కారణంగా తను బౌద్ధం స్వీకరించడానికి ఈ పట్టణాన్ని ఎన్నుకున్నానని అంబేద్కర్ వివరణ ఇచ్చారు.

ఆ రోజుల్లో లోకమాన్య బాలగంగాధర తిలక్ 'కేసరి' అనే పత్రిక వెలువరించేవారు. ఈయన అంబేద్కర్‌ను విమర్శిస్తూ వ్యాసాలు ప్రకటించేవారు. పేదలైన అస్పృశ్యలను అంబేద్కర్ తప్పుదారి పట్టిస్తున్నారనీ, వారిని బౌద్ధంలోకి తీసుకుపోవడం అన్యాయమనీ రాసేవారు. మృతకళేబరాలు తొలగించడం వల్ల మెహర్ (మాల-మాదిగ)లకు రూ.500 ఆదాయం లభిస్తోంది కదా? అది లేకుండా అంబేద్కర్ వారి నోట్లో మట్టి కొడుతున్నాడని విమర్శించారు. అంతే కాదు, రిజర్వేషన్‌తో వచ్చే యం.ఎల్.ఏ/యం.పీ సీట్లు పోతాయి కదా? దళితుల అవకాశాలకు అంబేద్కర్ గండి కొడుతున్నాడని తిలక్ అతని సహచరులు ఆక్రోషించారు. అంబేద్కర్ అందుకు చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చారు. బ్రాహ్మణులు మెహర్లుగా మారి, జంతు మృత కళేబరాలు తొలగిస్తూ, దాని మీద వచ్చే ఆదాయం వారు తీసుకోవచ్చు కదా? ఎందుకంత ఉక్రోషం?అని ప్రశ్నించారు. దళితుల రిజర్వేషన్ స్థానాల్లో కూడా అసెంబ్లీకి, పార్లమెంటుకు అగ్రవర్ణం వారే పోటీచేసి గెలుచుకోవచ్చు కదా అందులో ఉన్న ఇబ్బంది ఏమిటీ? అని ప్రశ్నించారు అసలు విషయం ఏమిటంటే సమనత్వానికి అగ్రవర్ణాల వారు అంగీకరించకపోవడమే! అధిక సంఖ్యాకులైన శూద్రులు, దళితులు తమకు బానిసలుగా పడి ఉండాలని వారు కోరుకోవడమే. ఆ పరిస్థితి మారిపోతూ ఉందంటే వారు భరించలేరు కదా? అధిక సంఖ్యాకులైన బహుజనులు తమ గుప్పిట్లోంచి ఎగిరిపోతున్నారని బెంబేలు పడిపోయారు. హిందుత్వ వాది అయిన తిలక్ బాధ కూడా అదే-

తమిళ బౌద్ధ ఉద్యమకారుడు పండిత అయోతీథాస్ అంబేద్కర్ బౌద్ధం స్వీకరించక ముందే ఒక మాట చెప్పారు. పీడిత కులస్తులంతా అస్తిత్వ పోరాటాలు చేయాలే గాని, కాందిశీకుల్లాగా అగ్రకులాలను అనుకరించగూడదని వాదించాడు. అలాగే మన తెలుగువాడు; ఫిజిక్స్ ప్రొఫెసర్, నవ బౌద్ధుడూ అయిన లక్ష్మీ నరసు రాసిన ESSENCE OF BUDDISM గ్రంథ ప్రభావం అంబేద్కర్‌పై బాగా పడిందని చెపుతారు. ఎందుకంటే 1948లో అంబేద్కర్ ఆ పుస్తకానికి ముందుమాట రాసి, తనే స్వయంగా బొంబాయిలో మలి ముద్రణ వేయించారు. ఇవన్నీ ఒక్కొక్కటిగా అంబేద్కర్ బౌద్ధం వైపు ఆకర్షింపబడడానికి కారణాలయ్యాయి. బౌద్ధం సముద్రం లాగా విశాలమైంది. లోతైంది. సముద్రంలో చేరిన నదుల నీటికి గుర్తింపు ఉండదు. బౌద్ధం స్వీకరించిన తర్వాత కులమతాల గుర్తింపులుండవు. అందరూ సమానమే! వైదిక ధర్మం అసమానతలపై ఆధారపడి ఉంటే, బౌద్ధం సమానత్వంపై ఆధారపడి ఉంది. అందుకే అది ప్రపంచంలోకి 128 దేశాలకు వ్యాపించింది. ఒక ధర్మకాంతి విలసిల్లింది. లోతుగా పరిశీలిస్తే మన రాజ్యాంగంలో బౌద్ధం ఉంది. బుద్ధుడు చెప్పిన కార్యకారణ సంబంధంలో నుంచే ప్రపంచ వైజ్ఞానిక పరిశోధనలు సాగాయి. బుద్ధుడి బోధనలు లేకపోతే గాంధీ అహింసా సిద్ధాంతం ఉండేది కాదు. పండిట్ నెహ్రూ పంచశీలా ఉండేది కాదు. కొంచెం లోతుగా ఆలోచిస్తే అన్నింటిలో బౌద్ధం మూలాలు కనిపిస్తాయి.



> ఆ రోజుల్లో లోకమాన్య బాలగంగాధర తిలక్ 'కేసరి' అనే పత్రిక వెలువరించేవారు. ఈయన అంబేద్కర్‌ను విమర్శిస్తూ వ్యాసాలు ప్రకటించేవారు. పేదలైన అస్పృశ్యలను అంబేద్కర్ తప్పుదారి పట్టిస్తున్నారనీ, వారిని బౌద్ధంలోకి తీసుకుపోవడం అన్యాయమనీ రాసేవారు. మృతకళేబరాలు తొలగించడం వల్ల మెహర్ (మాల-మాదిగ)లకు రూ.500 ఆదాయం అభిస్తోంది కదా? అది లేకుండా అంబేద్కర్ వారి నోట్లో మట్టి కొడుతున్నాడని విమర్శించారు. అంతే కాదు, రిజర్వేషన్‌తో వచ్చే యం.ఎల్.ఏ/యం.పీ సీట్లు పోతాయి కదా? దళితుల అవకాశాలకు అంబేద్కర్ గండి కొడుతున్నాడని తిలక్ అతని సహచరులు ఆక్రోషించారు. అంబేద్కర్ అందుకు చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చారు. బ్రాహ్మణులు మెహర్లుగా మారి, జంతుమృత కళేబరాలు తొలగిస్తూ, దాని మీద వచ్చే ఆదాయం వారు తీసుకోవచ్చు కదా? ఎందుకంత ఉక్రోషం? అని ప్రశ్నించారు.

అశోక చక్రమైనా, సారనాథ్ స్థూపమైనా, దేశ వ్యాప్తంగా ఊరూరా ఎన్నో బౌద్ధ చిహ్నాలు కనిపిస్తున్నాయి. ఒక రకంగా బౌద్ధ చిహ్నాలే దేశ చిహ్నాలయ్యాయి. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, దర్బార్ హాలులో నిలువెత్తు బౌద్ధ విగ్రహం ఉంది. దాని ముందే కేంద్ర మంత్రులంతా ప్రమాణ స్వీకారం చేస్తారు. భారతరత్న, పద్మశ్రీ, వంటి బిరుదులు ఇచ్చేదీ అక్కడే. అక్కడి బుద్ధ విగ్రహం పాదాలు ఏ ఎత్తులో ఉన్నాయో - రాష్ట్రపతి భవన్‌కి కింద కి.మీ. దూరంలో ఉన్న ఇండియా గేట్ పై భాగం అంతే ఎత్తులో ఉంటుంది. మన దేశంలోని రాజ్యాంగాన్ని వ్యవస్థలూ ప్రజలూ సరిగా పాటిస్తే - ఇప్పటికీ మన దేశం బౌద్ధ దేశంగానే కొనసాగుతూ ఉండేది. మానవహక్కులు, ఆత్మ గౌరవం బౌద్ధంలో దక్కుతాయి. అది దైవ భావన మీద, అసమానతల మీద, ఆధార పడిలేదు.

> ఇతర మతాల్ని, ధర్మాల్ని ప్రవేశ పెట్టినవారు, తాము దేవతలమనో, దేవదూతలమనో ప్రకటించుకున్నారు. కానీ, బుద్ధుడు అలా ప్రకటించుకోలేదు. కనీసం తన వారసుణ్ణి ప్రకటించమని శిష్యులు కోరినప్పుడు బుద్ధుడు అందుకు సమ్మతించలేదు. ధమ్మమే తన వారసుణ్ణి ప్రకటించుకుంటుందని చెప్పాడు. అందుకే భగవాన్ (పరిపూర్ణ మానవుడు) అయ్యాడు. అన్నింటినీ కాపీ కొట్టి తమలో కలిపేసుకున్నట్టుగానే ఈ పదాన్ని కూడా వైదికులు స్వీకరించారు. పైగా ఎక్కడా అస్తిత్వంలో లేనివాణ్ణి భగవంతుడని ప్రార్థిస్తూ వచ్చారు. ఇంకా ప్రార్థిస్తున్నారు. సర్వ జీవరాసుల్ని ప్రేమించాలని చెప్పిన బౌద్ధం - మానవజాతి అంతా ఒకటేనని, నేటి ఆధునిక జన్యుశాస్త్రం చెప్పిన విషయాన్ని శతాబ్దాలకు ముందే బౌద్ధం చెప్పింది. బౌద్ధం మనుషులైన వారందరికీ నచ్చుతుంది.

ఇతర మతాల్ని, ధర్మాల్ని ప్రవేశ పెట్టినవారు, తాము దేవతలమనో, దేవదూతలమనో ప్రకటించుకున్నారు. కానీ, బుద్ధుడు అలా ప్రకటించుకోలేదు. కనీసం తన వారసుణ్ణి ప్రకటించమని శిష్యులు కోరినప్పుడు బుద్ధుడు అందుకు సమ్మతించలేదు. ధమ్మమే తన వారసుణ్ణి ప్రకటించుకుంటుందని చెప్పాడు. అందుకే భగవాన్ (పరిపూర్ణ మానవుడు) అయ్యాడు. అన్నింటినీ కాపీ కొట్టి తమలో కలిపేసుకున్నట్టుగానే ఈ పదాన్ని కూడా వైదికులు స్వీకరించారు. పైగా ఎక్కడా అస్తిత్వంలో లేనివాణ్ణి భగవంతుడని ప్రార్థిస్తూ వచ్చారు. ఇంకా ప్రార్థిస్తున్నారు. సర్వ జీవరాసుల్ని ప్రేమించాలని చెప్పిన బౌద్ధం - మానవజాతి అంతా ఒకటేనని, నేటి ఆధునిక జన్యుశాస్త్రం చెప్పిన విషయాన్ని శతాబ్దాలకు ముందే బౌద్ధం చెప్పింది. బౌద్ధం మనుషులైన వారందరికీ నచ్చుతుంది. అందుకే, అంబేద్కర్ స్వీకరించి ఈ దేశ ప్రజలకు ఒక వెలుగుదారి చూపించారు. తన జీవితమంతా ఎదుర్కొంటూ వచ్చిన అణిచివేతను, అవమానాలను జీవిత చరమాంకంలో ఆయన బౌద్ధంతో తుడిపేసుకున్నారు. నవయాన నవబౌద్ధుడిగా మారారు. దేశానికి ఆదర్శమూర్తిగా నిలిచారు.

బౌద్ధం స్వీకరించడానికి డా.బి.ఆర్. అంబేద్కర్ నాగపూర్‌లో రామ్‌దాస్‌పేట్ ప్రాంతాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం అది నాగపూర్‌లోని అభయాంకర్‌నగర్‌లో ఉంది. ధమ్మదీక్ష తీసుకున్న తర్వాత ఒక నెల పదిహేను రోజులకు అంబేద్కర్ మరణించారు (6 డిసెంబర్ 1956) ఆయన మరణం తర్వాత ఇరవై మిలియన్ల మంది మార్చి 1959లో బౌద్ధం స్వీకరించారు. అంబేద్కర్ స్మారక సమితి ఏర్పడి నాలుగు ఎకరాలలో అక్కడ ఒక స్థూపం నిర్మించారు. గొప్ప బౌద్ధ దర్శనీయ స్థలంగా తీర్చిదిద్దారు.

- సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్
(మెల్బోర్న్ నుంచి)

'న్యూస్‌క్లిక్'పై యథేచ్ఛగా దాడి!

'న్యూస్ క్లిక్'పై దాడి, ఆ సంస్థ వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థ, మానవ వనరుల విభాగాధిపతి అమిత్ చక్రవర్తిలను అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం-యుఎపిఎ నిబంధనల కింద అరెస్టు చేయడం చూస్తుంటే మోడీ ప్రభుత్వాన్ని, ఆ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించే ఆ న్యూస్ పోర్టల్‌ను అణచివేసేందుకు చేసిన దారుణమైన ప్రయత్నంగా వుంది.

'న్యూస్ క్లిక్'పై చేపట్టిన ఈ అనూహ్యమైన చర్య మొత్తంగా స్వతంత్ర మీడియాకు చేసిన హెచ్చరికగా వుంది. అవసరమనుకుంటే స్వతంత్ర మీడియా గొంతు నొక్కివేయడానికి మోడీ ప్రభుత్వం ఎంతకైనా తెగిస్తుందనే సంకేతాలు పంపుతోంది. 'న్యూస్ క్లిక్'కు చెందిన 46 మంది జర్నలిస్టులు, సిబ్బంది, పార్ట్‌టైమ్ ఉద్యోగుల నివాసాలపై దాడులు జరిపి.. పుర్కాయస్థ, చక్రవర్తిలను అరెస్టు చేశారు. వీరందరి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని పదే పదే ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ కార్యాలయంలో ప్రశ్నిస్తున్నారు.

వీరికి సంధిస్తున్న ప్రశ్నావళి తీరు చూస్తుంటే, ఢిల్లీ పోలీసుల ఉద్దేశ్యాలు, వాటి వెనుక గల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆలోచనలు అర్థమవుతున్నాయి. సిఎఎ వ్యతిరేక ఆందోళనలు, ఈశాన్య ఢిల్లీ అల్లర్లు, మతోన్మాద హింసాకాండకు సంబంధించిన వార్తలు, 2020-21లో రైతుల ఆందోళన కవరేజీలో పాల్గొన్నారా అంటూ జర్నలిస్టులను ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాల గురించి రాసినా, వీడియోలు తీసినా... వారిని చట్ట వ్యతిరేక కార్యకలాపాల పరిధిలోకి తీసుకువచ్చారు. ఢిల్లీ పోలీసుల దృష్టిలో జర్నలిజం కూడా నేరమే!

కేంద్ర ప్రభుత్వం 2021లోనే 'న్యూస్ క్లిక్'ను లక్ష్యంగా చేసుకుంది. వెబ్‌సైట్ కార్యాలయంపై, ప్రమోటర్, ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) దాడి జరిపింది. వారిపై మనీ లాండరింగ్ అభియోగాలు మోపింది. ఆ సమయంలోనే 'న్యూస్ క్లిక్' తమ కంపెనీలో పెట్టుబడులుపెట్టిన వారి వివరాలను అందచేసింది. ఆర్‌బిఐ అనుమతితో అమెరికాలోని కొన్ని సంస్థలు, కంపెనీలు నిబంధనల ప్రకారం ఎలా నిధులు అందచేశాయో కూడా వివరించింది. 'న్యూస్ క్లిక్' సంపాదకులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, కోర్టు నుండి రక్షణ కూడా పొందారు. పుర్కాయస్థపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఢిల్లీ హైకోర్టు ఇ.డి.ని ఆదేశించింది.

'న్యూస్ క్లిక్' నిధులు, పెట్టుబడుల క్రమంలో ఎలాంటి అక్రమాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగాయని నిరూపించలేకపోవడంతో మోడీ ప్రభుత్వం తన రూటు మార్చింది. ఇందులో భాగంగా, ఆగస్టు 5 నాటి 'న్యూయార్క్ టైమ్స్' వ్యాసాన్ని తనకు అనుకూలంగా వాడుకుంది. అమెరికా పౌరుడు, టెక్ కంపెనీ మాజీ యజమాని అయిన నెవిల్లె రాయ్ సింగమ్ పెట్టుబడులు, నిధులు అందచేసిన సంస్థలు, మీడియా సంస్థల నెట్‌వర్క్ వివరాలు ఆ వ్యాసంలో వున్నాయి. భారత్‌లోని 'న్యూస్ క్లిక్' గురించి అసమగ్రమైన ప్రస్తావన మాత్రమే అందులో వుంది. భారత అధికారులు ఆ సంస్థపై దాడి చేశారన్నది వాస్తవం. అంతేకానీ ఆ సంస్థ ఎలాంటి తప్పులు చేసిందనే ప్రస్తావనే లేదు. అయితే, 'న్యూస్ క్లిక్'పై విషపూరితమైన దాడి చేయడానికి బిజెపి దీన్నొక సంకేతంగా వాడుకుంది. పైగా ఈ వెబ్‌సైట్‌కు చైనా నుండి నిధులు అందుతున్నాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి తప్పుడు ఆరోపణలు చేశారు. దాంతో, 'న్యూస్ క్లిక్'ను లక్ష్యంగా చేసుకోవడానికి చైనా కార్డును వాడుకోవాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించేసింది. ఆ వెంటనే ఢిల్లీ పోలీసుల కార్యాచరణ ఆరంభమైంది.

ప్రబీర్ పుర్కాయస్థ తదితరులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని ఎట్టకేలకు అరెస్టు చేసిన నిందితులకు అందచేశారు. అది కూడా పోలీసులను కోర్టు ఆదేశించిన తర్వాతనే జరిగింది. ఎఫ్ఐఆర్‌లో నిరంకుశమైన యుఎపిఎ, ఐపిసి సెక్షన్లు 153-ఎ, 120-బి లను (మతం, నేరపూరితమైన కుట్ర ప్రాతిపదికగా వివిధ వర్గాల మధ్య మతపరమైన శతృత్వాన్ని పెంపొందించినందుకు) వారిపై మోపారు.

ఆ ఎఫ్ఐఆర్ అంతా ఆరోపణలతో నిండిపోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసమ్మతి, అసంతృప్తులను సృష్టించాలనే, దేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలను దెబ్బతీయాలనే లక్ష్యంతో శత్రు శక్తులు ఏ విధంగా విదేశీ నిధులను భారత్‌లోకి అక్రమంగా చొప్పించారో సాధారణ వర్ణనలు వున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, కాశ్మీర్‌లను భారత్‌లో అంతర్భాగం కాదని చూపించేందుకు కుట్ర జరిగిందని కూడా ఆ ఎఫ్ఐఆర్ పేర్కొంది. అయితే ఈ ఆరోపణల్లో వేటినీ నిరూపించే సాక్ష్యాధారాలను అందచేయలేదు. పైగా, 2020-21లో ప్రజల నిత్యావసరాల సరఫరాలు, సేవలకు అంతరాయం కలిగేలా రైతాంగ ఆందోళనను సుదీర్ఘంగా పొడిగించేందుకు ప్రయత్నించారనే విపరీతమైన ఆరోపణలు చేశారు. ఇలా చేయడం ద్వారా, రైతుల ఆందోళనకు అప్రతిష్ఠ పాల్జేశారు. దాన్నొక విధ్వంసకర కార్యకలాపంగా ముద్రవేశారు. జియోమి, వివో వంటి చైనా టెలికం కంపెనీల నుండి అందుకున్న ప్రయోజనాలకు ప్రతిగా ఆ కంపెనీలపై నమోదైన కేసుల్లో వాదించడానికి గానూ లీగల్ కమ్యూనిటీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి, దాని కోసం ప్రచారం చేయడానికి కుట్ర పన్నారంటూ నిందితులపై వింతైన అభియోగాలు మోపారు. అక్కడితో ఆగకుండా, ఈ కుట్రను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు భారత్‌లోకి అక్రమంగా విదేశీ నిధులను చొప్పించడం కోసం...ఈ రెండు చైనా టెలికం కంపెనీలు పిఎంఎల్ఎ, ఫెమా నిబంధనలను ఉల్లంఘించి భారత్ లోకి వేలాది బూటకపు కంపెనీలను చొప్పించాయంటూ ఆరోపించారు. ఇంత తీవ్రమైన ఆరోపణలు చేసినా కూడా, ఈ కంపెనీలకు, 'న్యూస్ క్లిక్'కు లేదా నిందితులకు సంబంధాలున్నాయని చూపించలేకపోయారు.



> 'న్యూస్ క్లిక్' నిధులు, పెట్టుబడుల క్రమంలో ఎలాంటి అక్ర మాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగాయని నిరూపించ లేకపోవడంతో మోడీ ప్రభుత్వం తన రూటు మార్చింది. ఇందులో భాగంగా, ఆగస్టు 5 నాటి 'న్యూయార్క్ టైమ్స్' వ్యాసాన్ని తనకు అనుకూలంగా వాడుకుంది. అమెరికా పౌరుడు, టెక్ కంపెనీ మాజీ యజమాని అయిన నెవిల్లె రాయ్ సింగమ్ పెట్టుబడులు, నిధులు అందచేసిన సంస్థలు, మీడియా సంస్థల నెట్ వర్క్ వివరాలు ఆ వ్యాసంలో వున్నాయి. భారత్‌లోని 'న్యూస్ క్లిక్' గురించి అసమగ్రమైన ప్రస్తావన మాత్రమే అందులో వుంది.

పైన చెప్పినట్లుగా, చైనా వనరుల నుండి నిధులు అందుతున్నాయన్న తప్పుడు ఆరోపణలతో 'న్యూస్ క్లిక్' ప్రతిష్ఠను మసకబరచాలని లక్ష్యంగా పెట్టుకున్న మోడీ ప్రభుత్వ రాజకీయ ఉద్దేశ్యాలను ఎఫ్ఐఆర్ వెల్లడించింది. పైగా యుఎపిఎ నిబంధనలను మోపడాన్ని సమర్థించుకోవడానికి జాతి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అభియోగాలను దీనితో ముడిపెట్టారు. ఈ 'న్యూస్ క్లిక్' వెబ్‌సైట్ వామపక్షాల భావజాలంతో పని చేసే, రైతులు, కార్మిక వర్గం ఉద్యమాలకు బలంగా నిలిచే వార్తా వెబ్‌సైట్ కావడమే ఇంతటి విషపూరితమైన దాడి జరగడం వెనుక గల ప్రధాన వాస్తవంగా వుంది. ఇటీవలే, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, భారతదేశంలో వామపక్ష అనుకూల శక్తులపై నిరంతరం పోరాడాలని పిలుపిచ్చారు.

'న్యూస్ క్లిక్'పై దాడి పత్రికా స్వేచ్ఛపై జరిగిన అతి దారుణమైన దాడి. అంతేకాదు, ప్రజాస్వామ్యం, పౌరుల హక్కులపై పెరుగుతున్న నిరంకుశ దాడుల్లో భాగం కూడా. అందువల్ల, పూర్తి శక్తియుక్తులతో, నిబద్ధతతో ఈ దాడులను ప్రతిఘటించాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
శుక్రవారం | అక్టోబర్ 20, 2023 | www.navatelangana.com



ముకుంద జ్యువెలరీ షోరూం ప్రారంభోత్సవం

సందడి చేసిన సినీ తార కావ్య కళ్యాణ్

నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్



ఖమ్మం నగరంలోని వైరారోడ్‌లో గల ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా మొట్టమొదటి సారీగా జ్యువెలరీ ఫ్యాక్టరీ ఔట్లెట్ నూతన బ్రాంచ్ ముకుంద జ్యువెలర్స్‌ను దాచేపల్లి కృష్ణ, నికితా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముకుంద జ్యువెలరీ షోరూంని సినీ తార కావ్య కళ్యాణ్ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుంద జ్యువెలరీ షోరూం వాళ్ల ఎన్నో ఆఫర్లు ప్రకటించారు. ఎంత బంగారం కొంటే అంత వెండి ఉచితంగా పొందే విధంగా అలాగే, మేకింగ్ ఛార్జెస్ లేవు, విఏ 2-12శాతం ఆఫర్స్ ఓన్లీ మూడు రోజులు మాత్రమే వర్తిస్తాయని అన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. 9 మార్చి 2023 హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ నందు తమ మొదటి బ్రాంచ్ ప్రారంభించామని, తాము ఊహించిన దానికంటే ఎక్కువ సక్సెస్ కావడంతో నేడు ఖమ్మంలో కూడా తామ ఇంకో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. తమని ప్రోత్సహిస్తున్న కస్టమర్లకు కతజ్ఞతలు తెలిపారు. అలాగే మరెన్నో బ్రాంచ్లను ప్రారంభిస్తామని తెలిపారు.

నారాయణ మృతి పట్ల మంత్రి సంతాపం

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరం 56వ డివిజన్‌కు చెందిన కన్నేటి లక్ష్మీ నారాయణ మృతి పట్ల మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం వారి నివాసంకు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డిజిటల్ మీడియా సేవలు వినియోగించుకోవాలని వినతి

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో వార్తలు కవరేజ్ చేయుటకు డిజిటల్ మీడియా సేవలు ప్రభుత్వం వినియోగించుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముళ్ళపాటి రామారావు, మందా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఖమ్మం జిల్లా డిపిఆర్‌ఓ యస్.కె. గౌస్‌ను డిజిటల్ మీడియా అసోసియేషన్ ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డిజిటల్ మీడియా అసోసియేషన్ నాయకులు అమరబోయిన ఉపేందర్, రేపల్లె నాగేశ్వర్, చింతా కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులతో బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ సమావేశం

నవతెలంగాణ-కొణిజర్ల

.మండలంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్ గురువారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అందరూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోని ప్రజల్లోకి తీసుకొని పోవాలని సూచించారు. ఇంకా నలభై రోజులు మాత్రమే ఎన్నికలకు సమయం ఉందని అందరూ ఐక్యంగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వై చిరంజీవి, ఏలూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోట్ల కవిత, పోట్ల శ్రీనివాస్‌రావు, బోడపోతుల బాబు, దేరంగుల బ్రమ్మం, కిలారు కిరణ్, పాములు వెంకటేశ్వర్లు, జడ మల్లేష్, చేరుకుమల్లి రవి, దొడ్డపనేని రామారావు, తాళ్లూరి చిన్న పుల్లయ్య, చల్లా మోహన్‌రావు, సుడా బండారు కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, దొండపాటి లక్ష్మి, మాన్సింగ్, నాగ దేవి, కాంతమ్మ, నీలా ప్రకాష్, పార్వతీ, డి.లలిత కుమారీ, అంబేద్కర్ నాగేశ్వర్‌రావు, రోషన్ బేగ్, బాలాజీ చిరంజీవి, సురేశ్, నాగమణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు

ఆర్డీవో గణేష్, ఏసిపి రెహమాన్

నవతెలంగాణ- ఎర్రుపాలెం

రాష్ట్రంలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్నికలు సజావుగా జరిగే విధంగా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఖమ్మం ఆర్డీవో గణేష్, వైరా ఏసిపి రెహమాన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన భీమవరం, అయ్యవారి గూడెం గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలు, సమావేశలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మన్నే ఉషా శారద, స్థానిక ఎస్సై సురేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణం తనిఖీ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండలంలో వరంగల్ క్రాస్ రోడ్‌లోని మద్యం దుకాణంను ఎన్నికల అధికారులు గురువారం తనిఖీ చేశారు.పాలేరు నియోజకవర్గ ఆర్వో రాజేశ్వరి, ఎన్నికల అధికారులు కలిసి మద్యం దుకాణంలో స్టాక్, రిజిస్టార్లను పరిశీలించారు. రికార్డుల ప్రకారం ఉన్న మద్యానికి, వాస్తవంగా ఉన్న మద్యానికి ఉన్న వ్యత్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు రామకృష్ణ, ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలోని శ్రీ లలిత రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం నందు శ్రీ శోభకృత్ నామ సంవత్సర శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవములలో భాగంగా గురువారం ఐదువ రోజు అమ్మ వారికి ప్రధాన అర్చకులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారు జామున అమ్మ వారికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, నిత్య అర్చనలు,హెూమములు వేద పండితులు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గోపూజ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నవతెలంగాణ-వైరా



ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలోని టీఎస్ డబ్ల్యూఆర్‌ఎస్ గురుకుల పాఠశాలలో వైరా అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎం స్ట్రాంగ్ రూముల భవనాలను జిల్లా కలెక్టర్ వి పి గౌతం, జిల్లా పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్, అదనపు కలెక్టర్ రిటర్నింగ్ అధికారి సత్యప్రసాద్, అడిషనల్ సీపీ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన భవనాన్ని పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ స్థలాలను ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలలోని పరిసర ప్రాంతాలలోని పిచ్చి చెట్లను చెత్తను తొలగించి పోలింగ్ సిబ్బందికి అధికారులకు అసౌకర్యం లేకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అధికారులు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో వైరా ఏసిపి రహమాన్, సీఐ సాగర్, మండల స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గాజా ఆస్పత్రిపై ఇజ్రాయిల్ వైమానిక దాడి అమానవీయ చర్య

ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని యుద్ధాన్ని తక్షణమే ఆపాలి

సెమినార్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, విద్యావేత్త ఐవి.రమణారావు

నవతెలంగాణ-ఖమ్మం



పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం, దాడులు ఇలాగే కొనసాగితే మరింత మారణహెూమం జరుగుతుందని, ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకుని యుద్ధానికి ముగింపు పలకాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, విద్యావేత్త ఐ.వి.రమణారావులు కోరారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "పాలస్తీనా-ఇజ్రాయిల్ దురాక్రమణ" అనే అంశంపై గురువారం స్థానిక సుందర్యభవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో నున్నా, రమణారావులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే వేలాదిమంది మంది ప్రాణాలు కోల్పోయారని, గాయాలపాలయ్యారని అన్నారు. ఇజ్రాయెల్‌లోని మితవాద నెతన్యాహు ప్రభుత్వం పాలస్తీనా భూములను విచక్షణారహితంగా ఆక్రమించి వెస్ట్ బ్యాంక్‌లో యూదుల నివాసాలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అల్ అక్సా మజీద్‌లో అక్రమంగా యూదులు ప్రార్ధన చేయడానికి ప్రయత్నించిన నాటినుండి హింస పెరిగిందని, ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిందని, ఆ దాడులను సాకుగా చూపి ఇజ్రాయెల్ పాలస్తీనాపై యుద్ధం చేస్తున్నదని అన్నారు. అమెరికా ఇజ్రాయెల్ పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తూ పాలస్తీనా సమస్య పరిష్కారం కాకుండా అడ్డుపడుతున్నదని విమర్శించారు.

గాజా నగరంలోని బాప్టిస్ట్ ఆసుపత్రిపై తాజాగా ఇజ్రాయిల్ దళాలు జరిపిన దాడి అత్యంత హేయమైన చర్య అని, సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని, ఈ దాడిలో మహిళలు, పిల్లలతో సహా వందలాది మంది పాలస్తీనియన్లు మరణించారని, ఇది అత్యంత ఘోరమైన దాడి అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనీయులను నేతన్యాహు ప్రభుత్వం ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తుంటే, ఇక్కడి మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా ఈ దేశంలోని ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యం, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం, రాజ్యాంగం లేదా రాజ్యాంగ హక్కులు అన్నీ నాశనం చేసేందుకు నిరంకుశ మోడీ ప్రభుత్వం తెగపడుతున్నట్టే, పాలస్తీనా ప్రజల హక్కులను కాలరాసేందుకు అక్కడ జాత్యహంకార నెతన్యాహు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అమెరికా ప్రత్యక్ష మద్దతుతో ఇజ్రాయిల్ తన ఆక్రమణ సాగిస్తుంటే, దానికి మోడీ వంత పాడుతున్నారని వారు దుయ్యబట్టారు.

ఐక్యరాజ్యసమితి పాలస్తీనా ప్రజలకు చట్టబద్ధమైన భౌగోళిక హక్కులను నిర్ధారించి, పాలస్తీనా భూభాగంలోని ఇజ్రాయెల్ ఆక్రమణలను తొలగించాలని, రెండు దేశాలను గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని ఇజ్రాయెల్ అమలు చేసేలా చూడాలన్నారు. ఐరాస తీర్మానానికి అనుగుణంగా తూర్పు జెరూసలేంను పాలస్తీనా రాజధానిగా గుర్తించాలని, ఇజ్రాయెల్ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని, భారత ప్రభుత్వంతో సహా అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకొని పాలస్తీనా సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సెమినార్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, జిల్లా నాయకులు, జిల్లా సెంటర్ శాఖల సభ్యులు పాల్గొన్నారు.

వైఆర్‌కే ఆశయ సాధనకు కృషి చేద్దాం

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



ప్రజా సమస్యల పరిష్కారంలో పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులుగా అనేక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చిన మార్క్సిస్టు మేధావి డాక్టర్ యలమంచిలి రాధాకృష్ణమూర్తి అని, ప్రజా హక్కులపై పోరాడి ఎమర్జెన్సీ కాలంలో అరెస్టు అయిన నిబద్ధత కలిగిన మార్క్సిస్టు అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ వైఆర్‌కె 10వ వర్ధంతి కార్యక్రమం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన సుందరయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వైఆర్‌కె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వైద్యులుగా జీవితం ప్రారంభించి కమ్యూనిస్టు నాయకుడిగా, మార్క్సిస్టు పార్టీ (సిపిఎం)లో రాష్ట్రస్థాయి నాయకుడిగా అనేక హెూదాలలో పనిచేసి పార్టీకి వైఆర్‌కే ఎంతో సేవ చేశారని, పౌరహక్కుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, చివరి శ్వాస వరకు పార్టీ అభివృద్ధికి కృషి చేసిన దార్శనికుడు అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, బండారు రమేష్, భూక్యా శ్రీనివాసరావు, బివికె మేనేజర్ వై.శ్రీనివాసరావు, మేరుగు రమణ, బండారు యాకయ్య, ఆఫీసు సిబ్బంది పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



వ్యకాస ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-ముదిగొండ

భారత రాజ్యాంగ హక్కులను కాపాడాలని ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముదిగొండలో గురువారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగా బడ్జెట్లో నిధులు తగ్గించిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని డిసెంబర్ 4న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నెమిలి సైదులు, ఊటుకూరి నాగేశ్వరరావు, యరదేశి నాగేశ్వరరావు, బండి పుల్లారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి ఖమ్మంలో 10 స్థానాలు మావే

మధిరలో కమలరాజ్‌ను ఆశీర్వదించాలి : ఎంపీ నామ

నవతెలంగాణ-చింతకాని

దేశంలోనే తెలంగాణను నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి, పార్టీ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించుకోవాలని బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. చింతకాని మండల బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలుతో బడుగు, బలహీన వర్గాలను ఉన్నతంగా అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను గుర్తుంచుకొని, ఈ ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. సామాన్యుడి కోసం కేసీఆర్ సంకల్పం అద్భుతమన్నారు. మధిరలో లింగాల కమలరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి 10 స్థానాలు గెలిచి, సత్తా చూపిస్తామని అన్నారు. విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య కార్యదర్శి వెంకట రామారావు, ఎంపీపీ పూర్ణయ్య, వైస్ ఎంపీపీ హన్మంతరావు, మాజీ ఎంపీపీ రత్నాకర్, నాయకులు మంకెన రమేష్, నాయకులు బండి రామారావు, బండి తిరపయ్య, జలగబోయిన కృష్ణ, జానీమియా, ఎస్సీ సెల్ నాయకులు మిట్టపల్లి కొండలు తదితరులు పాల్గొన్నారు.

గాలి అరుణ్‌కుమార్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

సంస్మరణ సభలో సీపీఐ(ఎం) నేతలు పోతినేని, నున్నా

నవతెలంగాణ-వైరాటౌన్



రిటైర్డ్ ప్రొఫెసర్ కామ్రేడ్ గాలి అరుణ్ కుమార్ అకాల మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం హైదరాబాద్ కొండాపూర్ ఆదిత్య సన్ షేన్ క్లబ్‌లో గాలి అరుణ్ కుమార్ సంస్మరణ సభ రిటైర్డ్ ప్రొఫెసర్ శాఖమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి గాలి అరుణ్ కుమార్ వామపక్ష భావజాలంతో ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొనేవారని, మార్క్సిస్టు సిద్ధాంతం కోసం అయన విశేష కృషి చేశారని అన్నారు. వైరా మండలం పూసలపాడు గ్రామం కమ్యూనిస్టు నాయకులు గాలి వెంకటేశ్వరరావు రెండవ సంతానం అరుణ్ కుమార్ విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో చురుకైన నాయకుడిగా ఎదిగారని, ఉస్మానియా యూనివర్సిటీలో చరిత్ర విభాగం ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తూ అనేక మంది విద్యార్థులకు సహాయం చేశారని, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం అభివృద్ధి కోసం యూనివర్సిటీలో పుచ్చలపల్లి సుందరయ్యతో సమావేశం నిర్వహించారని అన్నారు. వైరా మండలంలో గాలి అరుణ్ కుమార్ కుటుంబం సిపిఐ(ఎం) పార్టీకి కొండంత అండగా ఉన్నారని, పార్టీ అభివృద్ధికి వారు చేసిన కృషి, త్యాగం మరువలేనిదని అన్నారు. అరుణ్ కుమార్ ఆకస్మిక మరణం బాధను గురిచేసిందని, పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. అనంతరం సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు యం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, రిటైర్డ్ ప్రొఫెసర్లు పుల్లయ్య, రామచంద్రయ్య, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, కిలారు కృష్ణయ్య, కుటుంబ సభ్యులు గాలి ప్రేమ సాగర్, అరుణ, శివయ్య, మురళి, మచ్చా వెంకటేశ్వరరావు, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరుడు మృతి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం ఎర్రబోడుకు చెందిన ఉపసర్పంచ్ వజ్జా నరేష్ తండ్రి సీపీఐ(ఎం) సానుభూతిపరుడు వజ్జా చిన్న అనంతరాములు(64) గురువారం మృతి చెందాడు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నాడు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు నరేష్ ఉప సర్పంచ్ గా ఉన్నారు. మృతుడు చిన్న అనంతరాములు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ వజ్జా రామారావుకు స్వయాన సోదరుడు. మృతదేహాన్ని వజ్జా రామారావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, సర్పంచ్ కుర్సం సత్యనారాయణ లు సందర్శించి నివాళ్లు అర్పించారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-ముదిగొండ

రాష్ట్ర శాసనసభ ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఎస్సైగజ్జెల నరేష్ ఆధ్వర్యంలో మండలంలో విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. మండలం, రాష్ట్ర సరిహద్దు అయిన వల్లభి చెక్ పోస్ట్ వద్ద వాహనాలను ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో తనిఖీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 500 మందిని బైండోవర్ చేశామన్నారు. ఫ్లయింగ్ పోలీసు స్క్వాడ్,పోలీస్ నిఘా విభాగాలు మండలంలో వివిధ గ్రామాల్లో పర్యటించి పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాహనాల తనిఖీలు ఇటీవల కాలంలో వెంకటాపురం వద్ద 3.57 లక్షల నగదు పట్టుకొని సీజ్ చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించామన్నారు.



53వ డివిజన్‌లో ఇంటింటికీ ప్రచారం

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని 53వ డివిజన్‌లో కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఖమ్మం బిఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం నగరంలోని 53వ డివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య ఆధ్వర్యంలో డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి అజయ్ కుమార్‌ని గెలిపించాలని మంత్రి సతీమణి పువ్వాడ వసంత లక్ష్మీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - ఎర్రుపాలెం

సీఎల్పీ లీడర్ మధిర శాసనస భ్యులు మల్లు భట్టి విక్రమార్క కృషితో మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని పెగళ్లపాడు గ్రామానికి చెందిన భవానికి 12 వేల రూపాయలు, అయ్యవారి గూడెం గ్రామానికి చెందిన విజయ రాజుకు 24 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. చెక్కుల కోసం కృషి చేసిన ఎమ్మెల్యే భట్టికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సగ్గుర్తి వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ ప్రజల అభివృద్ధి, సంక్షేమం నాది బాధ్యత..

ఆత్మీయ సమ్మేళనంలోమంత్రి పువ్వాడ

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఇక్కడ ప్రజల అభివృద్ధి, సంక్షేమం నా బాధ్యత అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. గురువారం ఖమ్మం కార్పొరేషన్ 24వ డివిజన్ లో డివిజన్ నాయకుడు రెహమాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడారు. ఇక్కడ ఒక కార్పొరేటర్ కేవలం తమ స్వార్థం కోసమే కాంగ్రెస్ పార్టీ లోకి వెళ్లడం జరిగింది.. పోతే పోనీ.. పోయింది వ్యక్తి మాత్రమే.. పార్టీ నాయకులు, కార్యకర్తలు మనతోనే ఉన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్ లు మక్బూల్, దాదే అమృతమ్మ, నాయకుడు పిల్లి విజయ్ పాల్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ సూరపనేని శేషగిరి బాబు, యూత్ అధ్యక్షుడు పేశెట్టి మనోహర్, మైనార్టీ నాయకుడు తాజ్‌ఉద్దీన్, యూత్ సెక్రటరీ అనిల్, యూత్ వైస్ ప్రెసిడెంట్ అస్లాం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కడారి వెంకన్న, ఎస్సీ సెల్ సెక్రెటరీ చందు, నాయి బ్రాహ్మణ సంఘం వైస్ ప్రెసిడెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ విధులకు హాజరు కావాలి

విద్యార్థులకు సర్టిఫికెట్లు సకాలంలో అందించాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య డిమాండ్

నవతెలంగాణ-ఎర్రుపాలెం



గతంలో ఎర్రుపాలెం తాసిల్దార్ కార్యాలయం నందు డి ప్యూటీ తాసిల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీ పై వె ళ్ల గా ఆయన స్థానంలో సురేష్ ని నియామకం చేపట్టగా డిప్యూటేషన్ పై హైదరాబాదులో పని చేస్తుండటం తో విద్యార్థిని విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందటం లేదని డిప్యూటీ తాసిల్దార్ విధులకు హాజరు కా వాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ.. గత రెండు నెలల నుండి మండల తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ లేకపోవడం వలన విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ జారీ చేయడంలో ఆలస్యం జరుగుతుందని ఆయన అన్నారు. మీసేవ నుండి అభ్యర్థులు అందించిన దరఖాస్తు లు కనిపించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడు తున్నారని అన్నారు. డిప్యూటీ తాసిల్దార్ విధులకు హాజరయ్యేలాగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థిని విద్యార్థులకు ప్రజలకు సకాలంలో సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు రామిశెట్టి సురేష్, దివ్వెల వీరాంజనేయులు, సిఐటియు మండల కన్వీనర్ సగుర్తి సంజీవరావు, రైతు సంఘం నాయకు లు ఎనమల శ్రీనివాసరెడ్డి, వత్తి సంఘం నాయకులు నాగలవంచ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు

నవ తెలంగాణ-చింతకాని



సెర్ప్ కార్యాలయంలో శ్రీ చెన్నకేశవ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున మహిళలు బతుకమ్మలతో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అనంతుల రమేష్, ఏపిఎం తిరుమలరావు, మండల పరిషత్ సూపరింటెంట్ రాజ్యలక్ష్మి, మండల మహిళా సమైఖ్య సభ్యులు, ఐకేపి సిసిలు, అకౌంటెంట్, పంచాయతీ కార్యదర్శులు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.



'విజయ'లో బతుకమ్మ వేడుకలు

కొణిజర్ల : మండల పరిధిలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆరవ రోజూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఉన్న మహిళ అధ్యాపకులు విద్యార్థినులు బతుకమ్మని చాలా గొప్పగా పేర్చి, బతుకమ్మ పాట కోలాటలతో, బతుకమ్మ నృత్యాలతో సాంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన బతుకమ్మలతో ఆడి పాడారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్‌పర్సన్ పి.విజయలక్ష్మి విద్యార్థినులను మహిళా సిబ్బందిని అభినందించారు. వారికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు,వివిధ విభాగాల అధిపతులు, ఫ్యాకల్టీ విద్యార్థులు పాల్గొన్నారు.



రెజొనెన్స్‌లో బతుకమ్మ సంబురాలు

ఖమ్మం : ఖమ్మం నగరంలోని రెజొనెన్స్ జూనియర్ కళాశాలలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆర్‌వి.నాగేంద్ర కుమార్, నీలిమ, శ్రీధర్‌రావు, క్రిష్ణవేణి, ప్రిన్సిపల్స్ సతీష్, భాస్కర్ రెడ్డి, శాంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సండ్రను గెలిపించుకుంటే... మరింత హెూదాలో చూసుకుందాం

- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి
- గెలిచేది బీఆరెస్సే.. మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆరే
- ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరావు
- ఈ పదేండ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలవాలి
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి

ఈసారి జరిగే ఎన్నికల్లో మన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను గెలిపించుకుంటే ఆయన్ను మనమంతా మరింత హెూదాలో చూసుకుందామని రాజ్యసభ సభ్యులు, హెటిరో డ్రగ్స్ అధినేత డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. గురువారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షనహాలులో గురువారం సాయంత్రం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వరరావుతో కలిసి బండి పాల్గొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎంపీ బండి మాట్లాడుతూ ఎంపీ నామాకు, జిల్లాకు ఇద్దరు రాజ్యసభ్యులను చేసిన నాతో పాటు వద్దిరాజు రవిచంద్రకు సండ్రను గెలిపించే బాధ్యత మా భుజస్కందాలపై ఉందన్నారు. సండ్రను గెలిపించుకుందామని, చిరకాలంగా ఉన్న మన కోరికను నెరవేర్చుకుందామని డాక్టర్ బండి స్పష్టం చేశారు. వ్యాపారవేత్తగా ఎంతో బిజీగా ఉండే నేను ఈ 30రోజులు సెలవు పెట్టి మరీ అందరికి అందుబాటులో ఉంటూ సండ్ర గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని బండి తేల్చిచెప్పారు. నవంబరు 1న కల్లూరు జరిగే కేసీఆర్ సభను మనమంతా ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేద్దామన్నారు. కేసీఆర్ మన జిల్లాకు వస్తే మనకు ఏ విధమైన వరాలిస్తారో మొన్న సత్తుపల్లిలో జరిగిన సభలో కేటీఆర్ ప్రకటించిన దళితబంధు పథకమే ఇందుకు ఉదాహరణ అన్నారు. ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ఎంతో అద్భుతంగా ఉందన్నారు. మేనిఫెస్టోలో ఉన్న కార్యక్రమాలన్నీ అమలుచేసే దమ్ము కేసీఆర్‌కు ఉందన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఈ పదేండ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వర రావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, డీసీసీబీ డైరెక్టర్లు చల్లగుండ్ల కృష్ణయ్య, గొర్ల సంజీవరెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమవతిశంకరరావు, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, గాదె నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, సర్పంచులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు మృతి

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ సభ్యుడు కొండ నాగేశ్వరరావు (57) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సీపీఐ(ఎం) నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ నాగేశ్వరరావు చురుకుగా పాల్గొనేవాడు. నాగేశ్వరరావు అనేక సంవత్సరాల నుంచి పార్టీ సభ్యుడుగా కొనసాగుతున్నాడు. ముష్టికుంటలో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడు. మృతదేహంపై పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, కొంగర వెంకటనారాయణ కప్పారు. మృతదేహాన్ని మాజీ సర్పంచ్ బంధం వెంకటరాజ్యం, సిపిఎం మండల కమిటీ సభ్యులు దొప్ప కొరివి వీరభద్రం, పిల్లలమర్రి వెంకట అప్పారావు, సిపిఎం శాఖా కార్యదర్శులు షేక్ నజీర్, బోయినపల్లి కోటేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరావు, బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు నాయకులు బూర్గుల అపాచారి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి : కెవిపిఎస్

నవతెలంగాణ- నేలకొండపల్లి



భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు పాపేట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని వివిధ గ్రామాలలో కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మనువాద సిద్ధాంతం నశించాలి, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే నినాదంతో భారత రాష్ట్రపతికి అందించే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతం ముసుగులో దేశ ప్రజల మధ్య ఐక్యతను, విశ్వాసాలను మంటగలిపి, మనువాద సిద్ధాంతాన్ని బలవంతంగా రుద్దేందుకు కుట్ర చేస్తుందని మండిపడ్డారు. భారత రాజ్యాంగ స్వేచ్ఛ, హక్కులు పౌరులకు దక్కకుండా ప్రజలను బానిసలుగా మార్చే అనాగరిక చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి రెండవ సారి అధికారం చేపట్టిన తర్వాత అట్టడుగు వర్గాలుగా ఉన్న దళితులు, గిరిజనులు, మహిళలు, పేద ప్రజలపై నిత్యం దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ఆయా వర్గాలకు కల్పించిన హక్కులు ఏమాత్రం అమలు కావడం లేదని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన దళిత గిరిజనులు అనేక చోట్ల తీవ్ర వివక్షతకు గురవుతున్నారన్నారు. యూనివర్సిటీ విద్యాసంస్థలలో వివక్షతకు గురై అనేకమంది విద్యార్థులు, యువత ఆత్మ బలిదానాలకు గురికావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి పొట్టపింజర స్టాలిన్, కూరపాటి ప్రసాద్, పెదపాక భాస్కరరావు, భవాని, ఎల్లమ్మ, నిర్మల, తిరుపమ్మ, రేణుక, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యర్థుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు..

కార్యకర్తలు సంసిద్ధం కావాలి

1న సీఎం సభను జయప్రదం చేయాలి

- ఎంపీలు నామ నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, ఎంఎల్ఏ సండ్ర

నవతెలంగాణ- కల్లూరు



ఎన్నికలు వచ్చాయంటే ప్రత్యర్థ పార్టీలు అధికార పార్టీపై అవాకులు చవాకులు పేలుతుంటాయని, ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తుం టారని, బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు వారు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు సంసిద్ధులు కావాలని ఎంపీలు నామ నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్యలు అన్నారు. పట్టణంలో గురువారం జరిగిన టిఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాలకు చెందిన ఈ సందర్భంగా నామ, బండి, సండ్రలు మాట్లాడుతూ 1న జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని, సభను చూసి ప్రత్యర్థుల గుండెలు దద్దరిల్లి పోవాలన్నారు. ప్రతి కార్యకర్త ఒక అభ్యర్థి లాగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ 40 రోజులు కార్యకర్తలు, నాయకులు గ్రామం వదిలి పోవటానికి వీలులేదని, ప్రతి కార్యకర్త ఒక సండ్ర లాగా ప్రచారం నిర్వహించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులకు దీటుగా సమాధానం చెప్పేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వర రావు, గ్రంథాలయ చైర్మన్ ఉమామహేశ్వరరావు, టిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు పాలెపు రామారావు, కల్లూరు, పెనుబల్లి జడ్పీటీసీలు కట్టా అజయ్ కుమార్, చెక్కిలాల మోహన్‌రావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండి ఇస్మాయిల్, పెనుబల్లి ఎంపీపీ లక్కినేని అలేఖ్య, సొసైటీ చైర్మన్లు కీసర వెంకటేశ్వరరెడ్డి, బోబోలు లక్ష్మణరావు, చావా వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కే.వెంకటేశ్వరరావు, మేకల కృష్ణ పాల్గొన్నారు.



సీఎం బహిరంగ సభాస్థలి పరిశీలన

శాసనసభ ఎన్నికల సందర్భంగా నవంబర్ ఒకటో తేదీన కల్లూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ ఎన్నికల సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథరెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్యలు తిరువూరు క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న మారుతీ నగర్‌లో 50 ఎకరాల స్థలాన్ని బహిరంగ సభ కోసం పరిశీలించారు. అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని ఇక్కడే సభ నిర్వహించాలని సండ్రకు ఎంపీ నామ సూచించారు.

అన్ని వర్గాలను కలుపుకుపోవాలి : ఎంపీ

వైరా: నవంబర్ 30న జరగనున్న ఎన్నికల్లో బేషజాలు వదిలి అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగాలని ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరావు కోరారు. గురువారం వైరా నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వర రావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథరెడ్డి, ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్, పార్టీ అభ్యర్థి బానోతు మదన్ లాల్ పాల్గొని ప్రసంగిం చారు. నామా మాట్లాడుతూ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని, అందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టటం ఖాయం అన్నారు కార్యక్రమంలో జడ్‌పిటిసి నంబూరి కనక దుర్గ, బాణాల వెంకటేశ్వర్లు, కట్టా కృష్ణార్జునరావు, పసుపులేటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మనస్పర్థలు మరచిపోదాం..ఐక్యంగా కదులుదాం

మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

అలక వీడిన ఎంపీపీ దంపతులు

నవతెలంగాణ-కారేపల్లి



బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తేవటానికి మనస్పర్థలు వీడి గెలుపుకోసం ఐక్యంగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ వైరా నియోజవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. గురువారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో సమావేశం పార్టీ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బానోత్ మదన్‌లాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాన్ని ప్రజాప్రతినిధులుగా ముందుకు పోవల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. అమరకలు లేకుండ పని చేద్దామని బీఆర్ఎస్‌ను గెలిపించుకోవటం ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధుల ద్వారా అమలు జరుపుకోవచ్చన్నారు. సమస్యలుంటే నియోజవర్గ ఇంచార్జీ ఎంపీ నామా నాగేశ్వరరావుకు విన్నవించు కుందాన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల,జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, వైస్‌ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, సొసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షులు భూక్యా రంగారావు, ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు దారావత్ పాండ్యానాయక్, దిశ కమిటీ సభ్యులు బానోత్ కుమార్, సీనియర్ నాయకులు తోటకూరి పిచ్చయ్య, మాలోత్ కిషోర్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అలక వీడిన ఎంపీపీ దంపతులు

కారేపల్లి ఎంపీపీ మాలోత్ శకుంతలకిశోర్ దంపతులు వైరా బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ పై ఆయన ఎమ్మెల్యేగా కొనసాగిన తరణం నుండి గుర్రుగా ఉన్నారు. మదన్‌లాల్ పై ఉన్న కోపంతో ఇండిపెండెంట్‌గా నిలిచిన లావుడ్యా రాములునాయక్‌ను వైపు నిలిచారు. ఈక్రమంలో వైరా బీఆర్ఎస్ అభ్యర్థిగా మదన్‌లాల్‌కు భీ ఫాం లభించింది. సింగరేణి బీఆర్ఎస్ నాయకులను సమన్వయం చేయటానికి ఖమ్మంలో బుధవారం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు సమక్షంలో వైరా అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ భేటీ ఆయ్యారు. ఇరు వర్గాలను ఎంపీ నామా సమన్వయం చేయటంతో ఎంపీపీ దంపతులు అలక వీడి శాంతించారు. ఈ బేటీ అనంతరం గురువారం కారేపల్లిలో జరిగిన ప్రజాప్రతినిధుల సమన్వయ సమావేశంలో ఎంపీపీ దంపతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నేత ఇంట్లో కాంగ్రెస్ నాయకుల సమావేశం

మండలంలో మారనున్న రాజకీయ పరిణామాలు

నవతెలంగాణ-వైరా

ఎస్‌టి రిజర్వుడ్ నియోజకవర్గం వైరాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నట్లు కనిపిస్తున్నవి. బుధవారం సాయంత్రం బిఆర్ఎస్ కీలక నేత మచ్చా వెంకటేశ్వరరావు (బుజ్జి) ఇంట్లో కాంగ్రెస్ పార్టీ పొంగులేటి ప్రధాన అనుచరుల్లో ఒకరు మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా నియోజకవర్గం కాంగ్రెస్ టిక్కెట్ రేసులో ఉన్న బానోత్ విజయా బాయి సమావేశం నిర్వహించారు. ఈ కలయిక బిఆర్ఎస్ పార్టీకి భారీ గండి గొట్టే ఉద్దేశంతో జరిగినట్లు తెలుస్తోంది. 2014లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా సీపీఎం మద్దతుతో గెలిచిన బానోత్ మదన్ లాల్ కొద్ది రోజులకే సిరిపురం(కె జి) ఎంపిటిసి సభ్యుడిగా సీపీఎం అభ్యర్థిగా గెలిచిన మచ్చా వెంకటేశ్వరరావును బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని తన ప్రధాన అనుచరుడిగా నియమించుకుని నియోజక వర్గంలో సగం ఎమ్మెల్యేని చేశారు. 2018 ఎన్నికల్లో మదన్ లాల్ కు ప్రధాన ఎన్నికల క్యాంపైనర్‌గా కూడా పని చేసిన మచ్చా మదన్ లాల్ ఓటమి తర్వాత కొద్ది రోజులకే ఇద్దరి మధ్య తీవ్ర విభేదాలు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన లావుడియా రాములు నాయక్ బిఆర్ఎస్‌లో చేరడంతో మచ్చా కుటుంబానికి పార్టీ మారాల్సిన అవసరం రాకుండా ఎమ్మెల్యే అనుచరుల్లో ఒకరుగా చెలామణి అయ్యారు. అంతే కాక మచ్చా వెంకటేశ్వరరావు తండ్రి మచ్చా నరసింహారావును జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యునిగా చేశారు. నియోజక వర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యేకి బిఆర్ఎస్ టిక్కెట్ నిరాకరించి మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ కు ఇవ్వటంతో మచ్చా కుటుంబం ఇరకాటంలో పడింది. ఎమ్మెల్యే రాములు నాయక్ ముఖ్యమంత్రి కెసిఆర్ పట్ల విధేయత ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రిగా కెసిఆర్ మూడవ సారి ప్రమాణం చేయాలని, అందుకు మా బావ మదన్ లాల్‌ను గెలిపించాలని కోరుతూ ఏర్పాటు చేసిన సమావేశంలో మచ్చా వెంకటేశ్వర రావు సహజంగా మెడలో వేసుకునే బిఆర్ఎస్ కండువాను పక్కన పెట్టి కూర్చున్న విషయం మరువలేము. ఆ తరువాత ఆయన అమెరికా వెళ్లి మంగళవారం సిరిపురం రాగా పొంగులేటి అనుచరులు, గ్రామానికి చెందిన ఆయన అనుచరులు, కాంగ్రెస్ నాయకులు, ముఖ్యంగా పొరుగు గ్రామం పుణ్యపురం గ్రామ సర్పంచ్, ప్రముఖ కాంట్రాక్టర్ గద్దె మల్లి ఖార్జునరావు, సిరిపురం సర్పంచ్ మట్టూరి ప్రసన్నాంభ భర్త నాగేశ్వరరావు సమావేశంలో పాల్గొనటంతో మండలంలో బిఆర్ఎస్ పార్టీలో పెద్ద గండి పడనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన రాగానే బిఆర్ఎస్ పార్టీలోని అసంతృప్తి విస్ఫోటనంగా మారనున్నట్లు తెలుస్తోంది.



కొనసాగుతున్న పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ - ఖమ్మం

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నియమావళి అమలుల్లోకి రావడంతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. 9వ తేదీ నుంచి 19 వరకు జరిపిన ఆకస్మిక తనిఖీలల్లో నగదు, మద్యం, గంజాయిని సీజ్ చేసినట్లు పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో 24/7 పర్యవేక్షిస్తూ జిల్లాలో పటిష్ఠ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈనెల 9వ తేదీ నుండి 19వ తేదీ వరకు రూ.2.32 కోట్ల నగదు, రూ.8,83,653 విలువ గల 1468.915 లీటర్ల మద్యం, రూ. 12,30,125 విలువ గల 46.595 కేజీల గంజాయి, రూ. 3,96,521 విలువ గల క్రాకర్స్ సీజ్ చేసినట్లు తెలిపారు. మొత్తం కేసులు 282 నమోదు చేసినట్లు తెలిపారు.

డీసీసీబీ ఉపాధ్యక్షుడు దొండపాటి రాజీనామా

నవతెలంగాణ-మధిర

మధిర మండలం ఖమ్మంపాడు గ్రామానికి చెందిన డీసీసీబీ ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు గురువారం తన డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. అదే విధంగా తన సతీమణి ఖమ్మంపాడు సర్పంచ్ దొండపాటి రుక్మిణమ్మ సైతం తన సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ క్రియాశీల రాజకీయాల నుంచి విరమణ చేస్తున్నట్లు తెలిపారు.



మధిరలో భట్టి విక్రమార్క సతీమణి ప్రచారం

నవతెలంగాణ-మధిర

మధిర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క గెలుపును ఆకాంక్షిస్తూ ఆయన సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క, కుమారుడు మల్లు సూర్య విక్రమాదిత్య గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తక సంఘం, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరి తిరుపతిరావుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలు వినియోగించుకోండి

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండల పరిధిలోని వీఎం బంజర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తపాలాశాఖ ఆధ్వర్యంలో "డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి సబ్ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్‌లో సమాజంలో కష్టపడి పని చేసే వారి దగ్గర నుంచి వ్యాపారం చేసే వారి వరకు ఉద్యోగస్తులకు అనేక వర్గాల వారికి అనుకూలమైన పథకాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పెనుబల్లి ఎంపీడీవో, ఎంపీవో, సెక్రటరీలు, అంగన్వాడి టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం

నవతెలంగాణ-కారేపల్లి

దేవినవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కారేపల్లి మహిళ భక్తులకు చీరలు పంపిణీ జరిగింది. కారేపల్లిలోని శ్రీనివాస బుక్‌స్టాల్ పక్కన ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద నిర్వాహకులు బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు పిల్లి వెంకటేశ్వర్లు చీరలను వితరణచేయగా వాటిని సర్పంచ్ ఆదెర్ల స్రవంతి మహిళలకు అందజేశారు. శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గా దేవి మండపం వద్ద మహిళలు కోలాట నృత్యం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించటానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. మండపాల వద్ద ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అజ్మీర వీరన్న, ఏఎంసీ డైరక్టర్ వాంకుడోత్ నరేష్, కమిటీ సభ్యులు చిన్ని శ్రీను, సురేష్ బూబ్, బృందావన్ మధు, సూర్యదేవర వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

వైరాకు సిఆర్‌పిఎఫ్ బలగాలు

నవతెలంగాణ-వైరా



వైరా నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు సమస్యాత్మక ప్రాంతాల్లో విధుల్లో పాల్గొనేందుకుసి ఆర్పిఎఫ్ పోలీస్ బలగాలు వైరాకు చేరుకున్నాయి. అసిస్టెంట్ కమాండెంట్ కుల్ దీప్ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది విధుల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వైరా ఏసిపి రహమాన్, సిఐ సాగర్, ఎస్సై మేడా ప్రసాద్, వైరాలోని కెవిసిఎం డిగ్రీ కళాశాలలో సిఆర్పిఎఫ్ బలగాలకు బస, మౌలిక వసతులు కల్పించారు. రేపటి నుంచి వైరా నియోజకవర్గంలో బోర్డర్ చెక్ పోస్టుల వద్ద ఈ బలగాలు తనిఖీలు చేపడతాయని ఏసీబీ రహమాన్ తెలిపారు. నియోజక వర్గంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికలను ప్రశాంత వాతా వరణంలో నిర్వహిం చేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సిఆర్పిఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | అక్టోబర్ 20, 2023 | www.navatelangana.com

డెంగ్యూతో విద్యార్థిని మృతి



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన గోడె సుమ వర్షిని (25) డెంగ్యూ ఫీవర్‌తో బుధవారం రాత్రి మృతి చెందింది. గ్రామానికి చెందిన గోడె మోహన్ రావు, సత్య శ్రీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఒక బాబు ఉన్నారు. మోహన్ రావు గత పది ఏళ్ల క్రితం పిల్లల ఉన్నత చదువుల కోసం హైదరాబాదులోని సూరారం ప్రాంతంలో చిన్న హోటల్ నడిపిస్తూ జీవన సాగిస్తున్నాడు. పెద్ద కూతురు సుమ వర్షిని చిన్ననాటి నుండి చదువుల్లో ఉన్నతంగా రాణించేది. వరంగల్‌లోని వాగ్దేవి కళాశాలలో ఇటీవల ఫామ్ డి పూర్తి చేసిన సుమ వర్షిని ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. కాగా గతవారం రోజుల క్రితం ఫీవర్ రావడంతో తల్లిదండ్రులు హైదరాబాదులోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు డెంగ్యూ ఫీవర్‌గా నిర్ధారించి వైద్యం అందిస్తున్నారు. ప్లేట్ లెట్స్ పూర్తిగా పడిపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందింది.

ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా ఆశీర్వదించండి

- విలేకర్ల సమావేశంలో రిటైర్ట్ సీఐ జార బిక్షం



నవతెలంగాణ-ఇల్లందు

అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు రిటైర్ట్ సీఐ జార బిక్షం తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పోటీ చేస్తునట్లు తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని ఆబాద్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్వస్థలం బయ్యారం మండలం, ఇర్సులాపురం గ్రామం. ఇద్దరు కొడుకులు ఒకరు డాక్టర్, మరొకరు టీచర్. ఎస్ఐ, సబ్ ఇన్‌స్పెక్టర్‌గా 27 ఏండ్లు ఖమ్మం జిల్లాలో పని చేశాను. ప్రమోషన్‌తో సీఐగా ఆదిలాబాద్‌లో పనిచేసి అక్కడే రిటైర్‌మెంట్ అయినట్లు తెలిపారు. తను గత ఆరు నెలల క్రితం ఆబాద్ పార్టీని హసన్ షేక్ స్థాపించారని తెలిపారు. ప్రధానంగా విద్యా, వైద్యం ఉచితంగా సంపూర్ణంగా అందించాలని పేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో పార్టీ స్థాంపిచారని తెలిపారు. పార్టీలో యువత, విద్యావంతులు ఉన్నారని తెలిపారు. ఇటీవల అదే ఆశయంతో పార్టీని నడిపిస్తున్నారని అందరి సహాయ సహకారాలతో ఆబాద్ పార్టీ నడుస్తోందన్నారు. పాలకులు గెలిచిన ప్రజా ప్రతినిధులు స్వార్ధం కోసం పనిచేశారని అన్నారు. తనను ఎంఎల్ఏగా గెలిపిస్తే నిస్వార్ధంగా పని చేసి ప్రజా సేవకు అంకితమౌతానని పేర్కొన్నారు.

నియోజకవర్గం ఏర్పాటు-చరిత్ర...


ఎమ్మెల్యే హరిప్రియ


మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య


మాజీ ఎమ్మెల్యే కే.ఎల్ నరసింహారావు


మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కమ్యూనిస్టులకు కంచుకోట ఇల్లందు

10 సార్లు కమ్యూనిస్టులదే విజయం

నవతెలంగాణ-ఇల్లందు

తెలంగాణ రాష్ట్రంలో బొగ్గుట్ట (ఇల్లందు) నల్లబంగారానికి ప్రసిద్ధి. సింగరేణికి జన్మనిచ్చిన ఖ్యాతి ఇల్లందు సొంతం. 1952కు పూర్వం ఇల్లందు వరంగల్ జిల్లాలో అంతర్భాగం. అనేక మంది నాయకుల కృషి ఫలితం, పరిపాలనా సౌలభ్యం దృష్టా ఇల్లందు, గార్ల, బయ్యారం సుదిమళ్ళ ప్రాంతాలతో 1952లో ఇల్లందు నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పటికీ ఇల్లందు నియోజకవర్గం వరంగల్ జిల్లాలో అంతర్భాగమే. 1985లో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు మండల వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గంలోకి బయ్యారం, గార్ల, ఇల్లందు, గుండాల, కారేపల్లి, టేకులపల్లి మండలాలను చేర్చారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా గుండాల మండలాన్ని పినపాక నియోజకవర్గంలో కలిపారు. కారేపల్లిని వైరా నియోజకవర్గంలో కలిపారు. కామేపల్లి మండలాన్ని కొత్తగా ఇల్లందు నియోజకవర్గంలో కలిపారు. సీఎం కేసిఆర్ జిల్లా పునర్విభజన చేపట్టారు. ఇల్లందు నియోజకవర్గంలో ఇల్లందు, టేకులపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం 5 మండలాలు మాత్రమే ఉన్నాయి. పాలనా పరంగా ఇల్లందు, టేకులపల్లి మండలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉండగా కామేపల్లి మండలం ఖమ్మం జిల్లాలో, బయ్యారం, గార్ల మండలాలలను మహబూబాబాద్ జిల్లాలో చేర్చారు. దీంతో ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలో ఇల్లందు నియోజకవర్గం ఉంది.

14సార్లు అసెంబ్లీ ఎన్నికలు : 8 మంది ఎమ్మెల్యేను అందించిన ఇల్లందు

1952లో తొలిసారి సాధారణ ఎన్నికలు జరిగాయి. 1952 నుండి 1972వరకు జనరల్ నియోజకవర్గంగా ఉంది. 1952లో తొలిసారి జరగిన సాధారణ ఎన్నికలల్లో ఇల్లందు నియోజకవర్గం నుండి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్(పిడిఎఫ్) అభ్యర్థిగా కారేపల్లికి చెందిన కెఎల్.నర్సింహారావు పోటీ చేసి గెలుపొందారు. 1957లో జరిగిన అసెంబ్లి ఎన్నికల్లో కాంగ్రేస్ అభ్యర్థిని ఓడించి కెఎల్ నర్సింహారావు గెలుపొందారు. 1962లో కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అభ్యర్థిగా కెఎల్ నర్సింహారావు కాంగ్రేస్ అభ్యర్థిపై పోటీచేసి ముచ్చటగా మూడవసారి గెలుపొందారు. 1967లో కాంగ్రేస్ అభ్యర్థి జి.సత్యనారాయణ, 1972లో కాంగ్రేస్ అభ్యర్థి వంగా సుబ్బారావు ఎన్నికయ్యారు. 1978లో ఇల్లందు నియోజకవర్గాన్ని ఎస్‌టీలకు రిజర్వు చేశారు. 1978లో సిపిఐ(ఎంఎల్) అభ్యర్థిగా చాపల ఎర్రయ్య గెలుపొందారు. అనంతరం కాంగ్రేస్ పార్టీలో చేరారు. 1983-1989 మధ్య మూడు పర్యాయాలు, 1999-2004 మధ్య రెండుసార్లు. మొత్తం అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ(ఎంఎల్) అభ్యర్థిగా 5సార్లు గుమ్మడి నర్సయ్య ఎన్నికయి చరిత్ర సృష్టించారు. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ తరపున ఊకె అబ్బయ్య ఎంఎల్ఏగా గెలుపొందారు. 2009లో జరిగిన అసెంబ్లి ఎన్నికల్లో సీపీఐ(ఎం), సీపీఐ బలపరిచిన ఊకె అబ్బయ్య టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 1952 నుండి 2019 వరకు 15సార్లు అసెంబ్లి ఎన్నికలు జరగగా ఇల్లందు నియోజకర్గం నుండి 8 మంది ఎంఎల్ఏలు సేవలందించారు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం 2014 మార్చి 30న జరిగిన అసెంబ్లి ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీ అభ్యర్థిగా పోటి చేసిన కోరం కనకయ్య ఎంఎల్ఏగా ఎన్నికకాగా టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రతిపక్ష పార్టీలో ఉంటే ఇల్లందును అభివృద్ధి చేయలేనని భావించిన ఎంఎల్ఏ కోరం హైదరాబాదులో సీఎం సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుని అధికార పార్టీ ఎంఎల్ఏగా కొనసాగారు. రాష్ట్రంలో 2019లో ముందస్తు అసెంబ్లి ఎన్నికలు జరిగాయి. ఇల్లందులో కాంగ్రేస్ పార్టీ తరపున పోటీ చేసిన హరిప్రియ ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో రెండవసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి కేసిఆర్ మరోసారి సీఎం అయ్యారు. దీంతో అభివృద్ధి కోసం టీఆర్ఎస్ పార్టీలో చేరి గులాబి కండువా కప్పుకున్నారు ఎంఎల్ఏ హరిప్రియ. 2023 అసెంబ్లి ఎన్నికల సందర్భంగా హరిప్రియ బీఆర్ఎస్ టికెట్, బీఫాం దక్కించుకుని పోటీకి సిద్ధంగా ఉన్నారు.

సింగరేణిలో బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాలరీస్ కార్పోరేట్ ఏరియా ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం, కార్పొరేట్ ఏరియా పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్‌లలో పని చేసే మహిళా ఉద్యోగులు వైభవముగా బతుకమ్మ సంబురాలలో బతుకమ్మ ఆటాపాటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆడపడుచులు అపురూపంగా జరుపుకునే గొప్ప వేడుక బతుకమ్మ అని, మన సంస్కృతికి ఇది దర్పణంగా నిలుస్తుందన్నారు. సింగరేణిలో కంపెనీ ఛైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు అన్ని ఏరియాల్లోనూ ఈ పర్వ దినాలను కంపెనీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో అట్ల బతుకమ్మను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అనంతరం జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య మాట్లాడుతూ మహిళలు గౌరమ్మను పూజిస్తూ ప్రకృతి విపత్తుల నుంచి అందరినీ కాపాడాలని ఆకాంక్షిస్తూ పూజలు చేస్తారన్నారు. జీఎం (పర్సనల్), ఈఈ అండ్ సిఎస్ఆర్ కవితా నాయుడు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులందరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ డాక్టర్ పి.సుజాత, ఏజీఎం (పర్సనల్) కె.శ్రీనివాస రావు, డిజీఎం (పర్సనల్) నారాయణ రావు, ఏసిఎంఓ సునీల, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలికపై బీఆర్ఎస్ నాయకుడి అత్యాచారయత్నం

- బాధితులపట్ల పోలీస్ తీరుని నిరసిస్తూ మహిళా సంఘం ఆందోళన



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అధికార పార్టీ నాయకుడినన్న అహంకారానికి తోడు కామంతో కళ్ళు మూసుకుపోయి అభం, శుభం తెలియని మైనర్ పై అత్యాచారయత్నం చేసిన మానవీయ ఘటన భద్రాచలంలో చోటుచేసుకుంది. భద్రాచలం పట్టణం రామాలయ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు సతీష్ అలియాస్ సెటిల్మెంట్ సత్తి తన ఇంటి సమీపంలోనే నివాసం ఉంటున్న బాలికకు మాయమాటలు చెప్పి మార్కెట్కు కూరగాయల కొనుక్కోవడం కోసం అని తీసుకువెళ్లి ఒక ప్రైవేటు లాడ్జిలో మాట్లాడాలని చెప్పి అత్యాచారయత్నం చేస్తుండగా తెలిసినవారు వెంటనే కుటుంబ సభ్యులకి సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు నిందితుడైన సతీష్‌కి దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్లో అప్పచెప్పారు. స్టేషన్లో పోలీస్ సమక్షంలో ఉన్నప్పటికీ నిందితుడి వంకర బుద్ధి మారక బాలిక కుటుంబ సభ్యులతోనే ఎంత డబ్బు అయినా చెల్లిస్తానని బేరమాడి ప్రయత్నం చేశాడు. నిందితుడికి పోలీసులు కూడా పరోక్షంగా సహకరిస్తున్నారని గమనించిన బాలిక కుటుంబ సభ్యులు వెంటనే సీపీఐ(ఎం) మహిళా సంఘం నాయకులకు సమాచారం అందించారు. పోలీస్ స్టేషన్ చేరుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, మహిళా సంఘం నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. బాలికకు అండగా నిలిచిన పార్టీ మహిళా సంఘం నాయకుల పట్ల పోలీసుల తీరును నిరసిస్తూ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఒక దశలో మహిళా సంఘం నాయకులకు పోలీసులకు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మహిళా సంఘం ఆందోళనకు దిగి వచ్చినా పోలీసులు నిందితుని వెంటనే లాకప్పులో వేసి నిందితుడుపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా సంఘం పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డిలు మాట్లాడుతూ నిందితుడైన సతీష్ పై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయని, అతని మొదటి భార్య సైతం అనుమానాస్పంద స్థితిలో మృతి చెందిందని ఆరోపించారు. తర్వాత రెండోవ వివాహం చేసుకున్నారని అన్నారు. అధికార పార్టీ అండదండలతో బాలికపై అత్యాచారయత్నం చేసిన వాడిని కఠినంగా శిక్షించాల్సిన పోలీసులు అధికార పార్టీ అన్న పేరుతో పోలీస్ స్టేషన్లో రాచ మర్యాదలు చేయటం దుర్మార్గమని విమర్శించారు. నిందితుని శిక్షించక పోగా మైనర్ బాలిక కుటుంబ సభ్యులను పోలీసులు ఇబ్బందులు గురిచేయటం సరైన చర్య కాదని అన్నారు. వెంటనే పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లో ఆందోళన చేసిన వారిలో మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు ఉస్తేల జ్యోతి, జిల్లా నాయకులు నాదెండ్ల లీలావతి, మచ్చ రమాదేవి, సీఐటీయూ జిల్లా నాయకులు భూక్య రమేష్, సత్య, సంతోష్, ఆది, బాలిక తరపున బంధువులు ఆందోళనలో పాల్గొన్నారు.

పోలీస్ అధికారులంతా బాధ్యతగా పనిచేయాలి

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ



నవతెలంగాణ-కొత్తగూడెం

రాబోయే సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ డాక్టర్ వినీత్.జి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరూ బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఓటర్లను నగదు, మద్యం, ఇతర వస్తువులతో ప్రలోభ పెట్టే వారిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు..

పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి

ఈ నెల 21వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఫ్లాగ్ డే సందర్భంగా జరగనున్న పోలీస్ అమరవీరుల సంస్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. వ్యాసరచన పోటీలు, ఆన్‌లైన్ ఓపెన్ హౌస్, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు, ఇతర కార్యక్రమాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న పలు కేసుల ఫైళ్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. న్యాయవాధికారులతో సమన్వయంతో కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని కోరారు. అమాయక ప్రజలు సైబర్ క్రైమ్స్ బారిన పడి తమ డబ్బును నిత్యం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం వర్టికల్స్ వారీగా గత నెలలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రతిభను కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, ఇల్లందు డిఎస్పి రమణమూర్తి, మణుగూరు డిఎస్పీ రాఘవేందర్రావు, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, సైబర్ క్రైమ్స్ డిఎస్పీ కృష్ణయ్య, సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల పై వేధింపులు ఆపాలి

- నల్ల బ్యాడ్జీలతో నిరసన

నవతెలంగాణ-మణుగూరు

ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని, బండ్లగూడ డిపో కండక్టర్ శ్రీవిద్య అధికారుల వేధింపుల వలన ఆత్మహత్య చేసుకున్నదని, గురువారం మణుగూరు బస్సు డిపో ముందు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో అధికారులు కార్మికులను వేధిస్తున్నారని అన్నారు. అక్రమంగా ట్రాన్స్ఫర్స్, సస్పెన్స్ కూడా చేస్తున్నారని అన్నారు. దీనికి నిరసన తెలిపామన్నారు. డిపో నందు ఎస్‌డబ్ల్యూ ఎఫ్ డిపో అధ్యక్షులు టి.సుధాకర్, డిపో కార్యదర్శి కె.వి రామారావు, సీనియర్ కామ్రేడ్ ఎస్.కె సలిం, రమేష్, ఎస్.కె. పాష, ఆర్.ఎన్.రావు, సిహెచ్ శ్రావణి, టీఎంయూ నాయకులు ఏ.నారయణా తదితర కార్మికులు బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు.

బీటీపీఎస్‌లో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-మణుగూరు

భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలను గురువారం నిర్వహించారు. అందమైన బతుకమ్మలతో మహిళలు అలరించారు పిల్లా పాపలతో కలిసి బతుకమ్మ ఆటలలో బీటీపీఎస్ సీఈ బిచ్చన దంపతులు పాల్గొన్నారు. తెలంగాణలో దసరా పండుగను పురస్కరించుకుని బతుకమ్మ పండుగను ఎంతో ఘనంగా వాడ వాడలో నిర్వహిస్తారు. మహిళలతో పాటు ప్లాంట్ సీఈ బిచ్చన్న దంపతులు కలిసి కోలాటాలు ఆడి, బతుకమ్మలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు డీఈలు ఇంజనీర్లు, ఇంజనీర్ల సంఘాలు, కార్మికులు, కార్మిక సంఘాలు, శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుల తల్లి చదువుకి సింగరేణి ఉద్యోగులు, అధికారుల బాసట

నవతెలంగాణ-కొత్తగూడెం

పేదింటి చదువుల తల్లి చదువుకి సింగరేణి ఉద్యోగులు, అధికారుల బాసటగా నిలిచారు. వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండల్, దమ్మపేట గ్రామానికి చెందిన గడ్డం శృతి మమతా మెడికల్ కాలేజ్ ఖమ్మంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. ఆమె తండ్రి చిన్నతనములో చనిపోవడంతో, తల్లి కూలి పనులు చేసి శృతిని చదివించింది. ప్రస్తుతం ఆమెకు మమతా మెడికల్ కాలేజ్ ఖమ్మంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నది కానీ ద్వితీయ సంవత్సర పరీక్షకు ఫీజు, ఇతర ఖర్చులకు సైతం ఇబ్బందిపడే పరిస్తితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న సింగరేణి ఏరియా అధికారులు ఆ కుటంబానికి బాసటగా నిలిచారు. పద్మావతి ఖని మైన్ మేనేజర్ తెలియజేయగానే మేనేజర్ సానుకూలంగా స్పందించారు. మైన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల, అధికారుల అందరి నెలసరి జీతం నుండి ప్రతి నెలకు రూ.50 లు చొప్పున సోషల్ వెల్ఫేర్ ఫండ్ కోసం రికవరీ గత కొంతకాలంగా చేశారు. ఈ సందర్భంగా వారు ఆ రికవరీ చేసిన అమౌంట్ నుండి రూ.35వేలు చెక్కును శృతికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు అందచేశారు. ఈ సందర్భంగా పద్మావతి ఖని మైన్ ఉద్యోగులకు, అధికారులకు ప్రత్యేక అబినందనలు తెలిపారు. కొత్తగూడెం ఏరియాలోని ఎంవీటీసీ మేనేజర్, బీవీఎస్ శర్మ ఎంవీటీసీలో పనిచేయు ఉద్యోగులు అండ్ అదికారులు వితరణ ద్వారా రూ.37 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎంవీటీసీ సత్తుపల్లిలోని అమ్మ అనాద ఆశ్రమానికి రూ.50వేలు, పెనగడప గవర్నమెంట్ స్కూల్‌కు రూ.25వేలు, హేమచంద్రాపురం అనాద ఆశ్రమానికి రూ.20వేలు ఎర్రగుంట మెడికల్ విద్యార్థికి రూ.50వేలు ఇవ్వడం జరిగిందని ఇది చాలా అభినందనీయం అని తెలిపారు. భవిష్యత్తులో ఆమెకు మరింత సహకారమందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఎస్ఓ టు జీఎం జీ.వి. కోటి రెడ్డి, పద్మావతి ఖని మైన్ ఏజెంట్, బి.రవీందర్, ఎంవీటీసీ మేనేజర్, బి.వి.ఎస్ శర్మ, డి.జి.ఎం పద్మావతి ఖని మైన్ పాలడుగు శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ బి.శివ కేశవ రావు, సెక్యూరిటీ అధికారి రమణ రెడ్డి, సీనియర్ పిఓ పద్మావతి ఖని మైన్ అజయ్, ఎం.వి.టి.సి హెడ్ ఓవర్ మెన్ మల్లికార్జున్, రిపోర్టర్ షబ్బీర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కొమరం భీమ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-పినపాక

ఆదివాసీలు తమ హక్కుల సాధన కోసం కొమరం భీమ్ పోరాట స్పూర్తిని ఆదర్శంగా తీసుకొని, పోరాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గౌరీ నగేష్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని జానంపేట గ్రామంలో ఆ సంఘం జిల్లా నాయకులు మడివి రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి ఇంత కాలమైనా ఆదివాసీల బతుకులు మాత్రం మారలేదన్నారు. ఈ నెల 27న గ్రామ గ్రామాన కొమరం భీం వర్ధంతి నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుబ్బా గోవర్దన్, నరసింహారావు, భవతి, శంకర్, రమేష్, జోగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఏఎంసి కాలనీలో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చాలా ఘనంగా ఆడపిల్లల్ని పుట్టనిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం, ఆత్మగౌరవంతో బతకనిద్దాం అనే నినాదంతో బతుకమ్మ సంబరాలు ఆటపాటలతో ఘనంగా బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు యు.జ్యోతి, ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మిలు మాట్లాడుతూ రోజురోజుకీ ఆడపిల్లల మీద హత్యలు, అత్యాచారాలు ఎక్కువగా పెరుగుతున్నాయన్నారు. మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు యన్ లీలావతి, ఆఫీస్ బేరర్ సున్నం గంగ, పీఎన్ఎమ్ రాష్ట్ర నాయకురాలు గౌతమి, సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ కే.సత్య, ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు మడియం లక్ష్మి, జి.నాగలక్ష్మి, సీత, దేవి, రజియా తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

మంచి కమ్యూనిస్టు బండి రాజయ్య

- సీపీఐ(ఎం) నివాళి



నవతెలంగాణ-ఇల్లందు

కరుడుగట్టిన కమ్యూనిస్టు బండి రాజయ్య అని సీపీఐ(ఎం) పట్టణ సీనియర్ నేత కూకట్ల శంకర్ అన్నారు. ఏలూరి భవన్‌లో గురువారం బండి రాజయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి వారి సతీమణి బండి భారతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సూపర్ వైజర్‌గా పనిచేసినప్పటికీ కింది స్థాయి కార్మికుల పక్షాన నిలబడి యాజమాన్యంతో కోట్లాడి కార్మిక హక్కుల్ని కాపాడిన మంచి మిత్రుడు రాజయ్య అని అన్నారు. మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఖాదర్, సర్వన్, ఆర్‌బీజే రాజు, మహమూద్, హుస్సేన్, ఎం.వీరయ్య లక్ష్మీశీనివాస్, నారాయణ, నాగేశ్వరరావు, లక్ష్మీ, రాంబాయి పాల్గన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించకండి : సీఐ



నవతెలంగాణ-పినపాక

ఆదివాసీల అభివృద్ధి కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఈ బయ్యారం సీఐ శివప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వలస గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శివ ప్రసాద్ మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం



నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని సులానగర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షుని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం మాజీ ఎమ్మెల్యే జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య గురువారం ప్రారంభించారు. ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరిస్తూ, రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్యా దేవా నాయక్, మాజీ అధ్యక్షుడు గుండా నరసింహా రావు, సర్పంచ్ అజ్మీరా బుజ్జి, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ ఉల్లోజి ఉదయ్, టేకులపల్లి మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యా నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే : ఎంపీడీఓ

నవతెలంగాణ-పినపాక

నవంబర్ 30న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, పారదర్శికంగా ఎన్నికలు నిర్వహించేందకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎలక్షన్ కోడ్ ఆఫ్ కండక్ట్ అన్ని రాజకీయ పార్టీలు పాటించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం ఆయన ఈ బయ్యారంలో పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీ లేదా అభ్యర్థి కుల మతాల ఆధారంగా ఓట్లు అడగరాదని, ఆలయాలు, మసీదులు, చర్చ్‌లు వంటి మతపరమైన ప్రదేశాలలో బహిరంగ సభలు గాని వాటి ద్వారా ఓట్లు అడగడం గాని చేయరాదన్నారు. భవనలపై, గోడలపై, వాహనాలపై కరపత్రికలు అటించడం, పార్టీ జెండాలు ప్రదర్శించడం, బ్యానర్లు కట్టడం వంటి చర్యలకోసం మండల ఆర్వో అనుమతితో పాటు, సంబంధిత యజమాని అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టప్రకారం శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్ఐ బాలకృష్ణ, పంచాయతీ సెక్రటరీ జయపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓల హనరోరియం వెంటనే చెల్లించాలి

- ఈఆర్ఓకు సీఐటీయూ వినతి

నవతెలంగాణ-ఇల్లందు

ఎన్నికల నేపథ్యంలో అంగన్వాడీ టీచర్లను బీఎల్ఓ డ్యూటీ చేయాలని ఎలక్షన్ కమిషన్ నియమించి వాళ్లకి ఇవ్వవలసి హానరోరియం ఆరు నెలల నుండి ఇవ్వకుండా పనులు చేయిస్తున్నారు. ఈ విషయమై నియోజక వర్గ ఎన్నికల అధికారి కాశయ్యకు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, ఈసం వెంకాయమ్మలు మాట్లాడారు.

కొత్త ఓట్ల చేర్పింపులు, తొలగింపులు మరణించిన వారి ఓట్లు తొలగించడం పోలింగ్ బూతుల పర్యవేక్షణ తదితర పనులను బీఎల్ఓ పేరుతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని పిల్లలకు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని ఇవ్వవలసిన అంగన్వాడీలతో ఎన్నికల పనులు చేయిస్తూ వారికి కనీసం టీఏడీఏలు కూడ ఇవ్వడం లేదు, ఎన్నికల రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల డ్యూటీ చేయించుకొని కనీసం మంచి నీళ్ళు కూడ ఇవ్వరని వాపోయారు. వాళ్ళకి ఇవ్వవలసిన హానరోరియాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మరియా, ఫాతిమా, సక్కుబాయి, శారద, నవమని, సమత, లక్ష్మీ భ్రమరంభ, పద్మ, వరలక్ష్మి, కళావతి, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | అక్టోబర్ 20, 2023 | www.navatelangana.com

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

నడిమిగూడెం గ్రామంలో ఓ రైతు అనుమానాస్పద పరిస్థితుల్లో మృత్యువాత పడిన ఘటన ఆళ్ళపల్లి మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నడిమిగూడెం గ్రామానికి చెందిన కొమరం కాంతారావు (46) మంగళవారం రాత్రి తన మిర్చి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి చేనుకు నీరు సరిపోక కొద్ది సేపటికి చేనుకు మళ్ళీ నీరు వదదామని అక్కడే పడుకున్నాడు. నీరు పట్టి బుధవారం వేకువజామున కాంతారావు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో భార్య విజయతో తనకు కళ్లుతిరగడం, నాలుక మందంగా ఉందని చెప్పడంతో, పాము కాటేసిందేమోనని అనుమానంతో కుటుంబ సభ్యులు ఆటోలో కొత్తగూడెం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు కాంతారావును పరీక్షించి మృతి చెందినట్లు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాంతో భార్య విజయ, కూతుళ్ళు కావేరి, అపర్ణ, సమీప బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాంతారావు ఒంటిపై విష సర్పం కాటేసిన గుర్తులు మాత్రం ఎక్కడా లేవని గురువారం కుటుంబ సభ్యులు తెలిపారు. దాంతో కాంతారావు మృతికి అసలు కారణం తెలియరాలేదు.

ఇసుక లారీలను అడ్డుకున్న మహిళలు



నవతెలంగాణ-మణుగూరు

మితిమీరిన వేగంతో ఇసుక లారీల వలన ప్రమాదం పొంచి ఉన్నదని గురువారం మహిళలు అడ్డుకున్నారు. 220 కెవి సబ్ స్టేషన్ రోడ్డుపై స్థానిక మహిళలు బైఠాయించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాయి గూడెం ఇసుక ర్యాంపు నుండి గోదావరి ఇసుకను రాత్రనకా పగలనకా ఇసుకను రవాణా చేస్తున్నారు. రోడ్డుపై విపరీతమైన దుమ్ము దూళి వస్తున్నదని దానివలన విపరీతమైన కాలుష్యం ఏర్పడుతున్నదని అన్నారు. గృహాలలోకి దుమ్ము చేరుతుందన్నారు. బతకలేకపోతున్నామని అన్నారు. లారీలు మితిమీరిన వేగంతో దూసుకు వస్తున్నాయని మహిళలు ఆరోపించారు. ఇసుక ర్యాంపు తోలకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మహిళలు రోడ్డుపై బైఠాయించి రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఒంటరిగానైనా పోటీ చేస్తాం

- నీతి, నిజాయితీ గల సీపీఐ(ఎం)ను గెలిపించండి
- రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా



నవతెలంగాణ-చర్ల

భద్రాచలం నియోజకవర్గంలో సీపీఐ(ఎం) ఒంటరిగానైనా పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం బీఎస్ రామయ్య భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయని, చర్చలు తేలకపోతే ఒంటరిగానైనా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అవకాశవాద రాజకీయాలు చేసే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ ఆధ్వర్యంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి పట్టాలు సాధించామని, పేదవాడికి సాగు భూమి, ఇంటి స్థలం సాధించి పెట్టింది సీపీఐ(ఎం) అన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, కుంజ బొజ్జిలు నిర్వహించారన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు, విద్యుత్ సరఫరా కోసం, లిఫ్టుల కోసం పార్టీ అనేక పోరాటాలు చేసిందన్నారు. 2016 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ ఇవ్వాలని పోరాడిన ఫలితంగా కోట్ల రూపాయలు సాధించామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ధరలు విపరీతంగా పెంచి పేదలను దోచుకుంటున్నారని విమర్శించారు. దోపిడీ దొంగలకు ఓట్లు వేయవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి కారం నరేష్, జిల్లా నాయకులు తాళ్లూరి క్రిష్ణ, సత్రపల్లి సాంబశివరావు, కొమరం కాంతారావు, మండల కమిటీ సభ్యులు మచ్చ రామారావు, పొడుపుగంటి సమ్మక్క, బందెల చంటి, తాటి నాగమణి, పామర్ బాలాజీ, శ్యామల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బొజాయిగూడెంలో సీఎం బహిరంగ సభ

- పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గంలో నవంబర్ 1న జరుగు ముఖ్యమంత్రి బహిరంగ సభకు గురువారం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియలు మండలంలోని బొజాయిగూడెం, లలితాపురం సమీపంలోని గ్రౌండ్లను పరిశీలించారు. బొజ్జాయిగూడెంలో సభకు అనుకూలంగా ఉన్నట్లు సభ అక్కడ నిర్వహిస్తే బాగుంటుందని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ అధ్యక్షులు రంగనాథ్, మండల అధ్యక్షులు శీలం రమేష్, వైస్ ఎంపీపీ ప్రమోద్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

లారీ, ద్విచక్ర వాహనం ఎదురు ఎదురుగా ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడుకి తీవ్ర గాయాలు అయి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మర్లపాడు గ్రామానికి చెందిన బాల్ద వెంకటేశ్వరావు (55) రాజపురం గ్రామంలో బంధువులు అయిన మామయ్య వాళ్ళ ఇంటికి వెళుతున్న నేపథ్యంలో నామవరం ప్రభుత్వ పాఠాశాల దగ్గర జరిగిన ప్రమాదంలో వెంకటేశ్వరావు తలకు తీవ్ర గాయం అయ్యింది. సమాచారం తెలుసుకున్న బంధువులు నామవరం చేరుకొని 108కి సమాచారం ఇవ్వగా సత్తుపల్లి ప్రభుత్వ హాస్పుటల్‌కి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం హాస్పటల్‌కి తరలించి చికిత్స అందిస్తున్న నేపథ్యంలో మృతి చెందాడాని మృతుడుకి భార్య, కుమారు వున్నారని తెలియజేశారు.



గడల శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు

నవతెలంగాణ-కొత్తగూడెం

మా విజయానికి కొత్తగూడెంలోని డాక్టర్ జీ.ఎస్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు తోడ్పాటు, ప్రోత్సాహకం, సేవలు ఎంతో ఉన్నాయని, మా విజయం పట్ల వారికి, ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామని పలువురు ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తెలిపారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో చదువుతున్న (పాఠక) నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గ్రంథాలయంలో పోలీస్, బ్యాంకింగ్, డిఎస్సీ, గ్రూప్ 1, 2, 3, 4, స్టాఫ్ సెలక్షన్, రైల్వే, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు శ్రీనివాసరావు నిరుద్యోగులకు చేయూత నిచ్చారని, తన ట్రస్ట్ ద్వారా 5 నెలలు పాటు పూర్తి ఉచిత మధ్యాహ్నం భోజనం, ఉదయం, సాయంత్రం టీ, ఏర్పాటు, చదువుకోవటానకి స్టడీ మెటీయల్, సంవత్సర కాలం నుంచి పూర్తి ఉచిత వైఫై.ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారని తెలిపారు. ఈ వసతుల ఉపయోగించుకొని ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ నియామక పలితాలలో ముగ్గురు ఎస్ఐలుగా, 15 మంది సివిల్ కానిస్టేబుల్, ఏఆర్.కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయినట్లు తెలిపారు. ట్రస్ట్ సేవలను పొందిన నిరుద్యోగ యువతి, యువకులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కో-ఆర్డినేటర్, మేనేజర్, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

తాటి ఆదినారాయణ కుటుంబానికి అండగా ఉంటాం

- రూ.73వేలు ఆర్థిక సాయం అందించిన యూఈఈయూ, సీఐటీయూ



నవతెలంగాణ-చర్ల

అక్టోబర్ 9వ తేదీన దుమ్ముగూడెం మండలంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మరణించిన దుమ్ముగూడెం సబ్ స్టేషన్ గ్రేడ్ 3 ఆర్టిజన్ కార్మికుడు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ టీఎస్ సీఐటీయూ కార్యకర్త తాటి కోటేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొలగాని రమేష్, బొల్లి వెంకటరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి పేర్కొన్నారు. తాటి కోటేశ్వరరావు మరణం తీవ్ర బాధాకరమని, మంచి కార్యకర్తను కోల్పోయామని, ఆ కుటుంబానికి కోటేశ్వరరావు మరణం తీరని లోటని నాయకుల పేర్కొన్నారు. కోటేశ్వరరావు కుటుంబానికి యూనియన్ వైపు నుంచి అండగా ఉంటామని పేర్కొన్నారు. కోటేశ్వరరావు మరణించిన సందర్భంలో ప్రభుత్వం నుంచి సహాయం అందించడం కోసం సీపీఐ(ఎం) నాయకులు దుమ్ముగూడెంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం నిర్వహించారని వారి పోరాటం వల్ల కోటేశ్వరరావు కుటుంబానికి న్యాయం చేయటానికి అధికారులు ముందుకు వచ్చారని రూ.7 లక్షల ఆర్థిక ప్యాకేజీ భార్యకు ఉద్యోగం చట్టబద్ధమైన బెనిఫిట్స్ మొత్తం కూడా అందించేందుకు ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. కోటేశ్వరరావు దశదినకర్మ సందర్భంగా రాళ్ల గూడెం గ్రామంలో సంతాప సభను ఏర్పాటు చేసి నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు కుటుంబానికి అండగా ఉండేందుకు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో తోటి కార్మికుల నుంచి అందించిన రూ.73 వేల ఆర్థిక సహాయాన్ని కోటేశ్వరరావు భార్యకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు చేతులు మీదుగా తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు బొల్లి వెంకటరాజు, కొలగాని రమేష్, కూను రాజు, శ్రీనివాస్, పదిలం శ్రీను, అనిల్, సీఐటీయూ జిల్లా కోశాధికారి, జి.పద్మ, మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, సీపీఐ(ఎం) మండల సెక్రెటరీ కారం నరేష్, కేశవాపురం సర్పంచ్ నరేందర్, తదితరుల నాయక్ చేతులు మీదుగా చెక్కును తాటి కోటేశ్వరరావు భార్యకు అందజేశారు. ఇదే కార్యక్రమంలో కోటేశ్వరావు మిత్రులు రాళ్ల గూడెం గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు ప్రతి ఒక్కరూ రూ.10 వేల చొప్పున మరొక రూ.70వేల చెక్కు రూపంలో అందజేశారు. కోటేశ్వరరావు భార్యకు ఉద్యోగం వచ్చే విధంగా అన్ని రకాల సహాయ సహకారాలు సీఐటీయూ యూనియన్ వైపు నుంచి అందిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు కోటేశ్వరరావు చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 327 యూనియన్ నాయకులు రామకృష్ణ, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, సీపీఐ(ఎం) నాయకులు శ్యామల వెంకటేశ్వర్లు, బందెల చంటి, తాటి నాగమణి, సత్రం పల్లి సాంబశివరావు, తాళ్లూరి కృష్ణ, కొమరం కాంతారావు, సీఐటీయూ నాయకురాలు శ్యామల, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అలంకారంలో గణేష్ పాడు శ్రీ విజయ దుర్గా అమ్మవారు



నవతెలంగాణ-దమ్మపేట

మహాలక్ష్మి స్వరూపమైన ఆ దుర్గమ్మ తల్లి భక్తులందరికీ అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని ఆ తల్లిని వేడుకున్నట్లు ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతలు దిశ కమిటీ సభ్యులు గారపాటి సూర్యనారాయణ అనురాధ దంపతులు తెలిపారు. భవానీ మలదారులకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పురోహితులు సింహాద్రి నాగేశ్వరరావు, కేతిముక్కల పవన్ శర్మ, తేజ మారుతిల ఆధ్వర్యంలో మహాలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు.

పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక

- గెలుపు ఖాయం : కోరం

నవతెలంగాణ-ఇల్లదు

పట్టణంలో గల జెడ్పీ చైర్మెన్ క్యాంపు కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ బదావత్ సరోజాతోపాటుగా బీఆర్ఎస్ యువజన సంఘం నాయకులు గోపగాని రాజు మరో పది కుటుంబాలు జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య వారిని పార్టీలోకి ఆహ్వానిస్తూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కోసం పూర్తి స్థాయిలో తమసహాయ, సహకారాలు అందజేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో గోపగాని రాజు, కొండపల్లి సావిత్రి, కొండపల్లి మహేష్, దారా వెంకన్న, ఐతా సత్యం, సుమన్, కృష్ణ, కాలుద్దిన్ పాసి, మూఫిద్, శివ తదితరులు ఉన్నారు.

పండుగ అడ్వాన్స్ వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కార్మికులకు లాభాల వాట 32 శాతం వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరిస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏరియా సెక్రెటరీ వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం కే.సి.హెచ్.పి నందు ఫిట్ మీటింగ్‌లో మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ పేరు చెప్పి కార్మికులకు చెల్లించాల్సిన డబ్బులు నిలిపివేయడం వలన సింగరేణి కార్మికులకు తీవ్ర నిరాశ పడ్డారని అన్నారు. దీనికి నిరసనగా ఏఐటీయూసీ 20వ తేదీ శుక్రవారం నిరాహార దీక్ష, అక్టోబర్ 21వ తేదీన ఒకరోజు సింగరేణి టోకెన్ సమ్మె చేయాలని పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల రామ నరసయ్య మేకల ఈశ్వర్, ఆవుల నాగరాజు, గుంపెన శ్రీనివాసరావు, ఉడత శివ వెంకటేశ్వర్లు, ఆర్కే ప్రతాప్, కామా కృష్ణమూర్తి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- సీపీఐ (ఎం) సీనియర్ నేత యలమంచి రవికుమార్



నవతెలంగాణ-దుమ్ముగూడెం

10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని సీపీఐ (ఎం) పార్టీ సీనియర్ నేత మాజీ డీసీసీబీ చైర్మెన్ యలమంచి రవికుమార్ అన్నారు. గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండల కమిటీ సభ్యులు షేక్ అహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన దుమ్ముగూడెం గ్రామంలో జరిగింది. యలమంచి రవికుమార్, పార్టీ నియోజకవర్గ కో- కన్వీనర్ కారం పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి రెండుసార్లు అవకాశం కల్పించినప్పటికీ భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధి చేసింది లేదని అన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సీపీఐ(ఎం)ని గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. నియోజవర్గం అభివృద్ధి చేసింది సీపీఐ (ఎం) పార్టీ మాత్రమేనని అన్నారు. ఆనాటి ఎమ్మెల్యేలు ముర్ల ఎర్రయరెడ్డి, కుంజా బొజ్జి, సున్నం రాజయ్య నిరంతరం ప్రజా సమస్యలు తెలుసుకొని అనేక అభివృద్ధి పనులు చేశారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మరో కొత్త పాలసీల పేరుతో మళ్లీ ఓటర్లను కొనుక్కోవాలని చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దళితులకు మూడెకరాల భూమి, భూమిలేని గిరిజనులకు మూడు ఎకరాలు ఇస్తానన్న హామీ నెరవేర్చలేదని వారన్నారు. దళిత బంధు, బీసీలకు లోన్లు, గృహలక్ష్మి ఇండ్లు ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఈసారి గద్దె దింపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి శ్రీనుబాబు, సర్పంచ్ మడి రాజేష్, సారిపల్లి త్రినాధరావు చుక్క గణేష్ రెడ్డి, బైరెడ్డి సతీష్, ముసలి రాంబాబు, వేణు, దల్లి సతీష్, బాబురావు, కర్రీ బుజ్జి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు వైఎస్ఆర్‌టీపీ అభ్యర్థినిగా పోటీ

- విలేకర్ల సమావేశంలో బానోత్ సుజాత



నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు నియోజవర్గం నుండి అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌టీపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్నట్టు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, ఇల్లందు నియోజవర్గ కోఆర్డినేటర్ బానోత్ సుజాత మంగిలాల్ ప్రకటించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్‌టీపీ 119 అసెంబ్లీ స్థానాలలో పోటీ చేస్తున్నామని ఇల్లందు బరిలో తను ఉంటున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని లలితాపురం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తుల సర్దుబాటు విజయవంతం కాలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమే లక్ష్యంగా రాష్ట్రంలో పోటీ చేయాలని వైఎస్ఆర్‌టీపీ అధినేత షర్మిళ ప్రకటించారని అన్నారు. ఇల్లందును ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసమే కృషి చేస్తానన్నారు. గత 9 ఏండ్ల కేసిఆర్ పానలలో నిరుద్యోగులు అష్టకష్టాలు పడ్డారని అన్నారు. ఎన్నికల హామిగానే నోటిఫికేషన్లు ఉన్నాయన్నారు. దేశంలోనే తొలిసారిగా ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్ఆర్‌దే అన్నారు. ఈ సమావేశంలో ఇల్లందు, కామేపల్లి, టేకులపల్లి, గార్ల, బయ్యారం మండలాల అధ్యక్షులు మేకల రాజేష్, వీరనాయుడు, సత్తిరెడ్డి, బాలాజి నాయక్, నరేష్ నాయక్, బాను, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధన కోసం అంతిమ పోరాటానికి సిద్ధమవుదాం

- జిల్లా ఇన్చార్జి ఏపూరి

నవతెలంగాణ-జూలూరుపాడు

ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడానికి మాదిగ మాదిగ ఉపకులాలు అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని జిల్లా ఇన్చార్జి ఏపూరి వెంకటేశ్వరావు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వర్గీకరణ జరగకపోవడం రాజకీయ పార్టీల వైఫల్యమేనని గుర్తు చేశారు. ఈ సమావేశంలోనే జూలూరుపాడు మండల నూతన కమిటీని ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడుగా మంద సురేష్ మాదిగ, మండల ఉపాధ్యక్షుడిగా పాపకొల్లు గ్రామానికి చెందిన గార్లపాటి గోపాల్ మాదిగ, మండల అధికార ప్రతినిధిగా ఇడుపుల సాంబ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శులుగా కాకర్ల గ్రామానికి చెందిన మిరియాల కిరణ్ కుమార్, వెంకన్నపాలెం గ్రామానికి చెందిన నల్లగట్ల, రాము మాదిగ, సహాయ కార్యదర్శిగా ఉబ్బపల్లి రాము మాదిగలు ఎన్నిక అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పోతురాజు నాగరాజు మాదిగ, కోట కుమార్ మాదిగ, ఉద్యమ తొలితరం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

లోటు పాట్లు లేకుండా వేడుకలు నిర్వహించాలి

నవతెలంగాణ-మణుగూరు

బతుకమ్మ సంబరాల వేడుకల ఏర్పాట్లను లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. గురువారం మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ సంబంధిత అధికారులతో కలిసి పివి కాలనీ భద్రాద్రి స్టేడియంలో అక్టోబర్ 22వ తేదీన జరుగనున్న బతుకమ్మ, ఫ్యామిలీ, సంబరాల ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయా విభాగాల అధికారులతో మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించబడునున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు సింగరణీయులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో రావటం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు.

కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం జరుగకుండా చూడాలన్నారు. ఈ వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం వీసం కృష్ణయ్య, ఏజిఎం (సివిల్) వెంకటేశ్వర్లు, ఏజిఎం(ఈ అండ్ఎం) నర్సిరెడ్డి, డీజీఎం (పర్సనల్) పై ఎస్.రమేశ్, డా.శేషగిరి రావు, సీనియర్ పర్సనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సతీష్ పై ఫోక్సో కేసు నమోదు చేయాలి

- పోలీసులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్



నవతెలంగాణ-భద్రాచలం

బాలికను ట్రాప్ చేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు సతీష్ పై ఫోక్సో కేసు నమోదు చేయాలి, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా పోలీసులు బాధిత కుటుంబానికి న్యాయం చేసి, నిందితుడని కఠినంగా శిక్షించాలని, బీఆర్ఎస్ మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, ఎంపీలతో దగ్గరగా ఉండే వ్యక్తి ఈ సెటిల్మెంట్ సతీష్ పార్టీల్లో పదవులు లేవు, పార్టీకి సంబంధం లేదని మండల అధ్యక్షుడు అంటే సరిపోదు పార్టీ నుండి సస్పెండ్ చేయాలని టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ యువనాయకుడు సెటిల్మెంట్ సత్తి తన ఇంటి ముందు ఉన్న మైనర్‌కు మాయమాటలు చెప్పి పట్టణంలోని ఒక ప్రైవేటు లాడ్జికి తీసుకువెళ్లడం జరిగిందని, ఆ అమ్మాయిని సతీష్ తీసుకెళ్లడం చూసిన కొందరు వ్యక్తులు వారి తల్లికి సమాచారం ఇవ్వగా, ఆమె ఆ లాడ్జి వద్దకు చేరుకొని డయల్ 100 ద్వారా పోలీస్ వారికి సమాచారం ఇచ్చి తలుపులు తెరిపించి బీఆర్ఎస్ యువ నాయకుడు సెటిల్మెంట్ సత్తికి చెప్పుతో దేహశుద్ధి చేసినట్టు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగంలో యాక్టివ్‌గా ఉంటూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, రాష్ట్రరవాణా శాఖ మంత్రి, ప్రభుత్వ విప్, ఎంపీ, భద్రాచల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకటరావుతో అత్యంత సాన్నిహిత్యంగా పార్టీలో మెసలే వ్యక్తి అయిన సెటిల్మెంట్ సత్తికి బీఆర్ఎస్ పార్టీలో పదవి లేదని, ఈ రోజు నుంచి పార్టీకి అతనికి సంబంధం లేదని బీఆర్ఎస్ పార్టీ చేతులు దులుపుకోవడం చాలా దారుణమైన విషయమన్నారు. గతంలో అతనిపై ఉన్న కేసులను పరిశీలించి రౌడీ షీటర్ కూడా ఓపెన్ చేయాలని ఆయన పోలీసులను కోరారు. బాలికపై జరిగిన అఘాయిత్యాన్ని ఖండించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చింతిరేల సుధీర్, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాస మల్ల రాము, పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షులు సూరంపూడి రాంప్రసాద్, యూత్ కాంగ్రెస్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్కాంల పేరుతో కోట్లు దోచేసిన కాంగ్రెస్

- ఎమ్మెల్సీ తాతా మధు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దీర్ఘకాలికంగా దేశంలో అధికారంలో ఉండి కోట్ల రూపాయలు వివిధ రకాల స్కాంలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీకు నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే బీఆర్ఎస్ పార్టీని విమర్శించే హక్కు లేదని, ఎమ్మెల్సీ, భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ తాతా మధు అన్నారు. గురువారం మహదేవపురం గ్రామంలో జరిగిన ఆ పార్టీ సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. నిన్న కాక మొన్న ములుగు జిల్లాకు వచ్చిన రాహుల్ గాంధీ బీఆర్ఎస్ కుటుంబ పాలన అంటూ విమర్శిస్తున్నారని, వారిది మరి ఏ పాలనో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపదంలో నడిపించి ప్రపంచంలోనే దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టే స్థాయిలో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీ ఏజెన్సీలో కూడా గిరిజనుల అభివృద్ధి కోసం పాటు పడుతుందన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన స్క్రిప్టు మాత్రం చదివిన రాహుల్ గాంధీకి ఈ ప్రాంత సమస్యలు ఏం తెలుసని ప్రశ్నించారు. ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క తల్లి అనసూర్యకు పోడు భూములకు పట్టాలు బీఆర్ఎస్ పార్టీ అందించిందని గుర్తు చేశారు. 1982లో ఆదిలాబాద్ జిల్లాలో 300 మంది ఆదివాసీల మృతులకు కారణమైన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే వాక్కు లేదని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి డా.తెల్లం వెంకట్రావును గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి తెల్లం వెంకట్రావు, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అన్నె సత్యాలు, తాండ్ర నర్సింహారావు, గూడపాటి శ్రీను, అధికార ప్రతినిధి ఎండి జానీపాషా, కార్యదర్శి కణితి రాముడు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

- కొత్తగూడెం నియోజకవర్గంలో సీపీఐ గెలుపు ఖాయం
- జిల్లా కార్యదర్శి ఎసకె.సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం

సంక్షేమ పథకాలు అమలులో, నీళ్ళు, నిధులు, నియామకాల విషయంలో చతికలపడిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా బీఆర్ఎస్‌కు విడ్కోలు పలకాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. విద్యానగర్ కాలనీలో గురువారం జరిగిన చుంచుపల్లి మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల సంక్షేమంకోసం కాకుండా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు, చోటామోటా నాయకులకు డబ్బులు సమకూర్చే పథకాలుగా మారాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులైన ఏ పేదల దరిచేరలేదన్నారు. నియోజకవర్గంలో ప్రజలు సిపిఐ పక్షాన ఉన్నారని, ఏ శక్తి సిపిఐ గెలుపును అడ్డుకోలేదని స్పష్టం చేశారు. జి.వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శి వాసిరెడ్డి, మురళి, జిల్లా సమితి సభ్యులు వట్టికొండ మల్లికార్జున్ రావు, వంగా వెంకట్, బానోతు గోవిందు, పోలమూరి శ్రీనివాస్, నాయకులు రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు కొండూరు సుధాకర్

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో ఎక్కిరాల జమలయ్య, అరుణ దంపతుల కుమారుడు చలపతి, సదా వివాహం గురువారం నిర్వహించారు. వివాహ వేడుకలో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండూరు సుధాకర్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఐలూరి వెంకట కోటారెడ్డి, గంటల వెంకటాచారి, ఐలూరి చిన్న శ్రీనివాస్ రెడ్డి, ఐలూరి రాజశేఖర్ రెడ్డి, గుర్రాల గోపాలకృష్ణారెడ్డి కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారి దర్శనం

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ కోట మైసమ్మ తల్లి ఆలయం వద్ద శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం 5వ రోజు అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అన్నదానాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి తుమ్మల

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని శ్రీ వాసవి మహిళా ఉత్సవ కమిటీ డాబాల బజార్ వారి ఆధ్వర్యంలో శ్రీ దేవి నవరాత్రుల 6వ వార్షికోత్సవం సందర్భంగా ఐదవ రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాఖంబారి అవతారంతో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రస్తుతం కార్పొరేటర్లు కమర్తపు మురళి, కొప్పెర ఉపేందర్ సరిత, మాజీ కార్పొరేటర్ బాలగంగాధర్ తిలక్, కమిటీ సభ్యులు గీత పాల్గొన్నారు.

శ్రీ మహా చండీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం

- సామూహిక కుంకుమార్చన

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహా దివ్య క్షే త్ర మైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వా మి వారి దేవస్థానం నందు 5వ రోజు అమ్మ వారు శ్రీ మహా చండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10.00 గోపూజ, మహా చండీ దేవికి ప్రత్యేక పూజా కార్యక్రమములు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు శ్రీ అలివేలు మంగమ్మ అమ్మ వారి ఆలయం వద్ద సామూహిక కుం కుమార్చన కార్యక్రమం లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సహిత లలితా సహస్రనామ పా రాయణ కార్యక్రమము నిర్వహించారు.మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్య క్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజ య దేవశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్ శర్మ అర్చకులు రాజీవ్ శర్మ, వేద పండితులు, ఆలయ పర్య వేక్షకులు విజయ కుమారి, అర్చకులు, సిబ్బంది, గ్రామ స్తులు భక్తులు పాల్గొన్నారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పార్టీ ఇందుకోసం అగ్రనేతలందరూ కలిసికట్టుగా గురువారం లక్ష్మీదేవి పల్లి మండలం ఎదురుగడ్డ గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు మాట్లాడుతూ మహిళలకు ప్రతీ నెల రూ.2,500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్, రైతులకు ఏటా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, పంటకు రూ.500 బోనస్, ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇళ్ల లేనివారికి ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షల సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇస్తామని వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, పెదబాబు, ఆకునూరి కనకరాజు, మండల అధ్యక్షులు సకినాల వెంకన్న, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెక్రటరీ గౌస్ భాయ్, మైనార్టీ అధ్యక్షులు అయూబ్ ఖాన్, జీడి మహేష్, నరసింహారావు, నాగభూషణం పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సానుభూతిపరులు దొబ్బల వెంకట నరసమ్మ మృతి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం రెబ్బవరం గ్రామం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ దొబ్బల వెంకటేశ్వరరావు సతీమణి పార్టీ సానుభూతిపరులు దొబ్బల వెంకట నరసమ్మ(71) గురువారం అనారోగ్యంతో మరణించారు. అమరజీవి దొబ్బల వెంకటేశ్వరరావు రెబ్బవరం గ్రామంలో సిపిఐ(ఎం) పార్టీకి కొండంత అండగా ఉండేవారు. పార్టీ అభివృద్ధికి జీవితకాలం పాటుపడినారు. దొబ్బల వెంకట నరసమ్మ కూడా భర్తకు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి తోడ్పాటును అందించేవారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మరణ వార్త తెలియగానే సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తూము సుధాకర్, బాజోజు రమణ, మండల కమిటీ సభ్యులు హరి వెంకటయ్య దొబ్బల వెంకట నరసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరితో పాటు పార్టీ సభ్యులు తాళ్లూరి నాగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, దొబ్బల నాగయ్య, దొబ్బల వీరయ్య, సామినేని బాబు, కొత్తా రోహిణి, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు నివాళు లర్పించారు.

నగదుతో అమ్మవారికి అలంకరణ

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో వల్లభి కోదండరామస్వామి ఆలయంలో దసరా పండుగను పురస్కరించుకొని దేవీ నవరాత్రుల సందర్భంగా సీతా లక్ష్మణ్ ఆంజనేయ సమేత ధనలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారికి గురువారం నగదు అలంకరించి గ్రామసర్పంచ్ పోట్ల కృష్ణకుమారి ప్రసాద్ దంపతులు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు.

కృష్ణమాచార్యులకు అశ్రునివాళులు అర్పించిన డా.కోట

నవతెలంగాణ-మధిర

మధిర మండలం మాటూరు గ్రామంలో డా. కృష్ణమాచార్యులు 3వ వర్ధంతి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోట రాంబాబు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి సత్యనారాయణ రాజు, వైస్ సర్పంచ్ కాశీ కోటేశ్వరరావు, తేళ్ల రాములు, కొట్టే శ్రీరామయ్య, మాబు, పుట్టా అబ్రహం, మోదుగు జోసెఫ్ పాల్గొన్నారు.

మోటాపురంలో కరెంటు దొంగల హల్ చల్

అప్రమత్తమైన రైతులు, కారు వదిలి పరారైన దుండగులు

నేలకొండపల్లి : మండలంలోని మోటాపురం గ్రామంలో కరెంటు దొంగలు బుధవారం రాత్రి హల్చల్ చేశారు. గ్రామంలోని లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ లోని రాగి వైర్‌ను దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండగా పసిగట్టిన గ్రామ రైతులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు తీసుకొచ్చిన కారును వదిలి పరారయ్యారు. రాగి వైర్ ను దొంగిలించేందుకు దుండగులు తీసుకొచ్చిన టీఎస్07జీజే423 నెంబరు గల కారు, సెల్ ఫోన్ తో పటు వారు వెంట తెచ్చుకున్న సావమగిని గ్రామ రైతులు స్వాధీనం చేసుకుని పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కూసుమంచి సీఐ జితేందర్ రెడ్డి, స్థానిక ఎస్సై సతీష్ గురువారం ఉదయం మోటాపురం చేరుకొని జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూసుమంచి సీఐ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటువంటి వ్యక్తులు తారసపడినప్పుడు తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాత్రివేళ గ్రామాలలో గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఠాపురం, మల్లేపల్లి, రాజేశ్వరపురం రైతులు, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు ఇంటూరి అశోక్, తాళ్లూరి రవి, ఎలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రాజకీయంలో వలసల సల.. సల

- బుచ్చయ్య కి తుమ్మల అభయ "హస్తం"
- ప్రజా పోరాటాలని నమ్ముకున్న సీపీఐ(ఎం)

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో భద్రాచలం రాజకీయాలు వలసలతో సలసల లాడుతున్నాయని చెప్పాలి. ఇప్పటికే తాంద్ర రమణ బొలిశెట్టి రంగారావు, ఉడత రమేష్ వంటి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హస్తానికి చేయించి కారు ఎక్కిన సంగతి తెలిసిందే. కారు పార్టీ ఇచ్చిన షాక్‌కి ప్రతి షాక్ ఇచ్చేందుకు హస్తం పార్టీ పెద్దలు కూడా సిద్ధం అయ్యారని తెలుస్తుంది. భద్రాచల నియోజవర్గంలో బలమైన రాజకీయ పునాది ఉన్న బాలసాని లక్ష్మీనారాయణ కారుకి బాయ్ చెప్పి ఇటీవల హస్తం గూటికి చేరిన నేపథ్యంలో ఆ ప్రభావంతో భద్రాచల నియోజకవర్గంలో భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు ఉంటాయని స్పష్టమవుతుంది. చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బోధనైన బుచ్చయ్య భద్రాచలం బీఆర్ఎస్ టిక్కెట్ ఆశించి బంగపడ్డ నేపథ్యంలో ఆయనకి తుమ్మల నాగేశ్వరరావు అభయ హస్తం ఇచ్చినట్టు వినికిడి. రానున్న రోజుల్లో బోధబోయిన బుచ్చయ్య తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని జోరుగా వినపడుతుంది.

ఇదిలా ఉండగా 2014లో టీఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన మరో సీనియర్ నేత మానె రామకృష్ణ సైతం టికెట్ ఆశించి బంగపడి తన రాజకీయ భవిష్యత్తు కోసం కమలం పార్టీ వైపు చూస్తున్నారని చర్చ జరుగుతోంది. బిజెపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కుంజ సత్యవతి హఠస్మరణంతో మానె రామకృష్ణకు లైన్ క్లియర్ అయినట్టేనని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఈ నేపథ్యంలో ఏ క్షణమైనా కమలం గూటికి మానే రామకృష్ణ వెళ్తారని తెలుస్తుంది. మొదటి నుండి బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఈ ఇద్దరి నాయకుల ప్రభావంతో కారు పార్టీకి భారీ డ్యామేజ్ తప్పదని స్పష్టమవుతుంది. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలలో ఒక పార్టీ నుండి మరొక పార్టీకి వలసలతో ఏ నాయకుడు ఏ రోజే పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రజా పోరాటాలని నమ్ముకున్న : సిపిఐ(ఎం)



సుదీర్ఘకాలం పాటు భద్రాచలం ఏజెన్సీలో ఎమ్మెల్యేగా గెలుపొందిన సిపిఐ(ఎం) గతంలోనే కాదు ప్రస్తుత రాజకీయాలలో కూడా నాయకులను వలసలను ఏమాత్రం నమ్ముకోవడం లేదు. మొదట నుండి ప్రజా పోరాటాలపై ఆధారపడ్డ ఆ పార్టీ ఇప్పుడు కూడా గతంలో తాము ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు భద్రాచల నియోజకవర్గాన్ని చేసిన అభివృద్ధి అందించిన నిస్వార్థ నిజాయితీ పాలనను ప్రజలకు వివరిస్తూ ప్రజా పోరాటాలనే నమ్ముకొని ఎన్నికల బరిలోకి దిగుతున్నట్టుగా కనిపిస్తుంది. వాజేడు నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి పోరాటాల రూపొందిస్తూ చేసిన పోరాటాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసి రానున్న ఎన్నికలలో ప్రజా మద్దతుతో గెలవాలని ఆ పార్టీ వ్యూహం రచిస్తున్నట్టు స్పష్టమవుతుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో స్వార్థాల కోసం జెండాలు మార్చే వ్యక్తులను చూస్తారో ప్రజల కోసం పోరాటాలు చేసే ఉద్యమ పార్టీని ప్రజలు చూస్తారో వేచి చూడాలి.

కార్మికుల మేనిఫెస్టోను అమలు చేయాలి

- రాజకీయ పార్టీలకు సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-చర్ల



రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి అధికారంలోకి రావాలనుకునే బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీలు కార్మికుల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చి అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్ డిమాండ్ చేశారు. సిఐటియు చర్ల మండల జనరల్ బాడీ సమావేశం సిఐటియు మండల నాయకులు శ్యామల వెంకట్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏజే రమేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు మేనిఫెస్టోలో ప్రకటించిన బిఆర్ఎస్ ఆరు గ్యారెంటీ కార్డులను ప్రకటించిన కాంగ్రెస్ కార్మికుల యొక్క సమస్యలను మేనిఫెస్టోలో ప్రకటించలేదని పేర్కొన్నారు. అందుకనే సిఐటియు రాష్ట్ర కమిటీ కార్మికుల మేనిఫెస్టోను విడుదల చేసిందని ఈ మ్యానుఫెస్టోలోని విషయాలు అమలు కోసం రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని 73 రకాల షెడ్యూల్డ్ పరిశ్రమలు కనీస వేతనాలు జీవోలను సవరించి కొత్త జీవోలు ఇవ్వాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని రాష్ట్రంలోని కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని 7 గంటల పని దినాన్ని వారానికి ఐదు రోజుల పని పద్ధతిని అమలు చేసే విషయాన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి అధికారంలోకి రాగానే వాటిని మొదటి ప్రాధాన్యతలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని రంగాల్లోని కార్మికులకు స్కీం వర్కర్లకు ప్రతినెల 1వ తేదీనే వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని ఐకెపి వివోఏలు అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు మిషన్ భగీరథ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ స్పష్టమైన పరిష్కారాలను ప్రకటించాలని, ఎన్నికల నాడు కార్మికుల కోసం మాటలు చెబుతున్నారు తప్ప మానిఫెస్టోలో కార్మికుల డిమాండ్లు ప్రతిబింబించడం లేదని ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కార్మికుల సమస్యలను పరిష్కారం చేయటం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 12 విభాగాలుగా 100 రకాల కార్మికుల సమస్యలను కార్మికుల మేనిఫెస్టో గా సిఐటియు రూపొందించిందని ఈ మ్యానిఫెస్టోని అమలు చేయాలని రానున్న కాలంలో ప్రభుత్వాల మీద పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓట్లు అడగటానికి వస్తున్న పాలక పార్టీలన్నింటినీ కార్మికుల మేనిఫెస్టో అమలు కోసం అన్ని రంగాల కార్మికులు గ్రామీణ ప్రాంతాల్లో నెల తీయాలని సిఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో అనేక సమ్మెల్లో పాల్గొన్న కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో పోరాడి ప్రభుత్వం మెడలు వంచి కొన్ని పాక్షిక విజయాలను సాధించడం జరిగిందని ఆ విజయాలను సైతం అమలు చేయడం కోసం మరిన్ని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పోరాటాల ద్వారానే కార్మికుల డిమాండ్లు పరిష్కారం అవుతాయని పోరాటాలు బలంగా నిర్వహించడం కోసం సిఐటియును మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి, మండల కమిటీ కన్వీనర్ పాయం రాధాకుమారి, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం. విజయశీల, వివిధ రంగాల సిఐటియు మండల నాయకులు మీనా, అనురాధ, శ్యామల, సమ్మక్క, స్వరూప, కమల మనోహరి, సురేందర్ సిఐటియు నాయకులు కృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని జాస్తిపల్లి గ్రామంలోని గర్భిణీ, బాలింత మహిళలు అంగన్వాడీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి టీచర్ ఉమాదేవి అన్నారు. గురువారం తమ సెంటర్ పరిధిలోని గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పండ్లు పూలు పంపిణీ చేసి పౌష్టికాహారం గురించి వివరించారు.

మధిరలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు ప్రచారం

నవతెలంగాణ-మధిర

కారు గుర్తుకు ఓటు వేసి కేసిఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు అన్నారు. మధిర పట్టణంలో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటమి చెందినా మీ మధ్యనే ఉండి మధిర అభివృద్ధికి కృషి చేశానని, ఈ ఎన్నికలలో కారు గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

20 మందిపై బైండోవర్ కేసులు

నవతెలంగాణ-పెనుబల్లి

ఎక్సైజ్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం బెల్ట్ షాప్ నిర్వాహకులు, సమస్యాత్మక గుర్తింపు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ప్రతి గ్రామంలో 20కి పైగా బెల్ట్ షాపులు నిర్వాహకులపై బైండోవర్ కేసులు కేసులు నమోదు కాగా, సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ఆ గ్రామంలో క్రిమినల్ కేసులు, రౌడీ షీటర్లపై బైండోవర్ కేసులు నమోదు అయ్యాయి. గత కొన్ని రోజులుగా తాసిల్దార్ కార్యాలయానికి బైండోవర్ కేసులు తాకిడి పెరిగింది. ఇరు శాఖలు అధికారులు కేసు నమోదు చేసిన వ్యక్తులను తాసిల్దార్ ముందు ప్రవేశపెట్టి వారికి ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో వివాదాలు సృష్టించిన, మద్యం విక్రయించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

మధిరలో బాలయ్య అభిమానుల సందడి

నవతెలంగాణ-మధిర



నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమా విడుదల సందర్భంగా బాలయ్య అభిమానుల మధిర పట్టణంలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస సినిమా థియేటర్ వద్ద తాళ్లూరి హరీష్ బాబు, అరిగే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున టపాసులు కాల్చారు. జై బాలయ్య నినాదాలు ఇస్తూ సినిమా విజయోత్సవాన్ని జరుపుకున్నారు.



అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- కేసీఆర్ ముందు చూపు ఉన్న నాయకుడు
- ఈ ఎన్నికలలో హ్యాట్రిక్ విజయం ఖాయం
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

నవతెలంగాణ -బూర్గంపాడు



అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, సీఎం కేసీఆర్ ముందు చూపు ఉన్న నాయకుడని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బూర్గంపాడు మండ లం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ, నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో గురువారం కాంగ్రెస్ పార్టీ చెందిన సుమారు 200 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో రేగా కాంతారావు సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదించండని, గ్రామాలను మరింత అభివృద్ధి చేసి చూపెడతానని ఆయన అన్నారు. బిఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ సర్కార్ రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి ప్రత్యేక నిధులు పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. దేశానికి వెన్నుముక అయినా రైతులకు తెలంగాణ సర్కార్ ఎనలేని సేవలను అందిస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నదని ఆయన తెలిపారు. కార్యకర్తలు పార్టీ విజయానికి కష్టపడి పని చేయాలని ఆయన అన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి నాయకుడు కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. ఈ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించ డానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గోనెల నాని, పార్టీ సారపాక టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

12 రాష్ట్రాల కూలీలకు తెలంగాణ అన్నం పెడుతోంది..

- ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరరావు
- జెడ్పీటీసీ వెంకటరెడ్డికి పార్టీలోకి సాధరంగా ఆహ్వానం

నవతెలంగాణ-చంద్రుగొండ



తెలంగాణ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు పోరాటం చేస్తుంటే కనీసం మద్దతు తెలపకుండా రాహుల్‌గాంధీ మౌనంగా ఉండి, ఇప్పుడు ఎన్నికల సమయంలో రాష్ట్రానికి ఏ మొఖం పెట్టుకొని వచ్చాడని ఖమ్మం పార్లమెంటు సభ్యులు, బిఆర్ఎస్ లోక్ సభపక్షనేత నామా నాగేశ్వారావు ప్రశ్నించాడు. గురువారం సాయంత్రం చంద్రుగొండలో అశ్వారావుపేట శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధిరెడ్డితో కలిసి బిఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తొలుత చంద్రుగొండ జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొణకండ్ల వెంకటరెడ్డిని గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. తెలంగాణ రాక ముందు వలస వెళ్లి బ్రతికే వాళ్లమని, దాదాపుగా 25 లక్షల మంది తెలంగాణ బిడ్డలు వలస వెళ్లి జీవించే వారని, స్వరాష్ట్రం వచ్చిన తరువాత దేశంలోని 12 రాష్ట్రాల కూలీలకు అన్నం పెట్టే రాష్ట్రంగా తెలంగాణ మారిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారితో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మెచ్చ నాగేశ్వరరావును గెలిపించి, ముచ్చగా మూడోసారి కేసీఆర్ను చేయాలన్నారు. ఆ ఆలోచనలను సంక్షేమ పథకాలుగా తీర్చిదిద్దుతున్న నాయకుడు సిఎం కేసీఆర్ అనిరాజ్యసభసభ్యులు బండి పార్థసారధరెడ్డి అన్నారు. అనంతరం పార్టీలోకి వచ్చిన వారందరికీ గులాబీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, దారా వెంకటేశ్వరరావు (దారాబాబు), ఉప్పతల ఏడుకొండలు, నల్లమల్ల వెంకటేశ్వరరావు, పైడి వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు రసూల్ , భూపతి రమేష్, సూర వెంకటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, సత్తి నాగేశ్వరరావు, గాదె లింగయ్య, భూపతి ధనలక్ష్మి, లంకా విజయలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- ఇల్లెందులో 1న జరిగే సభను విజయవంతం చేయాలి
- ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామేపల్లి

ఇల్లందు నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని, మరోసారి నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే భానోతు హరిప్రియ, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల మండల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ నందు జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు నేరుగా అందించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. తెలంగాణ ప్రజలు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ను మూడోసారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అక్టోబర్ 1న ఇల్లందులో జరిగే బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని కోరారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రతి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పేర్కొన్నారు. కామేపల్లి మండలంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

ఆర్ఎంఎస్ఐని మరింత విస్తరిస్తాం



- ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోగలం
- నష్టాలను తగ్గించగల ప్రణాళికలు వేస్తాం
- ఆర్ఎంఎస్ఐ సస్టైనెబిలిటీ ఎస్వీపీ పుష్పేంద్ర వెల్లడి

హైదరాబాద్ : గ్లోబల్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ టెక్ దిగ్గజ సంస్థ ఆర్ఎంఎస్ఐ గ్రూపును మరింత విస్తరించనున్నట్లు ఆ సంస్థ సస్టెయినిబిలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పుష్పేంద్ర జోహరి తెలిపారు. నోయిడాలోని కార్యాలయాన్ని మరో అంతస్తును పెంచుతున్నామన్నారు. కొత్తగా 500 మంది ఉద్యోగులను తీసుకోనున్నామని చెప్పారు. హైదరాబాద్‌ని హైటెక్స్‌లో వాతావరణంలో మార్పులపై జరిగిన జియోస్మార్ట్ ఇండియా సమావేశానికి హాజరైన జోహరి మీడియాతో మాట్లాడారు. ఆర్ఎంఎస్ఐ విస్తరణ ప్రణాళికలు కొనసాగుతున్నాయన్నారు. ప్రధానంగా మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. తమ వ్యాపారాలను కొత్త కోణాల్లో తీసుకెళ్లడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందుకోసం టెలికం, లార్జ్ మ్యాపింగ్ కంపెనీలతో కలిసి పని చేయనున్నామన్నారు.

"ఆర్ఎంఎస్ఐ ప్రాథమికంగా ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలను అంచనా వేస్తుందన్నారు. నోయిడా కేంద్రంగా పని చేస్తోన్న మా సంస్థ హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో కార్యాలయాలను కలిగి ఉందన్నారు. ఆర్ఎంఎస్ఐలో ప్రపంచవ్యాప్తంగా 5వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 3వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. మరో వెయ్యి మంది నోయిడాలో ఉన్నారు. విదేశాల్లో వెయ్యికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. 40 దేశాలతో కలిసి పని చేస్తున్నాం. నోయిడా, హైదరాబాద్, డెహ్రాడూన్‌లో అభివృద్ధి కేంద్రాలను కలిగి ఉన్నాం. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, మిడిల్ ఈస్ట్, బహ్రేన్‌లో అనుబంధ సంస్థలతో జియోస్పాటికల్ రంగంలో రాణిస్తున్నాం" అని జోహరి తెలిపారు. ఆర్ఎంఎస్ఐ క్రాపాలిటిక్స్ సబ్సిడీసంస్థ వ్యవసాయ పరిష్కారాలను అందిస్తుందని జోహరి తెలిపారు. ఈ తరహా స్టార్టప్ సంస్థను ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి అని పేర్కొన్నారు.

లాట్ మొబైల్స్‌లో దసరా దమాకా ఆఫర్లు



హైదరాబాద్ : ప్రస్తుత పండగ సీజన్‌ను అందిపుచ్చుకోవడానికి స్మార్ట్ మొబైల్ ఫోన్ల రిటైల్ చెయిన్ లాట్ మొబైల్స్ భారీ ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చామని లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. వినియోగదారులు కొనుగోళ్లపై ఖచ్చితమైన బహుమతితో పాటు రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్‌ను పొందే వీలుందని పేర్కొన్నారు. ఎంపిక చేసిన మోడల్ మొబైల్స్, ఇతర వస్తువులను కొనుగోలు చేసే వారికి జీరో డౌన్ పేమెంట్‌తో కూడిన రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. 24 నెలల వ్యవధితో కూడిన నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని ఎంచుకోవచ్చన్నారు. అదే విధంగా రూ.999కే స్మార్ట్ వాచ్, సౌండ్ బార్ ఊఫర్‌తో కూడిన స్మార్ట్ టి కాంబో ఆఫర్, అన్ని బ్రాండెడ్ యాక్సెసరీలు, ఇతర వస్తువుల కొనుగోళ్లపై 60శాతం వరకు తక్షణ డిస్కౌంట్‌ను ఇస్తున్నామని అఖిల్ తెలిపారు. రూ.8,999 ప్రారంభ ధరతో స్మార్ట్ టీవీ, రూ.16,500 ధరతో ల్యాప్‌టాప్‌లు లభించనున్నాయని కంపెనీ మరో డైరెక్టర్ సుప్రజ వెల్లడించారు. స్మార్ట్ టీవీపై రూ.7,499 వరకు, ల్యాప్‌టాప్‌పై రూ.4 వేల వరకు క్యాష్‌బ్యాక్, స్మార్ట్ టీవీని కొనుగోలు చేసిన వారికి రూ.17,999 విలువైన సౌండ్ బార్ ఊఫర్‌ను కేవలం రూ.5,999కే అందిస్తున్నామన్నారు. డెబిట్ కార్డ్‌పై రూ.1 డౌన్‌పేమెంట్‌తోనూ ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ ఆఫర్లను వినియోగదారులు ఉపయోగించుకోవాలన్నారు.

అమెజాన్ పేలో రూపె కార్డ్‌పై ఇఎంఐ..!

న్యూఢిల్లీ : పండగ సీజన్ నేపథ్యంలో అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2023 ఆన్ లైన్ షాపింగ్ వినియోగదారులకు అమెజాన్ పే 'రుపే క్రెడిట్ కార్డ్స్‌పై ఈఎంఐ'ని పరిచయం చేసింది. ఎనిమిది బ్యాంక్‌లు జారీ చేసే రూపే క్రెడిట్ కార్డులపై ఈ సౌలభ్యాన్ని అందిస్తున్నామని అమెజాన్ పే ఇండియా క్రెడిట్ అండ్ లెండింగ్ డైరెక్టర్ మయాంక్ జైన్ తెలపారు. తమ ఖాతాదారులకు అమేజాన్ పే లేటర్, అమేజాన్ పే వాలెట్, యూపీఐ తదితర చెల్లింపు ఆప్షన్స్‌ను కల్పిస్తున్నామన్నారు.

నోకియాలో 14వేల ఉద్యోగులపై వేటు..

న్యూఢిల్లీ : టెక్ కంపెనీల్లో ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతోంది. తాజాగా వ్యయ నియంత్రణలో భాగంగా నోకియా తమ 14,000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు ప్రకటించింది. ఉత్తర అమెరికా సహా కీలక మార్కెట్లలో 5జీ పరికరాలకు డిమాండ్ తగ్గడంతో.. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో అమ్మకాలు 20 శాతం పడిపోయాయి. ఈ క్రమంలో ఖర్చులను తగ్గించుకునే పనిలో వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. 2026 నాటికి 14 శాతం నిర్వహణ లాభాలను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 14వేల మంది సిబ్బందికి ఉద్వాసన పలకడం ద్వారా కంపెనీ ఉద్యోగుల సంఖ్య 72వేలకు తగ్గనుందని నోకియా పేర్కొంది. 2024లో 400 మిలియన్ల యూరోలు, 2025లో 300 మిలియన్ల యూరోల మేరకు ఖర్చును తగ్గించుకోవాలని నిర్దేశించుకున్నామని నోకియా సిఇఒ పెక్కా లాండ్‌మార్క్ పేర్కొన్నారు.

మణిపాల్ హెల్త్‌మ్యాప్ చేతికి మెడిక్స్ పాథ్‌ల్యాబ్స్

హైదరాబాద్ : బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న డయాగ్నొస్టిక్ సేవల సంస్థ అయిన మణిపాల్ హెల్త్‌మ్యాప్ తాజాగా హైదరాబాద్‌లోని మెడిక్స్ పాథ్‌ల్యాబ్స్‌ను స్వాధీనం చేసుకుంది. మెడిక్స్‌లో గతేడాది ఏప్రిల్‌లో 84 శాతం వాటాను రూ.100 కోట్లకు మణిపాల్ హెల్త్‌మ్యాప్ కొనుగోలు చేసింది. మిగిలిన 16 శాతం వాటాను తాజాగా కొనుగోలు చేసి.. సంస్థను పూర్తిగా చేజిక్కించుకుంది. దీంతో 16 రాష్ట్రాల్లో 100కు పైగా డయాగ్నొస్టిక్ సేవల కేంద్రాలతో సంస్థ సేవలు అందిస్తున్నట్లు అవుతుంది. దాదాపు 50 లక్షల మంది వినియోగదార్లకు సేవలు అందించే సామర్థ్యానికి చేరామని మణిపాల్ హెల్త్‌మ్యాప్ సీఈఓ సందీప్ శర్మ పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల మధ్య 40శాతం పెరిగిన రద్దీ

- రెడ్‌బస్ సీఈఓ ప్రకాష్ వెల్లడి

హైదరాబాద్ : ప్రస్తుత దసరా పండగ సీజన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య టికెట్ బుకింగ్‌లలో 40 శాతం పెరుగుదల కన్పించిందని ఆన్‌లైన్ బస్ టికెటింగ్ వేదిక రెడ్‌బస్ తెలిపింది. పరిశ్రమ గణంకాల ప్రకారం.. గడిచిన 14 రోజుల్లో ఈ రద్దీ చోటు చేసుకుందని ఆ సంస్థ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. హాలిడే సీజన్ సందర్భంగా హైదరాబాదీలు చాలామంది బాపట్ల, మచిలీపట్నం, రామోజీ ఫిల్మ్ సిటీలకు వెళ్తున్నారని పేర్కొంది. మరోవైపు తిరుపతి, శ్రీశైలం, అన్నవరం దేవస్థానాలకు కూడా ఎక్కువగా వెళ్తున్నారని తెలిపింది. పండుగల సమయంలో రోజుకు 3.2 లక్షల మంది ప్రయాణిస్తారని రెడ్‌బస్ సీఈఓ ప్రకాష్ సంగం అంచనా వేశారు.

ఇంటి వద్ద నుంచే 30 నిమిషాల్లోనే పసిడి రుణం

- ముత్తూట్ ఫిన్‌కార్ప్ యాప్‌తో అవకాశం

న్యూఢిల్లీ : ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ ఇటీవల ఆవిష్కరించిన ముత్తూట్ ఫిన్‌కార్ప్ వన్ ద్వారా కేవలం 30 నిమిషాల్లో ఇంటి నుండి లేదా బ్రాంచ్‌లో బంగారం ఋణాలను పొందవచ్చని ఆ సంస్థ తెలిపింది. ఇదే తరహాలో ఎంఎస్ఎంఇలకు కూడా అప్పులు ఇవ్వనున్నట్లు పేర్కొంది. తమ యాప్‌లో డిజిటల్ గోల్డ్, ఎన్‌సీడీ వంటి పెట్టుబడి ఉత్పత్తులను సైతం అందిస్తున్నట్లు వెల్లడించింది.

ఎన్నికల పండుగ

- బతుకమ్మ, దసరా కానుకల జోరు
- దీపావళికీ ఇదే తంతు
- నిన్నటి వరకు వినాయక... ప్రస్తుతం దేవి నవరాత్రుల జాతర
- పండుగల పేర పరోక్షంగా ప్రలోభాలు
- ఓటర్లకు వివిధ రూపాల్లో గాలమేస్తోన్న అభ్యర్థులు
- ఈసీ నిఘా కండ్లు కప్పి పంపిణీకి ఏర్పాట్లు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి (మేకల కృష్ణ)

ప్రతి ఏటా పండుగలు ఆయా సీజన్లలో వస్తుండటం సహజంగా జరిగే ప్రక్రియ.. కానీ.. ఈ సీజన్‌లో ఎన్నికల పండుగకూడా కలిసిరావడం విశేషం. వినాయక, దేవీ నవరాత్రుల ఉత్సవాలు, బతుకమ్మ, దసరా, దీపావళి పండగలన్నీ ఎన్నికల వేళలో రావడంతో పండగే పండగ అన్నట్లుగా జోరు కనిపిస్తోంది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు అనేక రకాల ఆఫర్లు పెడుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఏదో ఒక రూపంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో లీడర్లున్నారు. నగదు,



నగలు, కానుకలు, చీరలు, మద్యం, మాంసం ఇలా అనేకం పంపిణీ చేసేందుకు సిద్దమవుతున్నారు. ఈసీ నిఘా పెట్టి ఎంత తనిఖీ చేసినా అనేక మార్గాల్లో వీటిని తరలిస్తూ పంపిణీ చేస్తుండటం గమనార్హం.

దేవీ నవరాత్రి ఉత్సవాల ఖర్చులు భరిస్తున్న లీడర్లు

సాధారణంగా గణేష్, దేవీ నవరాత్రి ఉత్సవాలను ఆయా కాలనీల అసోషియేషన్లు, యువజన సంఘాలు ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తాయి. వేడుకలకు అయ్యే ఖర్చులు తలా ఇంత చందాల రూపంలో వసూలు చేసి భరిస్తుంటారు. ఈ సారి వినాకయ చవితి సందర్భంగా విగ్రహానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు టోకెగా కవర్లలో పెట్టి పంపిణీ చేశారు. దుబ్బాక, సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆశావహులందరూ పోటీ పడి విగ్రహాల ఏర్పాటుకు డబ్బులిచ్చారని తెలిసింది. దేవీ నవరాత్రి ఉత్సవాలకు అభ్యర్థులు డబ్బులిచ్చి యువతను, కాలనీ వాసుల్ని ఆకట్టుకుంటున్నారు. ఫౌండేషన్ల పేరిట డబ్బులు కవర్లలో పెట్టి నిర్వాహకులకు అందజేస్తున్నారు. విగ్రహాల వద్దకు పూజలకు హాజరై పొలిటికల్ మైలేజీ పొందుతున్నారు. అన్నదానం పేరిట జరిగే కార్యక్రమాలకు హాజరవుతూ ఖర్చులు అభ్యర్థులే ఇచ్చిపోతున్నారు.

బతుకమ్మ, దసరా కానుకలు

బతుకమ్మ పండగ ఊరూవాడా జరుగుతోంది. దసరా పండగకు కూడా సన్నద్ధమవుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఖరీదైన చీరలు పంచి మహిళల్ని ఆకర్షించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు పోటీలు పడుతున్నారు. వెండి, బంగారం నగలు పంపిణీ చేసేందుకు నమ్మకమైన ఎస్ఎహెచ్ గ్రూపు లీడర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. బతుకమ్మ చీరల పంపిణీ ఆగిపోయినందున ఖరీదైన చీరల్ని కొనుగోలు చేస్తున్నారు. కొందరేమో చీరలు, బట్టలు కొనేందుకు డబ్బులిస్తున్నారు. టిఫిన్ బాక్సులు, గృహోపకరణాలు, టీవీలు, సెల్‌ఫోన్స్, వంట వస్తువుల్ని కూడా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. దసరా పండగ రోజున ఇంటింటికీ కిలో మటన్, చికెన్‌తో పాటు మద్యం సీసాలు అందజేసేందుకు బూత్ కమిటీల వారీగా బాధ్యతలు అప్పజెప్పి, సరఫరాకూ అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, మెదక్, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు సిద్దిపేట నియోజకవర్గంలోనూ తాయిలాలు ఇచ్చేందుకు అభ్యర్థులు సిద్ధం చేసుకుంటున్నారు. దసరాకే కాదు దీపావళి పండుగ కూడా ఎన్నికల వేళ ఉండటంతో తాయిలాలిచ్చి ప్రచారం చేయాలని చూస్తున్నారు.



పలుకుబడిని బట్టి ఎమౌంట్, గిఫ్టులు

ఎన్నికలొచ్చినందున ఇప్పటి వరకు అసంతృప్తి నాయకుల్ని మచ్చిక చేసుకునేందుకు అభ్యర్థులు బేరసారాలు నడిపారు. రోజువారి ఖర్చులు కూడా చెల్లిస్తున్నారు. ప్రధానమైన రెండు రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ప్రచారానికి కదలాలంటే ఖర్చులు ఇవ్వాల్సిందే అన్నట్టుగా నడుస్తోంది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులకు ప్రజల్లో ఉన్న పలుకుబడిని బట్టి ఖర్చులకు డబ్బులిస్తున్నారు. దేనికైనా అదనంగా డబ్బులు చెల్లిస్తే తప్ప కదలని పరిస్థితి ఉందని ఓ పార్టీకి చెందిన కీలక నాయకుడు తెలిపారు. కొన్నిచోట్ల రెబల్ అభ్యర్థులు కూడా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలైన జహీరాబాద్, అందోల్‌లో కూడా పోటీ పడి ప్రలోభాలకు గురిచేస్తూ భారీ ఎత్తున తాయిలాలిస్తున్నారు.

మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, కర్నాటక, ఏపీ, ఒడిశా, బీహార్ ఇతర రాష్ట్రాల నుంచి వలసొచ్చి కంపెనీల్లో ఉపాధి పొందుతున్నారు. పారిశ్రామిక వాడల్లో నివాసముంటున్నందున వీరికి ఓటు హక్కు కల్పించారు. ఓటు హక్కు ఉన్న వలస కార్మికులకు రవాణా ఖర్చులతో పాటు పండగ కోసం నగదు, వస్తువులు కూడా ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు నియోజకవర్గాల వారీగా ఓటు హక్కు ఉన్న వలస కార్మికుల్ని పోలింగ్ బూతు వారీగా జాబితా తయారు చేశారు.

చిట్యాల వద్ద భారీగా బంగారం, వెండి పట్టివేత

- రెండు వాహనాల్లో స్వాధీనం


నవతెలంగాణ- చిట్యాల టౌన్/ విలేకరులు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు చేపడుతున్న వాహన తనిఖీల సందర్భంగా భారీగా నగదు, బంగారం పట్టుబడింది. నల్లగొండ జిల్లా చిట్యాల వద్ద జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీల్లో రూ.25కోట్ల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు. చిట్యాల ఎస్ఐ రవి నవీన్ సిబ్బందితో కలిసి పట్టణంలోని రైల్వే క్రాసింగ్ వద్ద వాహనాల తనిఖీని నిర్వహించారు. ఏపీ 39 టీజి 8761, టీఎస్ 08యూజీ 8122 వాహనాలను తనిఖీ చేయగా 70 కేజీల బంగారం, 276 కేజీల వెండి బిస్కెట్లు గుర్తించారు. పోలీసులు పంచనామ చేసి జిల్లా కన్సల్ట్ విభాగానికి పంపించారు. వీటి విలువ సుమారు 25 కోట్ల రూపాయలు ఉంటుంది. జిల్లా అధికారులు దర్యాప్తు చేసిన అనంతరం ఈ సొమ్ము ఏ సంస్థకు సంబంధించినదనే వివరాలు వెల్లడి కానున్నాయి.



నిర్మల్ జిల్లా కుబీర్ మండలలోని సిరిపెల్లి గ్రామం వద్ద మహారాష్ట్ర బోకర్‌కు చెందిన గణేష్ బోలేరో వాహనంలో రూ.3లక్షల 50వేలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకా కోప్రకు చెందిన ముస్కాన్ పటాన్ వద్ద రూ.90వేలను పట్టుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండంలోని ఇదాని ఎక్స్‌రోడ్డు వద్ద మహారాష్ట్ర నుంచి మంచిర్యాల జిల్లా వైపు వెళ్తున్న కారులో రూ.1.98 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్‌బినగర్ కాలనీ బచ్చన్ స్కూల్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రూ.19.88 లక్షలను పట్టుకున్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని పద్మశాలిపురం ఎన్జీవోస్ కాలనీకి చెందిన బాస మహేందర్ రూ.9.93 లక్షలు, అదే ప్రాంతానికి చెందిన వెలిజర్ల నరసింహ రూ. 9.95 లక్షలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

ఢిల్లీ మద్యం కేసులో సిసోడియా కస్టడీ పొడిగింపు



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన మనీశ్ సిసోదియాకు కోర్టులో మళ్లీ ఊరట లభించలేదు. ఆయనకు విధించిన జ్యుడిషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది. నవంబరు 22 వరకు కస్టడీ కొనసాగుతుందని న్యాయస్థానం పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీశ్ సిసోడియాను సీబీఐ ఫిబ్రవరి 26న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తరవాత ఆయన జైలు శిక్ష కూడా అనుభవించారు. అరెస్టు అయినప్పటి నుంచి ఆయన కస్టడీలోనే ఉన్నారు. సిసోదియాను నిరవధికంగా జైల్లో ఉంచలేమని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. లిక్కర్ స్కాంలో డాక్యుమెంట్లను తనిఖీ చేయాలని నిందితుల తరపు న్యాయవాదులను కోర్టు ఆదేశించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం, మనీలాండరింగ్ కేసుల్లో వేర్వేరుగా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ల తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. తాజాగా ఢిల్లీ కోర్టు ఈ కేసు విచారణను వాయిదా వేస్తూ.. నవంబరు 22 వరకు కస్టడీని పొడిగించింది.

నవంబర్ 1 వరకూ చంద్రబాబుకు రిమాండ్



రాజమహేంద్రవరం : స్కిల్ స్కామ్ కేసులో నిందితునిగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌ను నవంబర్ 1 వరకూ ఏసీబీ న్యాయస్థానం పొడిగించింది. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్‌జైలులో ఆయన 40 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గురువారంతో రిమాండ్ గడువు ముగియడంతో చంద్రబాబును జైలు అధికారులు వర్చువల్‌గా ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని ఏసీబీ న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. తన భద్రత విషయంలో కొన్ని అనుమానాలు ఉన్నాయని చంద్రబాబు న్యాయమూర్తికి తెలిపారు. ఏవైనా అనుమానాలు ఉంటే రాతపూర్వకంగా ఇవ్వాలని న్యాయమూర్తి చంద్రబాబుకు సూచించారు. చంద్రబాబు రాసే లేఖను తనకు పంపించాలని జైలు అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. చంద్రబాబు ఆరోగ్యంపై జైలు అధికారులను ప్రశ్నించారు. మెడికల్ రిపోర్టులను ఎప్పటికప్పుడు కోర్టుకు సబ్‌మిట్ చేయాలని ఆదేశించారు. అనంతరం రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. లీగల్ ములాఖత్‌ను పెంచాలని, రోజుకు మూడు ములాఖత్‌లు ఇవ్వాలని చంద్రబాబు తరుపు న్యాయవాదులు ఎసిబి కోర్టులో పిటీషన్లు దాఖలు చేశారు.

అజారుద్దీన్‌పై నాలుగు కేసులు

నవతెలంగాణ-ఉప్పల్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయి. ఉప్పల్ స్టేడియంలో వివిధ సామాగ్రి కొనుగోళ్లలో కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందంటూ హైదరాబాద్ క్రికెట్ సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి సునీల్ కంటే గురువారం ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. అగ్నిమాపక, క్రికెట్ బంతులు, బకెట్ కుర్చీలు, జిమ్ సామాగ్రి కొనుగోలు వ్యవహారంలో అవకతవకలు జరిగినట్టు ఆయన ఆరోపించారు.

2019-2022 మధ్య అపెక్స్ కౌన్సిల్ ఉన్న సమయంలో ఈ అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ సమయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజారుద్దీన్ ఉన్నారు.

నేడు బీజేపి పార్లమెంటరీ పార్టీ బోర్డు భేటీ

- మొదటి జాబితాలో 60 నుంచి 70 సీట్లు ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు తుది దశకు చేరింది. నేడు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి బీజేపీ పార్లమెంటరీ పార్టీ బోర్డు(సీఈసీ) భేటి కానుంది. దీన్ దయాళ్ మార్గ్‌లోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఈసీ భేటి కానుంది. ఈ భేటిలో ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు నడ్డా, పార్లమెంటరీ పార్టీ బోర్డు సభ్యులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్, లక్ష్మణ్ తదితరులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం తీసుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం అభ్యర్థుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. 119 స్థానాలు ఉన్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు దాదాపు 60 నుంచి 70 మందితో కూడిన మొదటి జాబితా విడుదల చేసే అవకాశముంది. ఇందులో పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలకు చోటు కల్పించనున్నారు.


మరోవైపు బీజేపి పార్లమెంటరీ పార్టీ భేటి నేపథ్యంలో గురువారం బీజేపి రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం జరిగింది. బీజేపి రాష్ట్ర ఎన్నికల ఇంచార్జ్ ప్రకాశ్ జవడేకర్ నివాసంలో సమావేశమైంది. తుగ్లక్ రోడ్డు 2లోని జవడేకర్ నివాసంలో మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు సాగింది. ఈ భేటీలో రాష్ట్ర ఇంచార్జ్ తరుణ్ చుగ్, అధ్యక్షులు కిషన్ రెడ్డి, పార్లమెంటరీ పార్టీ మెంబర్ కె. లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఎన్నికల సహ ఇంచార్జ్ సునీల్ బన్సల్ తదితరులు పాల్గొన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్రంలోని 119 స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశారు. సాయంత్రం పలు దఫాలుగా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో రాష్ట్ర కోర్ కమిటీ భేటీ అయింది. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన తుది జాబితాపై చర్చించింది. భిన్న అభిప్రాయాలు, క్లిష్టంగా ఉన్న స్థానాలపై నడ్డాల పలు మార్పులు చేర్పులు సూచించినట్లు తెలిసింది. దీని ఆధారంగా నేడు ఉదయం 11 గంటలకు మరోసారి నడ్డాతో రాష్ట్ర కమిటీ భేటి కానున్నట్టు సమాచారం. ఈ భేటిలో తుది జాబితా రూపొందించి, సాయంత్రం జరిగే పార్లమెంటరీ పార్టీ బోర్డు భేటీలో ఈ జాబితాకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది.

'కాలే'కు ఎంత కష్టం..!

- చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి యాదయ్యపై సొంత పార్టీ నేతలే కుట్రలు
- అంతర్గతంగా బీఆర్ఎస్ ప్రత్యర్థికి సహకారం

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'తనకు ప్రమాదం అనుకున్నప్పుడు పాము తన పిల్లలను తానే మింగినట్టు' చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలే యాదయ్యకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు పనిచేస్తున్నారని తెలిసింది. కాలే యాదయ్యకు చెక్ పెట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు సమాచారం. దీనిపై ఆ పార్టీలోనే తీవ్ర చర్చ జరుగుతుండటం గమనార్హం. ఇది ఆపార్టీ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జిల్లా పార్టీ పెద్దల ఆశీర్వాదం కరువైతే కాలే విజయం కష్టమేనని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్. ఇక్కడ బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా ఉంది. చేవెళ్ల నియోజకవర్గం నుంచి 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా కాలే యాదయ్య గెలుపొందారు. అనంతరం ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈసారి కూడా కాలే యాదయ్యకు కేసీఆర్ టికెట్ కేటాయించారు. దాంతో ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. గతంలో లాగా కాలే యాదయ్యకు జిల్లా అగ్ర నాయకత్వం సహకరించే పరిస్థితులు లేవు. ఆయన మళ్లీ గెలిస్తే తమ రాజకీయ ఎదుగుదలకు అడ్డు వస్తారని భావిస్తున్న ఆ పార్టీ ముఖ్యనేతలు దూరంగా ఉన్నారు.

పెద్దల ఆశీర్వాదం లేకుండా కాలేకు గెలుపు కష్టం

కాలే యాదయ్య విజయం బీఆర్ఎస్ జిల్లా పెద్దల చేతిలో ఉంటుంది. కానీ ఆ పెద్దలే కాలే గెలుపునకు అడ్డుపడుతున్నారు. కాలేకు సహకారం లేదు. అంతేగాకుండా, ప్రత్యర్థి గ్రూపునకు అంతర్గతంగా తమ మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. పార్టీ అభ్యర్థుల గెలుపునకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ అధిష్టానం ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. జిల్లా పెద్దల నుంచి సహకారం లేకపోవడం గెలుపుపై తీవ్ర ప్రభావం పడనుంది.

ఎన్ఈపీని రద్దు చేయాలి

- పౌర సంఘాల డిమాండ్

చెన్నై : కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను రద్దు చేయాలని పౌర సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'ఎన్ఈపీ నుంచి విద్యను కాపాడాలి' పేరుతో చెన్నైలోని లయోలా కాలేజీలో కాన్ఫరెన్సును ఏర్పాటు చేశాయి. 36 పౌర సంఘాలు ఇందులో పాల్గొన్నాయి. విద్యా మంత్రిత్వ శాఖను పక్కకు బెట్టి రాష్ట్రపతి అధ్యక్షతన ఉన్నత స్థాయి రాష్ట్రీయ శిక్షా ఆయోగ్‌ను ఏర్పాటు చేయటంపై పౌర సంఘాలు కేంద్రం తీరును విమర్శించాయి. ఈ సమావేశానికి కేరళ ఉన్న విద్య మంత్రి ఆర్. బిందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్ఈపీ విద్యా విధానం విషయంలో కేంద్రం అనుసరించిన తీరును ఆమె విమర్శించారు. దీనిపై అధ్యయనం జరగలేదన్నారు. తమిళం, తెలుగు, మళయాలం, కన్నడ, ఒడియా భాషలు కేవలం రూ.29 కోట్లు నిధులను పొందాయని డీఎంకే ఎమ్మెల్యే తిరువళ్లువర్ తెలిపారు. ఈ సమావేశానికి యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జె. గాంధీ రాజ్ అధ్యక్షత వహించారు. విద్యావేత్త అయేషా నటరాజన్, ఆర్థికవేత్త వెంకటేశ్ ఆత్రేయ, రచయిత అద్వాన్ ధీక్షన్య, ఇతరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.





సాంకేతికతకూ, వైద్య రంగానికి వారధి

మైత్రి సురేష్... ఫిజియోథెరపీకి సంబంధించిన సేవలు అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఆ లక్ష్యంతోనే ఆమె స్టార్టూన్ ల్యాబ్స్ స్థాపించారు. భారతదేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జి-20 సదస్సులో ప్రోడక్ట్ యూనిక్‌గా నిలబడి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆ ల్యాబ్ స్థాపన వెనుక దాగిన ఆమె స్ఫూర్తిదాయక ప్రయాణం నేటి మానవిలో...

మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి చెప్పండి?

హైదరాబాదులోనే పుట్టాను. ఇక్కడే చదువుకున్నాను. మా అమ్మ మైథిలి గవర్నమెంట్ ఆఫీసర్‌గా పని చేసేవారు. నాకు ఒక అక్క. జేఎన్‌టీయూ హైదరాబాదులో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. 2010 GATE పరీక్షలో 99.03 పర్సంటేజ్ సాధించాను. మూడేండ్లు ఐఐటి చెన్నైలో డిజైనింగులో రీసెర్చ్ చేశాను. ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సిస్టం కంట్రోలింగ్ విభాగాల్లో స్పెషలైజేషన్ కూడా చేశాను.

మీ ఉద్యోగ జీవితం..?

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువు పూర్తి చేసి ఆరేండ్లు ఓ కంపెనీలో పనిచేశాను. ఈ సమయంలోనే అహ్మదాబాద్ ఐ.ఐ.ఎం.ఇ. నుండి కొన్ని కోర్సులు చేశాను. తర్వాత ఆ ఉద్యోగం వదిలేసి ఐఐటి మద్రాస్‌కి వెళ్లాను.

మీ సొంత కంపెనీ ఎప్పుడు ప్రారంభించారు?

2017లో నేనూ, నా భర్త సురేష్ కలిసి మెడికల్ పరికరాలు కోసం ఒక కంపెనీ పెట్టాలని అనుకుని స్టార్టూన్ లాబ్స్ ప్రారంభించాము. ఇంజనీరింగ్ చేస్తున్నపుడే కంపెనీ పెట్టాలని ఉండేది. అప్పటి నుండే నా ప్రాజెక్టులన్ని మనుషులకు సంబంధించిన పరికరాల మీదే ఉండేవి. ఉదాహరణకి డయాబెటిస్ పేషెంట్లకు అవసరమైన పరికరాలు. వాటికి సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి చాలా కోర్సులు చేశాను. మాది మిడిల్ క్లాస్ ఫ్యామిలీ. మా కుటుంబాలలో బిజినెస్ చేసిన వాళ్ళు లేరు. చేయాలనే ఊహ కూడా ఎవరికీ లేదు. చదువుకుని ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడే వారే గాని ఇలాంటి విప్లవాత్మకమైన ఆలోచనలు ఉండేవి కావు. దాంతో నాకు సపోర్టు లేదనే చెప్పవచ్చు. నేను చేస్తున్న పని గురించి కూడా వారికి అర్థం కాదు. ఎప్పుడైనా పేపర్లలో నా గురించి ఫొటోలు వస్తే చూసి సంతోషిస్తారు. అంతేగాని నేను ఏం చేస్తున్నది వాళ్ళకి తెలీదు.

కంపెనీ అభివృద్ధిలో మీ భర్త పాత్ర ఎలా ఉంది?

నా జీవిత భాగస్వామి సురేష్ నాలుగేండ్లు ఉద్యోగం చేసిన తర్వాత మద్రాసు ఐ.ఐ.టి.కి వచ్చారు. అక్కడ మేమిద్దరం సహ విద్యార్థులం. మా ఇద్దరి అభిప్రాయాలు చాలా వరకు కలిసేవి. అంటే పరిశోధనాత్మకంగా ఏమైనా చేయాలి అనే అభిలాష మా ఇద్దరిలోనూ ఉంది. ఒకరినొకరం అర్థం చేసుకుంటాం. అంటే మా మధ్య గొడవలు రావని కాదు. గొడవలు వచ్చినా కలిసిపోవడం అందంగా ఉంటుంది. కంపెనీ మా ఇద్దరిదీ కాబట్టి ఇంట్లో పనులు చేసుకుంటూనే కంపెనీ గురించి మాట్లాడుకుంటాం.

అసలు మీరు మెడికల్ రంగాన్నే ఎందుకు ఎంచుకున్నారు?

సాధారణంగా మన దేశంలో డాక్టర్లు, ఇంజనీర్లు మంచి నోబెల్ ప్రొఫెషన్స్. కానీ ఇరువురూ ఎవరి వృత్తి వారిదిగా పని చేసుకుంటూ ఉంటారు. ఇద్దరి కాంబినేషన్‌తో రోగికి ప్రయోజనం చేకూరాలి అనేది నా ఉద్దేశం. కంపెనీ ప్రారంభించేముందు హాస్పిటల్స్‌కి వెళ్లి వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకుని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. న్యూరో, సైకియాట్రిస్ట్, పల్మనాలజీ వంటి డాక్టర్లను కూడా కలిసాము. అన్ని డిపార్ట్‌మెంటులకు వెళ్ళినప్పుడు మంచి సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. కానీ ఫిజియోథెరపీలో మాత్రం చాలా పాత పద్ధతుల్ని వాడుతున్నారు. చాలా ఆశ్చర్యంగా అనిపించింది. గత 50 ఏండ్లుగా భారతదేశంలో ఫిజియోథెరపీ చేస్తున్న వారందరూ ఆ పాత పద్ధతులకే అలవాటు పడిపోయారు. పైగా వాళ్ళకు వెనుకబడి ఉన్నామని కూడా అనిపించలేదు. వాళ్ళతో మాట్లాడి కొత్తగా ఇటువంటి రిపోర్టులను అందించే పరికరం వచ్చినట్లయితే మీకు ఉపయోగపడుతుందా అని ప్రశ్నిస్తే చాలామంది సానుకూలంగా స్పందించారు. కొత్త పరికరాలు లేవు కనుక పాత వాటితోనే వైద్యం చేస్తున్నారు అనే విషయం అర్థమైంది. మెడికల్ ఫీల్డులో తయారు చేసిన పరికరాన్ని ఉపయోగించే రోగుల నుండి మనకు వెంటనే ఫీడ్ బ్యాక్ వస్తుంది. వ్యక్తిగతంగా వారి ఆరోగ్యంలో మెరుగుదల, వారి సంతోషం నాకు చాలా తృప్తిని కలిగించాయి. అంతేకాక దానిని సవరించుకుంటూ ముందుకు వెళ్లడం చాలా అవసరం.

మీ ప్రొడక్ట్స్‌కి లాబ్ ఎక్కడ ఉంది? అందులో ఎంత మంది పనిచేస్తారు?

మాది ఎలక్ట్రానిక్స్ ల్యాబ్. కాంట్రాక్టు మ్యానుఫ్యాక్చరర్స్ కూడా ఉంటారు. వారు అవసరమైన విడిభాగాలు అందచేస్తారు. కావలసిన చోటి నుండి విడిభాగాలు తెప్పించి, దానికి మెడికల్ పరమైన టెక్నాలజీని జోడించి తయారు చేస్తాం. పేటెంట్ ఆల్గోరిజిన్స్ సర్టిఫికేషన్స్ కావాలి కనుక అవన్నీ మాకు ఉన్నాయి. మా సంస్థలో మెడికల్ పరంగా డాక్టర్లు, సాంకేతికపరంగా ఇంజనీర్లు కూడా అవసరం. కనుక మా ప్రయోగశాలలో సుమారుగా 20 మంది ఉంటారు. వీటిని హాస్పిటల్స్‌లో డాక్టర్ల పర్యవేక్షణలో ఉపయోగిస్తాం. నేను స్వయంగా హాస్పిటల్స్‌కు వెళ్లి రోగులతో ఇంటరాక్ట్ అవుతాను. కంపెనీ ఓనర్‌గా నన్ను నేను పరిచయం చేసుకోను. అందువలన వారు చాలా స్వేచ్ఛగా నాతో మాట్లాడతారు.

కంపెనీ ప్రారంభంలో ఏవైనా సమస్యలు ఎదుర్కొన్నారా?

మెడికల్ ఎక్విప్మెంట్ తయారు చేయడం ఇండియాలో కొత్త. 2017లో మేము ప్రారంభించే నాటికి ప్రజలకు అర్థం అయ్యేది కాదు. పరికరాలు తయారు చేసి మనుషుల మీద ప్రయోగిస్తున్నాం. అంటే పూర్తి ప్రాసెస్‌కి చాలా సమయం తీసుకుంటుంది. ఫలితానికి చాలా కాలం ఎదురు చూడాలి. టెస్టుల రిపోర్టులు కలెక్ట్ చేయడానికి చాలా ఖర్చవుతుంది. ఇవన్నీ పూర్తయితే గాని ప్రాజెక్ట్ లాంచ్ చేయలేం. మేమిద్దరం ఇంజనీర్లు కాబట్టి ఇతర దేశాల్లో 30 నుండి 40 కోట్లు అయ్యే పరికరాన్ని మేము తక్కువ ఖర్చుతో తయారు చేయగలిగాం. మన దగ్గర మెడికల్ ఫీల్డ్‌లో పరికరాలపై అవగాహన లేకపోవడమే పెద్ద ఛాలెంజ్. ఆ సమయంలో మాకు వి-హబ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, DBT, Meiry ఎంతో సహాయం చేశాయి.

మీ కంపెనీకి ఇంత త్వరగా గుర్తింపు రావడానికి కారణం?

ఇష్టంగా పని చేయటం, పరిశోధనాత్మకంగా అందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్ళటం.



శిక్షణ పొందిన ఫిజియోథెరపిస్టులు అవసరమైతే ఇళ్లకు వెళ్లి సేవలు అందిస్తారు. అలాగే మెడికల్ పరికరాలను రోగుల అవసరాలను బట్టి ఉపయోగించడం.

మీ కంపెనీ గురించి మరిన్ని వివరాలు..?

2017లో స్టార్టూన్ ల్యాబ్స్ అనే పేరుతో కంపెనీ ప్రారంభించాం. ఇది ఐ.ఎస్.ఓ సర్టిఫికెట్ పొందిన మెడికల్‌పరికరాల కంపెనీ. హైదరాబాద్ కేంద్రంగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పనిచేస్తూ మెడికల్ పరికరాలను తయారు చేస్తాం. ప్రపంచ స్థాయిలో ఆరోగ్య పరిరక్షణకు ధీటుగా మన ఉత్పత్తులను నిలపాలనే విజన్‌తో ముందుకెళుతున్నాం. యువత అభిరుచి అనుభవాల కలబోతగా మన సమాజంలోని ఎకో సిస్టంకి అందుబాటులో ఉంచాలనుకుంటున్నాం. దీని ఉద్దేశం ఆరోగ్యపరంగా వచ్చే సమస్యలకు ఇన్నోవేటివ్ విధానంలో పరిష్కారాలు కనుగొనడం. మన ప్రజలకే కాకుండా ప్రపంచ స్థాయి ప్రామాణికాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేయడమే ఈ కంపెనీ ఉద్దేశం.

మీ భవిష్యత్ ప్రణాళిక?

ఫిజియోథెరపీకి సంబంధించిన మా రీసెర్చ్, పరికరాల ఉత్పత్తి ఒక స్థాయికి వచ్చిన తర్వాత మహిళల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టాలని అనుకుంటున్నాను. ప్రసూతి సమయంలో అనేకమైన మార్పులు జరుగుతాయి. అదేవిధంగా 50 ఏండ్లు దాటిన తర్వాత కండరాలు చాలా బలహీనమవుతాయి. దాంతో మూత్ర సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఏ జబ్బు అయినా ఒకేరోజు సడన్‌గా బయటపడదు. లోపల ఎంతో డ్యామేజీ జరిగిన తర్వాతే బయటకు వస్తుంది. అటువంటి సమయంలో స్త్రీలకు ఫైనాన్స్, మోరల్, మెడికల్, ఫ్యామిలీ సపోర్ట్ చాలా అవసరం. అలాంటి సపోర్ట్ మేము ఇవ్వాలనుకుంటున్నాం.

- చివుకుల శ్రీలక్ష్మి





మధ్య ప్రాచ్యంలో సుస్థిరత నెలకొనాలి

(మొదటిపేజి తరువాయి)

విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తంగా మధ్య ప్రాచ్యంలో హింస, ఘర్షణలు పెచ్చరిల్లకుండా చూడాల్సిన అవసరాన్ని ఇరువురు నేతలు నొక్కి చెప్పారని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

రష్యా నుంచి 27 టన్నుల సాయం

27టన్నుల సాయాన్ని గాజాకు పంపుతున్నట్లు రష్యా తెలిపింది. మాస్కో నుండి ప్రత్యేక విమానం ఈజిప్ట్‌కు చేరుతుందని, అక్కడ రష్యా మానవతా సాయాన్ని ఈజిప్ట్ రెడ్‌క్రీసెంట్ అధికారులకు అందజేస్తామని డిప్యూటీ మంత్రి ఇలియా డెనిసావ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మధ్యప్రాచ్యంలో సుస్థిరత కోసం ఈజిప్టుతో కలిసి పనిచేస్తాం : జిన్‌పింగ్

మధ్య ప్రాచ్యంలో మరింత సుస్థిరత నెలకొనేలా చూసేందుకు ఈజిప్ట్‌తో కలిసి పనిచేస్తామని చైనా నేత జిన్‌పింగ్ చెప్పారు. గురువారం ఈజిప్ట్ ప్రధానితో ఆయన మాట్లాడారు. ఈజిప్ట్‌తో సహకారాన్ని పెంచుకుని ఈ ప్రాంతంలో, తద్వారా ప్రపంచంలో మరింత సుస్థిరత తీసుకురావాలన్నది చైనా అభిమతమని ఆయన పేర్కొన్నారు. చైనా, ఈజిప్ట్‌లు మంచి మిత్రదేశాలని, ఒకే లక్ష్యాలను కలిగి వున్నాయని, పరస్పరం విశ్వాసం కలిగి వున్నాయని పేర్కొన్నారు.

పాలస్తీనా అధ్యక్షుడితో మాట్లాడిన మోడీ

గాజా ఆస్పత్రిపై దాడి జరిగిన నేపథ్యంలో పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడారు. ఆ దాడిలో అమాయకులు అశువులు బాయడం పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. పాలస్తీనియన్లకు మానవతా సాయాన్ని పంపడాన్ని భారత్ కొనసాగిస్తుందని చెప్పారు. ఆ ప్రాంతంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు, హింస, తీవ్రవాదంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్-పాలస్తీనా సమస్యపై భారత్ దీర్ఘకాలంగా అనుసరిస్తున్న సూత్రబద్ధ వైఖరిని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అంతర్జాతీయ మానవతా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని భారత్ పిలుపిచ్చింది.

జోర్డాన్, ఈజిప్ట్ చర్చలు

మరోవైపు రాఫా క్రాసింగ్ మీదుగా మానవతా సాయాన్ని అనుమతించేందుకు వీలుగా గాజా క్రాసింగ్ వద్ద దెబ్బతిన్న రోడ్లను ఈజిప్ట్ మరమ్మత్తు చేస్తోంది. జోర్డాన్ రాజుతో గురువారం ఈజిప్ట్ అధ్యక్షుడు సిసి భేటీ అయ్యారు. గాజాలో క్షీణిస్తున్న పరిస్థితులను చర్చించారు. పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఉమ్మడిగా శిక్షను అమలు చేస్తున్న ఇజ్రాయిల్ విధానాన్ని వారు ఖండించారు. పాలస్తీనియన్లను వారి ఇళ్ల నుండి వెళ్లగొట్టి ఈజిప్ట్‌కు, జోర్డాన్‌కు పంపేయాలని చూస్తోందని విమర్శించారు. గాజాపై దాడుల గురించి టర్కీ, ఈజిప్ట్ మంత్రులు కూడా చర్చించారు.

ఇజ్రాయిల్ దాడిలో ముగ్గురు పాలస్తీనా వాసుల మృతి

గాజాలో రక్తపాతం సాగిస్తున్న ఇజ్రాయిల ఇంకా బుల్లెట్ల వర్షం కురిపించి, పాలస్తీనియన్లను బలితీసుకుంటోంది. గురువారం వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిలీ బలగాలు జరిపిన కాల్పుల్లో 14 ఏళ్లు, 16 ఏళ్ల వయసున్న టీనేజర్లుసహా ముగ్గురు పాలస్తీనియన్లు మరణించారు.

న్యూస్‌క్లిక్ కేసులో ... (మొదటిపేజి తరువాయి)

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేసింది.ప్రబీర్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ "ప్రబీర్ లోపల ఉన్నారు. ఆయన వయస్సు 72 ఏండ్లు. అందువల్ల త్వరగా విచారణ జరపండి" అని అన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ తాము నోటీసులు జారీ చేస్తామని, మూడు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను ఆదేశిస్తామని ధర్మాసనం పేర్కొంది. అది చాలా దూరం అవుతుందని, వెంటనే విచారించాలని కపిల్ సిబల్ అన్నారు. "దీన్ని శుక్రవారమే విచారణకు తీసుకోలేం. శుక్రవారం మాత్రమే పని దినం (దసరా సెలవులకు ముందు). అక్టోబర్ 30 వచ్చే సోమవారం జాబితా చేస్తాం" అని ధర్మాసనం తెలిపింది. హెచ్‌ఆర్ విభాగ అధిపతి తరపు సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ తమ కేసు వినాలని, ఇందులో కూడా నోటీసులు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన ధర్మాసనం ఆ కేసులో కూడా నోటీసులు ఇస్తామని ధర్మాసనం పేర్కొంది. తమను పోలీసు కస్టడీకి అప్పగించాలన్న ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పుర్కాయస్థ, చక్రవర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

విద్యారంగాన్ని గాలికొదిలిన రాజకీయ పార్టీలు

సర్కారు బడుల్లో ప్రీప్రైమరీని ప్రారంభించాలి

- విద్యపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించే అభ్యర్థులనే ఎన్నుకోవాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగాన్ని రాజకీయ పార్టీలు గాలికొదిలేశాయని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. పార్టీల మ్యానిఫెస్టోల్లో విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో మళ్లీ అధికారంలోకి వస్తే అసెంబ్లీ నియోజకవర్గానికొక ఉన్నత కులాల్లోని పేద విద్యార్థులకు గురుకులాలను ఏర్పాటు చేస్తామంటూ ప్రకటించారని గుర్తు చేశారు. పాఠశాల విద్య మొత్తాన్ని గురుకులాల ద్వారానే అందిస్తామనే ఆలోచన ఆచరణయోగ్యం కాదని పేర్కొన్నారు. వాటిలో ఐదు నుంచి పదో తరగతి వరకు, కొన్నింటి లో ఇంటర్ తరగతులుంటాయని వివరించారు. ప్రస్తుతం అన్ని గురుకులాల్లో కలిపి ఐదు లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులు వివిధ రకాల పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారని పేర్కొన్నారు. 32 లక్షల మంది విద్యార్థులు ప్రయివేటు బడుల్లో చదువుకుంటున్నా రని వివరించారు. వాటిలో చదివిస్తున్న 50 శాతం కుటుంబాల పిల్లల ఫీజులు భరించలేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మన ఊరు-మనబడి పథకంలో మొదటి దశలో 9,123 బడులను బాగుచేస్తామంటూ అట్టహాసంగా ప్రకటించినా 900 స్కూళ్లను కూడా పూర్తి చేసినట్టు లేదని విమర్శించారు. పాఠశాల విద్యను నడిపించే డైరెక్టరేట్ అచేతనా స్థితిలో ఉందని పేర్కొన్నారు. సీఎం, విద్యామంత్రితోపాటు శాసనమండలిలో ప్రస్తావించినా ప్రభుత్వ స్పందన శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్య, ఇంటర్ విద్యలో ప్రభుత్వరంగంలో 25 శాతం విద్యార్థులే చదువుతున్నారని తెలిపారు. 75 శాతం మంది విద్యార్థులు ప్రయివేటు విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల విద్యను కూడా ప్రభుత్వ రంగంలో 25 శాతానికి కుదించాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేసినట్టు కనిపిస్తున్నదని తెలిపారు. అందుకే పాఠశాల విద్యను భ్రష్టుపట్టించే అధికారులను ప్రభుత్వం కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు.

తంతుగా మారిన ఉపాధ్యాయ దినోత్సవం

సెప్టెంబర్ ఐదున ఉపాధ్యాయ దినోత్సవం ఓ తంతుగా మారిందని నర్సిరెడ్డి విమర్శించారు. రాజకీయ పార్టీల్లో నాయకులు చేరినప్పుడు పార్టీ కండువా కప్పిన తరహాలోనే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో శాలువాలు కప్పుతున్నారని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి కృషిని బ్రోచర్ రూపంలో ముద్రించి ఉపాధ్యాయులందరికీ అందిస్తే ప్రేరణగా ఉంటుందని నాలుగేండ్లుగా అధికారులకు చెప్తున్నా ఆ ప్రయత్నం చేయడం లేదని పేర్కొన్నారు. ఆ ఎంపిక లోపభూయిష్టంగా ఉంటుందని విమర్శించారు. పైరవీలు, సిఫారసులతో కొంతమందిని ఎంపిక చేస్తున్నందున వారి కృషిని ప్రకటించలేని దుస్థితి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రభుత్వరంగ పాఠశాల విద్యకు నష్టాన్ని కలిగించిందనీ, ఉపాధ్యాయుల్లో నిర్లిప్తతను పెంచిందని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో తమిళనాడు, కేరళ, కర్నాటక, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు మంచి స్థాయిలో ఉన్నాయని వివరించారు. అక్కడ 80 శాతానికిపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. మేఘాలయ మాత్రమే తెలంగాణ కంటే ప్రయివేటీకరణలో ముందున్నదని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన యూరప్, అమెరికా, అభివృద్ధి చెందుతున్న చైనా, ఇతర ఆసియా ఖండ దేశాల్లో కూడా పాఠశాల విద్య ప్రభుత్వరంగంలో ఉందని వివరించారు. 90 నుంచి వంద శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని వివరించారు. నాణ్యమైన, నైపుణ్యాలతో కూడిన విద్యను అందించడం కంటే గొప్ప ప్రజా సంక్షేమం ఏముంటుందని ప్రశ్నించారు. భావిపౌరులకు చదువు చెప్పడం వదిలేసి గొప్ప సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామంటే అది డొల్లతనమేనని విమర్శించారు. ప్రజలూ కీలకమైన విద్య నుంచి స్పందించాలని తెలిపారు. విద్యపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించే రాజకీయ పార్టీల అభ్యర్థులనే ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు.

పాఠశాల విద్యను సంస్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలు :

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు (ప్రీప్రైమరీ) ప్రారంభించాలి. ఒకటి నుంచి ఐదు తరగతులకు తరగతికొక గది, టీచర్, బడికో ప్రధానోపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను పునర్‌వ్యవస్థీకరించాలి.
- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సింగిల్ సెక్షన్, డబుల్ సెక్షన్, మూడు సెక్షన్లు, అవసరమైన చోట నాలుగు, ఐదు సెక్షన్లుగా పరిగణించి ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలి. రేషనలైజేషన్ జీవోను అందుకనుగుణంగా సవరించాలి.
- ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను అవసరమున్నచో ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలి. అవసరం లేనిచోట ప్రాథమిక పాఠశాలలుగా డీగ్రేడ్ చేయాలి.
- గ్రేటర్ హైదరాబాద్ (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు), వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, రామగుండం నగరాల్లో 2000 ఏడాది నుంచి కొత్తగా విస్తరించిన ప్రాంతాల్లో, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, మంచిర్యాల మొదలైన గ్రేడ్-1 మున్సిపాల్టీల్లో కొత్తగా విస్తరించిన ప్రాంతాల్లో ప్రభుత్వ బడులను మంజూరు చేసి ప్రారంభించాలి.

వేడెక్కిన ఎన్నికలు

(మొదటిపేజి తరువాయి)

ఎక్కుపెడుతున్నారు. మరోవైపు సీఎం కేసీఆర్ సైతం ఎడాపెడా సభలతో రాష్ట్రాన్ని చుట్టేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇప్పటికే పలు బహిరంగసభల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ ప్రచారం సాగుతుండగా, వాటికి ధీటుగా సీఎం కసీఆర్‌తోపాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత స్పందిస్తున్నారు. ప్రచారంలో కాంగ్రెస్ వినూత్న పంథాను ఎంచుకుంది. తొలుత ప్రధాన నాయకుల నియోజకవర్గాల్లో ప్రచారం మొదలెడితే, ఆ ఊపు మిగతా స్థానాల్లో కొనసాగుతుందనే వ్యూహంతో సాగుతున్నది. గతంలో వైఎస్సార్ ప్రజాప్రస్థానం తరహాలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. చేవెళ్ల నుంచి ప్రారంభమైన ప్రజాప్రస్థానం చివరిదాకా ఒకేఊపులో నడవడమే అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైందంటూ ఆ పార్టీ సమీక్షల్లో వచ్చింది. ఆ తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ అడుగులేస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇటు ఎమ్మెల్యే సీతక్క ములుగు నియోజకవర్గం, అటు సీఎల్పీ ఉప నాయకుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథనీ నుంచి కాంగ్రెస్ ప్రచారం ఆశించినరీతిలోనే మొదలైంది. సాగింది. బహిరంగసభలకు ప్రజలు సైతం భారీగా రావడంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం వెల్లివిరుస్తున్నది. ఇదిలావుంటే రాహూల్, ప్రియాంక ఒకేసారి ప్రచారానికి రావడం ఇప్పుడు కచ్చితంగా కాంగ్రెస్‌కు అనుకూలిస్తుందనే సమాలోచనలు రాజకీయ విశ్లేషకుల్లో నడుస్తున్నాయి. ఈ యువనాయకత్వం తెలంగాణపై పట్టుసాధించి ఈ ఎన్నికల్లో రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవాలనే భావనతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. టీపీసీసీ నేత రేవంత్‌రెడ్డి సైతం వచ్చే ఎన్నికల్లో గెలిచేది మేమే, డిసెంబరులో ప్రమాణం చేసేది కాంగ్రెస్సేననే ధీమాతో ఎన్నికల గోదాలోకి దిగారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత విమర్శలకు ఘాటుగానే స్పందిస్తున్నారు. దేనికైనా 'రెఢీ' అనే పద్ధతిలో పార్టీని నడిపిస్తున్నారు. తెలంగాణను ఇచ్చింది మేమే, తెచ్చింది మేమే అనే నినాదాన్ని ఈ ఎన్నికల్లోనూ ప్రచారంలో కాంగ్రెస్ పెడుతున్నది. దొరల తెలంగాణ మనకొద్దు, ప్రజల తెలంగాణే కావాలంటూ రాహుల్ చేసిన విమర్శ, కేసీఆర్ కుటుంబాన్ని ఇరుకున పెట్టేందుకేనని స్పష్టమవుతున్నది. అలాగే రాష్ట్రంలో ప్రజాస్వామ్య మూలాలు దెబ్బతింటున్న వైనాన్ని సర్వత్రా చర్చ జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రగతిభవన్‌ను గడీలా మార్చేశారనీ, జనానికి అందుబాటులో ఉండరనీ, తమకు అవసరం ఉన్నప్పుడే పిలుస్తారనీ, ప్రజల అవసరాలను పట్టించుకోరనే పద్ధతిలో కాంగ్రెస్ ప్రచారం సాగిస్తున్నది. ఆ పార్టీ సీనియర్లకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాలతో అందరూ కలిసికట్టుగా ఎన్నికలను ఎదుర్కొనే వాతావరణం వచ్చిందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై రాహుల్‌గాంధీ చేసిన విమర్శ ప్రభుత్వాన్ని గట్టిగానే తాకింది. దీనికి కేటీఆర్ సాకులు వెతికే పనిలో పడ్డారు. తెలంగాణకు కాంగ్రెస్సే నెంబర్ వన్ విలన్ అంటూ సీఎం కేసీఆర్ సైతం వ్యాఖ్యానించారు.



ఎదురు దాడులకు కేరాఫ్ అడ్రస్ డ్రామారావు

మంత్రి కేటీఆర్‌కు రేవంత్ కౌంటర్ ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బస్సుయాత్ర తుస్సుమనడం ఖాయమంటూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కౌంటర్ ట్వీట్ చేశారు. నిస్సిగ్గు మాటలకు, ఎదురుదాడులకు కేరాఫ్ అడ్రస్ డ్రామారావు అంటూ కేటీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. 10 ఏండ్లు అధికారంలో ఉండి అంట కాగింది మోడీ- కేడీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమకు పాతరేసింది బీజేపీ, బీఆర్ఎస్ విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును పాతాళానికి తొక్కింది కూడా ఆ రెండు పార్టీలేనని తెలిపారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయించలేని దద్దమ్మలం అని తమరే ఒప్పుకుంటున్నారని గుర్తు చేశారు. తెలంగాణకు కేసీఆర్ లాంటి దద్దమ్మ పాలన ఇక అవసరం లేదంటూ రేవంత్ ట్వీట్ చేశారు.

సైబర్ నేరగాళ్లపై సీబీఐ

న్యూఢిల్లీ : సైబర్ నేరగాళ్లపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) మరోమారు గురి పెట్టింది. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీల సహకారంతో 11 రాష్ట్రాల్లోని 76 చోట్ల సోదాలు నిర్వహించింది. ఆర్థిక మోసాలకు సంబంధించి ఐదు వేర్వేరు కేసులు నమోదు చేసిన సీబీఐ ఆపరేషన్ "చక్రా-2" పేరుతో దాడులు చేసింది. ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) ఇచ్చిన సమాచారంతో క్రిప్టో కరెన్సీ మోసాలకు పాల్పడుతూ దాదాపు రూ.100 కోట్ల మోసానికి సంబంధించి సీబీఐ కేసు నమోదు చేసింది. కాల్ సెంటర్లను ఏర్పాటు చేసుకొని సాంకేతిక సహాయ సిబ్బందిగా వ్యవహరిస్తూ విదేశీయులే లక్ష్యంగా కొందరు మోసాలకు పాల్పడుతున్నారంటూ అమెజాన్, మైక్రోసాఫ్ట్ కంపెనీలు ఫిర్యాదు చేయడంతో సీబీఐ కేసులు నమోదు చేసింది. ఎఫ్ఐయు, ఎఫ్‌బీఐ, ఇంటర్‌పోల్‌తోపాటు ఇతర అంతర్జాతీయ విభాగాల నుంచి అందిన సమాచారం మేరకు ఆపరేషన్ చక్ర-2 చేపట్టినట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి.ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, కేరళ, తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఐదు కేసులకు సంబంధించి సోదాలు నిర్వహించారు.. తాజా సోదాల్లో తొమ్మిది కాల్ సెంటర్లపై దాడులు చేశారు. మరో రెండు కేసులకు సంబంధించిన సమాచారం వెల్లడి కావాల్సి ఉంది. ఈ ఆపరేషన్‌లో 32 మొబైల్ ఫోన్‌లు, 48 ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్క్‌లు, రెండు సర్వర్లను, 33 సిమ్ కార్డులు, పెన్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద సంఖ్యలో బ్యాంకు ఖాతాలు కూడా స్తంభింపజేసింది. 15 ఇమెయిల్ ఖాతాల డంప్‌ను స్వాధీనం చేసుకుంది. ఇందులో నిందితులకు సంబంధించిన మోసాల కీలక సమాచారం లభ్యం అయ్యిందని సమాచారం. నిందితుల కాల్స్‌ను గుర్తించకుండా తప్పించుకోవడానికి వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెక్నాలజీని ఉపయోగించారని అధికారులు గుర్తించారు. ఈ సోదాల్లో సీబీఐ అధికారులకు అనేక రాష్ట్రాల పోలీసు సైబర్ మోసాల విభాగాలు సహకరించాయి. సైబర్ నేరగాళ్లే లక్ష్యంగా గతేడాది కూడా ఆపరేషన్ చక్ర పేరుతో 115 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని వ్యతిరేకిస్తూ నేడు నిరసనలు : ప్రజాపంథా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం వివిధ జిల్లాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికా అండతో పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దుర్మార్గంగా దాడులు చేస్తున్నదని తెలిపారు. ఆస్పత్రులు, స్కూళ్లమీద బాంబులు వేసి వందలాది మందిని పొట్టన పెట్టుకుందని పేర్కొన్నారు. గాజాలోని 20 లక్షల మంది ప్రజలను ఉత్తర భాగం నుంచి 24 గంటల్లో ఖాళీ చేయాలంటూ అల్టిమేటం ఇచ్చిందని తెలిపారు. ఆ ప్రాంతాన్ని ఆక్రమించాలని ఇజ్రాయిల్ చూస్తున్నదని విమర్శించారు. 75 ఏండ్లుగా అలీన విధానాన్ని అనుసరిస్తున్న ఇండియా పాలస్తీనీయుల పక్షం వహించిందని తెలిపారు.

నవచిత్రం



18 శక్తి పీఠాల నేపథ్యంలో సర్వం శక్తిమయం

ప్రియమణి, సంజయ్ సూరి మెయిన్ లీడ్‌గా 'సర్వం శక్తిమయం' అనే వెబ్ సిరీస్‌ను ప్రదీప్ మద్దాలి తెరకెక్కించారు.

ఈ వెబ్ సిరీస్‌కు బీవీఎస్ రవి కథ అందించారు. అంకిత్, వినయ్ చద్దా, కౌముది కే నేమని ఈ వెబ్ సిరీస్‌ను సంయుక్తంగా నిర్మించారు. ఆహాలో ఈ వెబ్ సిరీస్ నేటి (శుక్రవారం) నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ వెబ్ సిరీస్‌లో మొత్తంగా పది ఎపిసోడ్‌లు ఉంటాయి.

రైటర్ బీవీఎస్ రవి మాట్లాడుతూ, 'కోన వెంకట్, కళ్యాణ్ కృష్ణ, ఐఎఎస్ ఆఫీసర్ జయేష్ రంజన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అందించిన సపోర్ట్ వల్లే మేం 18 శక్తిపీఠాల గర్భగుడిలో చిత్రీకరణ చేసుకునే అవకాశం కలిగింది. న్యాయం, చట్టం మారుతుందేమో కానీ ధర్మం మారదు. కాబట్టి దాని గురించి ఇందులో చెప్పాలని నిర్ణయించుకున్నాం. ఓ నాస్తికుడు దేవుడు లేడని నిరూపించాలని నిర్ణయించుకున్నప్పుడు పామరుడు నుంచి విజ్ఞాని వరకు ధర్మం గురించే చెబుతారు. పనిని పూజిస్తే దేవుడ్ని పూజించటం కంటే గొప్పదని చెప్పే ధర్మం కథే ఇది. హేమంత్ మధుకర్ లేకపోతే ఇది పూర్తయ్యేది కాదు. ప్రదీప్ ఎంతో గొప్ప దర్శకుడు కాబోతున్నారు. సిరాశ్రీకి థ్యాంక్స్' అని తెలిపారు. 'సర్వం శక్తిమయం లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియెన్స్. ఈ దసరా సందర్భంగా ఈనెల 20న ఈ వెబ్ సిరీస్ ఆహాలో స్ట్రీమింగ్ అవుతుంది' అని దర్శకుడు ప్రదీప్ మద్దాలి అన్నారు.

నిర్మాత కౌముది కె.నేమాని మాట్లాడుతూ, "ఏదైనా మనం బలంగా అనుకుంటే అది జరుగుతుంది. సర్వం శక్తి మయం విషయంలోనూ నేను అదే నమ్ముతున్నాను. నా టీమ్ ఎంతో కీలక పాత్రను పోషించింది. ప్రదీప్ సహా ఎంటైర్ టీమ్‌కు థ్యాంక్స్. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. 'కోవిడ్ ముందే 'సర్వం శక్తి మయం' సిరీస్‌ను ప్రారంభించాం. అయితే ఎక్కడా ఏ సమస్య రాలేదు. 18 శక్తి పీఠాల గురించి మాత్రమే కాదు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆలోచింపజేసే రీతిలో ఇందులో పలు అంశాలున్నాయి' అని నిర్మాత విజయ్ చాడ చెప్పారు.



సాయికిరణ్ దైదా, శ్రీ విష్ణు, యశ్వంత్ దగ్గుమాటి

ఆద్యంతం భయపెట్టే పిండం

హీరో శ్రీకాంత్ శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటిస్తున్న చిత్రం 'పిండం'. ఈ చిత్రంతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ చిత్ర టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని గురువారం హీరో శ్రీవిష్ణు ఆవిష్కరించి, విజయాన్ని ఆశిస్తూ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా దర్శకుడు సాయికిరణ్ దైదా మాట్లాడుతూ, 'ఇదొక కంప్లీట్ హర్రర్ చిత్రం. ఇంతటి భయానక హర్రర్ చిత్రాన్ని టాలీవుడ్ ఇంతవరకూ చూడలేదు. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ కథ ప్రస్తుతం అలాగే 1990, 1930లలో...ఇలా మూడు కాల క్రమాలలో జరిగేదిగా కనిపిస్తుంది' అని అన్నారు. 'చిత్రీకరణ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. టీజర్‌ను ఈనెల 30న, నవంబర్ నెలలో సినిమా విడుదలకు ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి తెలిపారు.



సభ్యుల సంక్షేమం ముఖ్యం : జానీ మాస్టర్



తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఎన్నికయ్యారు. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సాంగ్స్‌కు ఆయన కొరియోగ్రఫీ అందించారు.

కన్నడలో సుదీప్ 'రా రా రక్కమ్మ', హిందీలో సల్మాన్ ఖాన్ 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'లో మూడు పాటలకు కొరియోగ్రఫీ చేశారు.

పాన్ ఇండియా లెవల్‌లో క్రేజ్ సొంతం చేసుకున్న జానీ మాస్టర్ ప్రమాణ స్వీకారానికి తమిళ, కన్నడ, మలయాళ భాషల నుంచి డ్యాన్స్ డైరెక్టర్లు వచ్చారు. నిర్మాతల మండలి అధ్యక్షుడు, ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్. దామోదర ప్రసాద్ విశిష్ఠ అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కెఎల్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'పాత బాడీ కావచ్చు, కొత్త బాడీ కావచ్చు... ఎవరైనా సరే యూనియన్ సభ్యుల మంచి కోసం పని చేయాలి. నిర్మాతల మండలి అధ్యక్షుడిగా, వాణిజ్య మండలి కార్యదర్శిగా నా మద్దతు డ్యాన్సర్స్ యూనియన్ సభ్యులకు ఎప్పుడూ ఉంటుంది. పాత తరం వాళ్ళను మర్చిపోవడం చాలా ఈజీ. ముక్కు రాజు కుటుంబ సభ్యులను, పాత వాళ్ళను ఇక్కడికి తీసుకురావడం నాకు సంతోషంగా అనిపించింది. సౌత్ అంతా ఒక్కటే అని, ఒక్క తాటిలో ఉండాలని చెబుతుంటా. అందరూ కలిసి ఉండాలి. పని చేసుకోవాలి. ఈ రోజు తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి డ్యాన్స్ మాస్టర్లు రావడం విశేషం' అని చెప్పారు. 'ఈ రోజు మాకు ఇంత పేరు, ఫేమ్ వచ్చి కార్లలో తిరుగుతున్నామంటే ముక్కురాజు మాస్టర్ దయ వల్లే. మా యూనియన్ తరఫున ఆయన వారసురాలికి రెండు లక్షల రూపాయలు అందజేస్తున్నాం. చెక్ కాకుండా డైరెక్ట్ క్యాష్ ఇస్తున్నాం. ఇవాళ యూనియన్ ఈ స్థాయిలో ఉందంటే కారణం ఆయనే. డ్యాన్స్ యూనియన్లో అందరూ ఒక్కటే. మేమంతా ఒక తల్లికి పుట్టిన బిడ్డలం. డ్యాన్స్ యూనియన్ అభివృద్ధికి ఏం చేయాలనేది అందరం ఆలోచిద్దాం. ఇంతకు ముందు చెప్పినట్టు ల్యాండ్ తీసుకొస్తా. అందరి సహకారంతో సభ్యుల సంక్షేమం కోసం నావంతు కృషి చేస్తాను' అని జానీ మాస్టర్ అన్నారు.

మద్రాస్ డ్యాన్స్ యూనియన్ ప్రెసిడెంట్ దినేష్ మాస్టర్ మాట్లాడుతూ, 'ముందుచూపుతో డ్యాన్స్ యూనియన్ సభ్యుల మంచి కోసం ఏం చేయాలని ఆలోచించండి జానీ మాస్టర్' అని తెలిపారు.



రఘు, సాయికుమార్, మోహన సిద్ధిఖి

తళుకు తళుకుమను తారా..

బాహుబలి ప్రభాకర్ ప్రధాన పాత్రలో రావుల రమేష్ క్రియేషన్స్ పతాకంపై పాలిక్ దర్శకత్వంలో రావుల రమేష్ నిర్మిస్తున్న చిత్రం 'రౌద్ర రూపాయ నమః'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం నుండి సెకండ్ లిరికల్ వీడియో సాంగ్‌ను నటుడు సాయి కుమార్ లాంచ్ చేశారు. 'తళుకు తళుకుమను తారా..కులుకులొలుకు సితారా' అంటూ సాగే ఈ పాటను సురేష్ గంగుల రచించగా, జాన్ భూషణ్ స్వరపరిచారు. మ్యాంగో మ్యూజిక్ ద్వారా ఈ చిత్రం ఆడియో మార్కెట్‌లోకి విడుదలైంది.

సాయి కుమార్ మాట్లాడుతూ, 'చాలా పవర్ ఫుల్ టైటిల్. ఈ చిత్రంలోని రెండు పాటలను చూశాను. ఒకటి డ్యూయెట్, మరొకటి ఐటెమ్ సాంగ్. రెండూ సాంగ్స్ చాలా బాగా తీశారు. కొరియోగ్రాఫర్, డైరెక్టర్, రైటర్ ఇలా పాలిక్ ఆల్ రౌండర్ అని చెప్పొచ్చు. నిర్మాత కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. బాహుబలి ప్రభాకర్ అద్భుతమైన పాత్రలో నటించిన ఈ సినిమా సక్సెస్ సాధించాలి' అని అన్నారు. 'ఇప్పటికే విడుదలైన పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సాంగ్‌ని కూడా పెద్ద హిట్ చేస్తారనే నమ్మకం ఉంది' అని నిర్మాత రావుల రమేష్ చెప్పారు. దర్శకుడు పాలిక్ మాట్లాడుతూ,' సినిమా చాలా బాగా వచ్చింది. బాహుబలి ప్రభాకర్ మా సినిమాకు ఆయువు పట్టు. త్వరలో టీజర్ లాంచ్ చేయనున్నాం' అని అన్నారు.

ఆటలు

ఛేదనలో మొనగాడు శతకంలో చెలరేగాడు. బ్యాటింగ్ యువ మాస్టర్ అర్థ సెంచరీతో కదం తొక్కాడు. విరాట్ కోహ్లి (103 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (53) మెరుపులతో బంగ్లాదేశ్‌ను భారత్ బాదేసింది. 257 పరుగుల లక్ష్యాన్ని 41.3 ఓవర్లలోనే ఊదేసిన టీమ్ ఇండియా.. ప్రపంచకప్ గ్రూప్ దశలో వరుసగా నాల్గో విజయం నమోదు చేసింది. తొలుత బౌలర్లు సమిష్టిగా చెలరేగటంతో బంగ్లాదేశ్ 256 పరుగులే చేసింది. భారత్ తర్వాతి మ్యాచ్‌లో ఆదివారం న్యూజిలాండ్‌తో తలపడనుంది.

బంగ్లాను బాదేశారు

- ఛేదనలో కోహ్లి, గిల్ గర్జన
- బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం

ఐసీసీ 2023 ప్రపంచకప్



నవతెలంగాణ-పుణె

భారత్‌కు ఎదురేదీ?!. ఆసీస్, అఫ్గాన్, పాక్.. ఇప్పుడు బంగ్లాదేశ్ వరుసగా టీమ్ ఇండియా చేతిలో మట్టికరిచాయి. సొంతగడ్డపై మరోసారి ప్రపంచకప్‌ను వేటాడుతున్న టీమ్ ఇండియా గ్రూప్ దశలో వరుసగా నాల్గో విజయం నమోదు చేసింది. గురువారం పుణెలో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లి (103, 97 బంతుల్లో 97 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో అదరగొట్టాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (53, 55 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీకి తోడు కెప్టెన్ రోహిత్ శర్మ (48, 40 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరవటంతో మరో 51 బంతులు మిగిలి ఉండగానే భారత్ లాంఛనం ముగించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 256 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బ్యాటర్లలో లిటన్ దాస్ (66, 82 బంతుల్లో 7 ఫోర్లు), హసన్ (51, 43 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మహ్మదుల్లా (46, 36 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఛేదనలో శతకబాదిన విరాట్ కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

ఛేదనలో ధనాధన్ : ఛేదనలో బ్యాటర్లు విరుచుకుపడ్డారు. రోహిత్ శర్మ (48) దూకుడు కొనసాగించాడు. పవర్‌ప్లేలో బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రోహిత్‌కు గిల్ (53) తోడవటంతో 12.5 ఓవర్లలోనే భారత్ 100 పరుగుల మార్క్ అందుకుంది. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదిన రోహిత్ అర్థ సెంచరీ ముంగిట వికెట్ కోల్పోయినా.. విరాట్ కోహ్లి (103), గిల్ రెండో వికెట్‌కు మంచి భాగస్వామ్యం నమోదు చేశారు. కోహ్లికి ఆరంభంలో నో బాల్స్, ఫ్రీ హిట్స్ వేసి బంగ్లా భారీ మూల్యం చెల్లించుకుంది. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 52 బంతుల్లో శుభ్‌మన్ ప్రపంచకప్‌లో తొలి అర్థ సెంచరీ నమోదు చేశాడు. మరో ఎండ్‌లో కోహ్లి నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 48 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. శ్రేయస్ అయ్యర్ (19) నిరాశపరిచినా.. కెఎల్ రాహుల్ (34 నాటౌట్, 34 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) జతగా కోహ్లి లాంఛనం ముగించాడు. సిక్సర్‌తో వన్డేల్లో 48వ సెంచరీ పూర్తి చేసిన విరాట్ కోహ్లి..ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్ల సాయంతో 97 బంతుల్లోనే ఆ ఘనత అందుకున్నాడు. 41.3 ఓవర్లలోనే ఛేదించిన భారత్ వరుసగా నాల్గో విజయం ఖాతాలో వేసుకుంది. బంగ్లా బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ (2/47) ఆకట్టుకున్నాడు.

బౌలర్ల సమిష్టి షో : టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్‌కు ఓపెనర్లు మంచి ఆరంభాన్ని అందించారు. హసన్ (51), లిటన్ దాస్ (66) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. వికెట్ల వేటలో పేసర్లు నిరాశపరిచినా.. స్పిన్నర్లు మెరిశారు. కుల్దీప్, జడేజాలు ఓపెనర్లను సాగనంపి భారత్‌కు బ్రేక్ సాధించారు. ముష్ఫీకర్ (38), మహ్మదుల్లా (46) చివర్లో విలువైన పరుగులు జోడించారు. నజ్ముల్ (8), మెహిది (3), అహ్మద్ (14), హృదయ్ (16) తేలిపోయారు. ఫిట్‌నెస్ కారణాలతో షకిబ్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. భారత బౌలర్లలో బుమ్రా, సిరాజ్, జడేజాలు రెండేసి వికెట్లు పడగొట్టారు.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : హసన్ (ఎల్బీ) కుల్దీప్ 51, లిటన్ దాస్ (సి) గిల్ (బి) జడేజా 66, నజ్ముల్ (ఎల్బీ) జడేజా 8, మెహిది (సి) రాహుల్ (బి) సిరాజ్ 3, హృదయ్ (సి) గిల్ (బి) శార్దుల్ 16, ముష్ఫీకర్ (సి) జడేజా (బి) బుమ్రా 38, మహ్మదుల్లా (బి) బుమ్రా 46, అహ్మద్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 14, ముస్తాఫిజుర్ నాటౌట్ 1, ఇస్లాం నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (50 ఓవర్లలో 8 వికెట్లకు) 256.**

బౌలింగ్ : బుమ్రా 10-1-41-2, సిరాజ్ 10-0-60-2, హార్దిక్ 0.3-0-8-0, కోహ్లి 0.3-0-2-0, శార్దుల్ 9-0-59-1, కుల్దీప్ 10-0-47-1, జడేజా 10-0-38-2.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) హృదయ్ (బి) హసన్ 48, గిల్ (సి) మహ్మదుల్లా (బి) మెహిది 53, కోహ్లి నాటౌట్ 103, శ్రేయస్ (సి) మహ్మదుల్లా (బి) మెహిది 19, కెఎల్ రాహుల్ నాటౌట్ 34, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం : (41.3 ఓవర్లలో 3 వికెట్లకు) 261.**

బౌలింగ్ : ఇస్లాం 8-0-54-0, ముస్తాఫిజుర్ 5-0-29-0, అహ్మద్ 9.3-0-60-0, మెహిది 10-0-47-2, మహ్మదుల్లా 1-0-6-0.



ఆసీస్, పాక్ ఢీ నేడు

బెంగళూర్ : ఐసీసీ ప్రపంచకప్‌లో మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. టీమ్ ఇండియా మ్యాచ్‌కు ముందే చిన్నస్వామి, ప్రపంచకప్ శోభ సంతరించుకుంది. అగ్ర జట్లు ఆస్ట్రేలియా, పాకిస్థాన్ నేడు గ్రూప్ దశ మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఆసీస్ మూడు మ్యాచుల్లో ఓ విజయం సాధించగా.. పాకిస్థాన్ మూడు మ్యాచుల్లో ఓ పరాజయం చవిచూసింది. ఇటు ఆసీస్, అటు పాకిస్థాన్‌లు గ్రూప్ దశలో టీమ్ ఇండియా చేతిలో పరాజయాలు అందుకున్నాయి. నాకౌట్ బెర్త్‌లు తేల్చేది అగ్రజట్ల నడుమ మ్యాచులే కావటంతో నేడు ఆసీస్, పాక్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నేడు పాక్‌తో మ్యాచ్‌లో ఓడితే.. కంగారూల సెమీఫైనల్ అవకాశాలు మరింత సంక్లిష్టం కానుండటంతో పాట్ కమిన్స్ సేనపై అదనపు ఒత్తిడి కనిపిస్తుంది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కానుంది.

హార్దిక్‌కు గాయం : భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య గాయం బారిన పడ్డాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్లో లిటన్ దాస్ ఆడిన బంతిని కుడి కాలుతో ఆపేందుకు ప్రయత్నించిన పాండ్య చీలమండ గాయానికి గురయ్యాడు. బాధతో మైదానం వీడిన పాండ్య మళ్లీ ఫీల్డింగ్‌కు రాలేదు. బ్యాటింగ్ చేయాల్సిన అవసరం రాలేదు. ఆదివారం కివీస్‌తో మ్యాచ్ నేపథ్యంలో పాండ్య ఫిట్‌నెస్‌పై జట్టు మేనేజ్‌మెంట్ ఆందోళనగా ఉంది.



హెచ్‌సీఏ పీఠం ఎవరిదో?

- తొలిసారి హెచ్‌సీఏలో బహుముఖ పోటీ
- అపెక్స్ కౌన్సిల్‌కు నేడు ఎన్నికలు

నవతెలంగాణ-హైదరాబాద్

వివాదాలు, అవినీతి, కోర్టు కేసులు, అగమ్యగోచరంగా క్రికెట్.. క్లుప్తంగా గత కొన్నేండ్లుగా హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అంటే ఇదే!. సుప్రీంకోర్టు నియమిత ఏకసభ్య కమిటీ తీసుకున్న సంచలన నిర్ణయంతో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌లో పోటీపడేందుకు అందరికీ సమాన అవకాశం దక్కింది. దీంతో హెచ్‌సీఏ చరిత్రలోనే తొలిసారి అపెక్స్ కౌన్సిల్‌కు బహుముఖ పోటీ నెలకొంది. అపెక్స్ కౌన్సిల్‌లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు తోడు కౌన్సిలర్ పదవికి సైతం నేడు ఎన్నికలు జరుగనున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ వి.ఎస్ సంపత్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తుండగా.. నేడు ఉప్పల్ స్టేడియంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు పోలింగ్ జరుగనుంది. 101 క్లబ్ కార్యదర్శులు, 48 ఇన్‌స్టిట్యూట్‌లు, 9 జిల్లా క్రికెట్ సంఘాలు, 15 మంది అంతర్జాతీయ క్రికెటర్లు నేడు హెచ్‌సీఏ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 3 గంటలకు పోలింగ్ ముగియనుండగా.. సాయంత్రం 6 గంటల లోపు ఎన్నికల ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది.

బరిలో ప్రభుత్వ అభ్యర్థి! : హెచ్‌సీఏ ఎన్నికల్లో నాలుగు ప్యానల్స్ పోటీపడుతుండగా.. ఇందులో ఓ ప్యానల్‌కు తెలంగాణ ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న అర్శినపల్లి జగన్‌మోహన్ రావుకు రాష్ట్ర మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, తన్నీరు హరీశ్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలు మద్దతు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. దీంతో, ప్రభుత్వ సూచనల మేరకు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే 48 ఇన్‌స్టిట్యూట్‌లు జగన్‌మోహన్ రావుకు ఓటేస్తాయని అంచనా. నాలుగు ప్యానల్స్ పోటీలో ఓట్లు చీలనుండగా.. మ్యాజిక్ ఫిగర్ 60-70 మధ్య ఉండవచ్చని తెలుస్తోంది. అయితే, హెచ్‌సీఏ మాజీ బాస్‌లు శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్‌లో ఓ ప్యానల్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఏండ్లుగా హెచ్‌సీఏను ఏలుతున్న శివలాల్ యాదవ్ చరిష్మా ఇప్పటికీ ఉందా అనేది అనుమానం. హెచ్‌సీఏ నుంచి నష్ట పరిహారం సొమ్ము కోసం ఎదురుచూస్తున్న మాజీ అధ్యక్షుడు వివేక్ వెంకటస్వామి సైతం ఓ ప్యానల్‌కు దన్నుగా నిలిచారు. క్రికెట్ అభివృద్ధికి కేటాయించాల్సిన సొమ్మును ఓ ప్రయివేటు సంస్థకు చెల్లిస్తే.. ఇక హెచ్‌సీఏ బాగు పడేదెలా అనే ప్రతికూల ప్రచారం క్లబ్ కార్యదర్శుల్లో ఉండటం ఆ ప్యానల్‌కు బలహీనతగా మారొచ్చు. ఇండిపెండెంట్‌గా పోటీచేస్తున్న పీఎల్ శ్రీనివాస్ ప్యానల్ సైతం హెచ్‌సీఏను బాగు చేసేందుకు మంచి మ్యానిఫెస్టోతో ముందుకొచ్చింది. సాధారణ సమీకరణాలకు తోడు మరెన్నో ఇతర అంశాలు ప్రభావితం చేసే హెచ్‌సీఏ ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారనేది చెప్పటం అంత సులభం కాదు.

పోటీపడుతున్న అభ్యర్థులు వీరే : నాలుగు ప్యానల్స్ నుంచి అపెక్స్ కౌన్సిల్‌కు పోటీపడుతున్నారు. బహుముఖ పోటీలో మిగతా అభ్యర్థుల కంటే ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థి పదవి దక్కించుకోనున్నారు. అధ్యక్ష పదవికి జగన్‌మోహన్ రావు, అమర్‌నాథ్, అనిల్ కుమార్, పీఎల్ శ్రీనివాస్.. ఉపాధ్యక్ష పదవికి బాబురావు, శ్రీనివాస రావు, శ్రీధర్, సర్దార్ దల్జీత్ సింగ్.. కార్యదర్శి పదవికి దేవరాజ్, ఆగమ్ రావు, హరి నారాయణ రావు, ఆర్‌ఎం భాస్కర్.. సంయుక్త కార్యదర్శి పదవికి చిట్టి శ్రీధర్, నోయెల్ డేవిడ్, సతీశ్ చంద్ర, బసవరాజు.. కోశాధికారి పదవికి శ్రీనివాసరావు, సంజీవ రెడ్డి, జెరార్డ్ కార్, మహేంద్రలు పోటీపడుతున్నారు. కౌన్సిలర్ పోస్టు కోసం వాల్టర్, అన్సార్ అహ్మద్ ఖాన్, సునీల్ కుమార్, వినోద్ కుమార్‌లు బరిలో నిలిచారు.



క్వార్టర్స్‌లో సింధు

- గ్రెగోరియపై మెరుపు విజయం
- డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750

ఒడెన్సె (డెన్మార్క్) : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి సింధు ఎట్టకేలకు గాడిలో పడినట్టు కనిపిస్తుంది. డెన్మార్క్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్న తెలుగు తేజం.. రెండో రౌండ్ మ్యాచ్‌లో ఆకట్టుకునే విజయం సాధించింది. ఏడో సీడ్, ఇండోనేషియా షట్లర్ గ్రెగోరియ మరిస్కతో మూడు గేముల మారథాన్ మ్యాచ్‌లో సింధు గెలుపొందింది. తొలి గేమ్‌లో నిరాశపరిచిన సింధు.. వరుసగా చివరి రెండు గేముల్లో విజయాలు సాధించి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. 71 నిమిషాల మ్యాచ్‌లో సింధు 18-21, 21-15, 21-13తో విజయం సాధించింది. తొలి గేమ్‌లో 4-4 తర్వాత వెనుకంజ వేసిన సింధు మళ్లీ పుంజుకోలేదు. కానీ రెండో గేమ్‌లో ఆది నుంచి ముందంజలో నిలిచింది. 14-14తో ఇండోనేషియా అమ్మాయి సమవుజ్జీగా నిలిచినా సింధు వెనక్కి తగ్గలేదు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సైతం గ్రెగోరియ గట్టి పోటీ ఇచ్చింది.

ప్రథమార్థంలో ఉత్కంఠగా సాగిన పోరును ద్వితీయార్థంలో ఏకపక్షం చేసింది సింధు. ఇక నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్లో థాయ్‌లాండ్ షట్లర్ సుపనిదతో సింధు తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో యువ షట్లర్ ఆకర్షి కశ్యప్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. 18-21, 8-21తో సుపనిదతో రెండో రౌండ్లో వరుస గేముల్లో పరాజయం పాలైంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886